నవతెలంగాణ
వరంగల్, హనుమకొండ, జనగామ
మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి
మంగళవారం 08 ఆగస్టు 2023

వరద బాధితులను ఆదుకోవాలి

జీడబ్ల్యూఎంసీ ఎదుట సీపీఐ(ఎం) ధర్నా

నవతెలంగాణ - మట్టెవాడ

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ప్రజలు తీవ్రంగా నష్టపోయి సర్వస్వం కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నా బల్దియా పట్టించుకోకవట్లేదని, వెంటనే వరద బాధితులను ఆదుకోవాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. సోమవారం పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జీడబ్ల్యూఎంసీ కార్యాలయం ఎదుట ప్రజలతో కలిసి బైటాయించి నిరసన తెలిపి ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. వరంగల్ జిల్లాలోని వివిధ డివిజన్ల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం సీపీ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సింగారపు బాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు జగదీష్ మాట్లాడుతూ... వరంగల్ నగరంలో వర్షాలు దంచి కొడితే ప్రజలు సర్వస్వం కోల్పోయారని అన్నారు. వారిని బల్దియా పట్టించుకోకపోవడం దురదష్టకరమని అన్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారుల వైఫల్యం, అండర్ డ్రయినేజీల అస్తవ్యస్తం, మందస్తు ప్రణాళిక లోపం కారణంగానే ప్రజలు ముంపనకు గురయ్యారని అన్నారు. బల్దియ అధికారులు రూ.427.84 కోట్ల నష్టం వచ్చిందని కేంద్రానికి నివేదిక పంపారని, అది తప్పుల తడకగా ఉందని అన్నారు. నష్టం రూ.17వేల కోట్లకు పైనే జరిగిందని ఆరోపించారు. ఇండ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయని విలువైన వస్తువులు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాయని అన్నారు. వ్యాపార వాణిజ్య సముదాయాలు నీటి పాలయ్యాయని, వర్షానికి గోడ కూలి మరణించిన సంఘటనలు కూడా ఉన్నాయని తెలిపారు. వెంటనే వరద బాధితులందరిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మరణించిన పైడిపల్లికి చెందిన రావిరాకుల విజయ్ కుటుంబానికి రూ.25 లక్షలు చెల్లించాలని, ఇండ్లు కూలిన వారికి రూ.5లక్షలు అందించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ వరంగల్ నగరానికి రూ.250కోట్లు ప్రకటించాడని, అది దేనికి సరిపోతుందని ఎద్దేవా చేశారు. రూ.17వేల కోట్లు అందించాలని అన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, కబ్జాదారులు చెరువులు, కుంటలు, నాళాలను ఆక్రమించి కట్టడాలు కట్టడం వల్లే నగరం వరదల్లో తేలిందని కళ్ళ ముందే కబ్జాలు అవుతున్నా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం వల్లే ఇంతటి ప్రకతి విపత్తు సంభవించిందని అన్నారు. నాలాలపై ఉన్న అక్రమ కట్టడాలను తొలగించాలని, చెరువులు కుంటలను కాపాడలని అక్రమదారులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లా కార్యదర్శి చింతమల్ల రంగయ్య మాట్లాడుతూ... వరంగల్ నగరాన్ని వరదలు ముంచెత్తి 13 రోజులు గడిచాయని, కాలనీల్లో చెత్తాచెదారం కుప్పలు కుప్పలుగా పేరుకుపోయాయని అన్నారు. బ్లీచింగ్, దోమల నివారణకు ఫాగింగ్ లాంటి చర్యలు ఇప్పటికీ చేపట్టలేదని విమర్శించారు. మురుగు వాడల్లో ప్రజలు అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నారని, వారికి ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలని అన్నారు. వరద బాధితులకు నెల రోజులకు సరిపడా నిత్యవసర వస్తువులు అందించాలని అన్నారు. పూర్తిగా దెబ్బతిన్న ఇండ్లకు గహలక్ష్మి పథకాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ముక్కెర రామస్వామి, నలిగంటి రత్నమాల, జిల్లా కమిటీ సభ్యులు మాలోతు సాగర్, బషీర్, అకినేపల్లి యాదగిరి, అరూరి కుమార్ పాల్గొన్నారు.





పేదల పోరాటం ఆగదు : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-మహబూబాబాద్

అర్హులైన పేదలందరికీ ఇండ్లు, ఇంటి స్థలాలు, పట్టాలు వచ్చేవరకు పేదల పోరాటం ఆగదని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సీపీఐ(ఎం) కార్యాలయం నుంచి భారీ ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనతరం తహసీల్దార్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ... కేసీఆర్ తొమ్మిదిన్నర సంవత్సరాల క్రితం ఎన్నికల ముందు ఇల్లు లేని పేదవాలు లేకుండా చేస్తానని 120 గజాల స్థలం ఇస్తానని వాగ్దానాలు చేశాడని గుర్తు చేశారు. అర్హులైన పేదలు 10 సంవత్సరాల నుండి ఇండ్ల స్థలాల కోసం ఎదురుచూచి చూచి విసిగి పోయి ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతుంటే చూడలేక ప్రభుత్వ భూమిలో పేదలు గుడిసెలు వేసుకున్నారని అన్నారు. కానీ, పేదలపై ప్రభుత్వం, అధికారులు దమనకాండ సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు వద్దులు అని చూడకుండా కేసులు పెడుతున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సూర్ణపు సోమయ్య, జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి, పట్టణ కార్యదర్శి భానోత్ సీతారాం, కుర్ర మహేష్, పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు చీపిరి యాకయ్య, హేమా నాయక్, పట్టణ కమిటీ సభ్యులు కుమ్మరి కుంట్ల నాగన్న, యమగాని వెంకన్న, బానోతు వెంకన్న, తోట శ్రీను పాల్గొన్నారు.

టీజీవో సంఘం సేవలు అభినందనీయం

జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

నవతెలంగాణ-భూపాలపల్లి



భూపాలపల్లి జిల్లా తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అతలాకుతలమైన మొరన్చపల్లి, ఇతర గ్రామాలకు చేయూతనివ్వాలనే సంకల్పంతో టీజీఓ జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఆధ్వర్యంలోగెజిటెడ్ అధికారులు, వైశ్య గెజిటెడ్ అధికారుల నుండి విరాళాలుగా రూ.227122 సేకరించారు. సంబంధిత చెక్కును జిల్లా అధ్యక్షులు సామ్యూల్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అధికారులు తమ వంతుగా అందించిన ఈ సహకారాన్ని వరదల ద్వారా సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు అందిం చేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆర్థిక సహకారం అందించిన టిజిఓ అధికారులకు కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు సామ్యూల్, కార్యదర్శి పెద్ద ఆంజనేయులు, సహాధ్యక్షులు శైలజ జాయింట్ సెక్రటరీ వి. శ్రీధర్, వైస్ ప్రెసిడెంట్ సంజీవరావు , జెడ్పీ సీఈవో విజయలక్ష్మి, డీపీఓ ఆశాలత, డీఏఓ విజయభాస్కర్ ఎంపీడీవోలు అరుంధతి సురేందర్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కొండాయి బాధితులకు

ఆధార్, రేషన్ కార్డులు పంపిణీ

ప్రభుత్వం అండగా ఉంటుంది : జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

నవతెలంగాణ-ఏటూరునాగారం ఐటీడీఏ



కొండాయి గ్రామ వరద బాధితులను సోమవారం జిల్లా కలెక్టర్ బాధితులకు ఆధార్ కార్డు, రేషన్ కార్డులను అందజేశారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ గిరిజన భవన్ లో భారీ వర్షాల కారణంగా వరదలలో కొట్టుకుపోయిన కొండాయి గ్రామ ప్రజల పునరావాస కేంద్రం లోనే మీసేవ, ఆధార్ సెంటర్ లను ఏర్పాటు చేయించి, ఆధార్ కార్డ్, రేషన్ కార్డులను జిల్లా కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా వరదలలో కొట్టుకుపోయిన బాధితులు అందరికి ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు అందజేసేందుకు మూడు ఆధార్ బయోమెట్రిక్, ఐదు మీసేవ టేబుల్స్‌తో ఆపరేటర్లను ఏర్పాటు చేశామన్నారు. బ్యాంక్ పాస్ పుస్తకాలు, ఇతర సర్టిఫికెట్లు, త్వరలో వాటి నకళ్లు ఇప్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరు ఆందోళన చెందొద్దని ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ వసంతరావు, డీడీ పోచం, డీటీడీఓ దేశిరం, తహసీల్దార్ వీరస్వామి, ఎంపీడీఓ కుమార్, కొండాయి సర్పంచ్ కాక వెంకటేశ్వర్లు, ఈడిఎం దేవేందర్, మీసేవా కోఆర్డినేటర్ విజయ్ పాల్గొన్నారు.

పత్తి పంటను అధిక సాంద్రత పద్ధతిలో విత్తుకోవాలి

వరంగల్ ప్రాంతీయ పరిశోధన శాస్త్రవేత్తలు

నవతెలంగాణ-భూపాలపల్లి



పత్తి పంటను అధిక సాంద్రత పద్ధతిలో విత్తుకోవాలని,అపరాల పంటలను సాగు చేసుకోవాలని వరంగల్ ప్రాంతీయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు రామ్ ప్రసాద్,వీరన్న, మధు అన్నారు. సోమవారం కొంపల్లి గ్రామంలో పర్యటించి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తిలో రసం పీల్చే పురుగులైన పేనుబంక,పచ్చదోమ,పిండి నల్లి నివారణకు మోనోక్రోటోఫాస్ 2మి.లీలు లీటర్ నీటికి, ఎసీఫేట్ 1.5గ్రాములు లీటర్ నీటికి పిచికారి చేసుకోవాలని తెలిపారు. .పత్తిలో సన్న గడ్డి వెడల్పాటి గడ్డి నిర్మూలనకు లీటర్ నీటిలో క్విజలోపాప్ ఈథైల్ లేదా లీటర్ నీటికి 1.25ఎం.ఎల్ ల ప్రొపాక్విజపాప్ మరియు పైరితయోబాక్ సోడియం ను లీటర్ నీటిలో 1.25 మి.లీను పిచికారి చేసుకోవాలని సూచించారు. పెరుగుదల కుంటిపడిన పత్తి పంటలో 25 కేజీల యూరియా,15కేజీల పొటాష్ వేసుకోవాలన్నారు..19.19.19లను లీటర్ నీటికి 10 గ్రాముల చొప్పున వారానికి రెండు సార్లు పిచికారి చేసుకోవా లన్నారు. రసం పీల్చే పురుగుల నివారణకు ముందు జాగ్రత్తగా వేప నూనె లీటర్ నీటిలో 5 మి.లీలను కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. ప్రతి సారి పురుగు మందులు పిచికారీ చేసే సమయంలో న్యూట్రిఎంట్స్‌ను కలుపు కోవాలని తెలిపారు. ఒక పురుగు మందును మాత్రమే పిచికారీ చేయడం వలన పురుగు మందుల ఖర్చును తగ్గించుకోవచ్చున్నారు.ప్రత్యామ్నాయ పంటల సాగుపై దష్టి సారించి అధిక లాభాలు పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎం సతీష్ కుమార్, ఏఈఓ కళ్యాణ్, రైతులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రేగొండ : ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలను సోమవారం ప్రాంతీయ పరిశోధన కేంద్రం, వరంగల్ శాస్త్రవేత్తలు రేగొండ మండల కేంద్రంలోని పత్తి పంటను మండల వ్యవసాయ అధికారి వాసుదేవ రెడ్డితో కలిసి పరిశీలించారు. పత్తి పంటకు ఈ సమయంలో చేయాల్సిన వలు సూచనలను రైతులకు సూచించారు. ప్రధాన శాస్త్రవేత్త వీరన్న, సీనియర్ శాస్త్రవేత్త రాంప్రసాద్, అగ్రానమిస్ట్, మధు వ్యవసాయ విస్తరణ అధికారి పి సునిల్‌కుమార్ పాల్గొన్నారు.

వర్ధన్నపేట కాంగ్రెస్‌లో ఆశావహులు అధికం..

మారుతున్న రాజకీయం

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి



వర్ధన్నపేట (ఎస్సీ) నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం ఆశావహుల సంఖ్య పెరుగుతుండడం చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పోలీసు అధికారిగా పనిచేసిన కెఆర్ నాగరాజు ఇటీవల ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున్ ఖర్గే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. జిల్లాలో నాగరాజు ఎస్సై నుండి ఎస్పీ స్థాయి వరకు ఎదిగి ఇటీవలె పదవీ విరమణ చేశారు. ఈ క్రమంలో వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ టికెట్ కోసం ఆయన రాజకీయ ఆరంగేట్రం చేస్తున్నట్లు ప్రచారం జరిగింది. తాజాగా వర్ధన్నపేట నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలు కె.ఆర్. నాగరాజును వర్ధన్నపేట నియోజకవర్గం నుండి పోటీ చేయాల్సిందిగా కోరినట్లు ఇందుకు ఆయన సుముఖత వ్యక్తం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ఈ నియోజకవర్గం కోఆర్డినేటర్‌గా నమిండ్ల శ్రీనివాస్ పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తూ వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య కూడా వర్ధన్నపేట శాసనసభ స్థానం నుండే పోటీ చేస్తారని ప్రచారం. తాజాగా కెఆర్ నాగరాజు నజర్ కూడా వర్ధన్నపేటపై పడడంతో కాంగ్రెస్ రాజకీయాలు రసవత్తరంగా మారనున్నాయి.

వర్ధన్నపేట నియోజకవర్గ బీఆర్ఎస్‌లోనే కాదు.. కాంగ్రెస్‌లోనూ సమీకరణలు మారుతున్నాయి. కాంగ్రెస్ నుండి పోటీ చేసి ఒక పర్యాయం గెలిచి, అనంతరం జరిగిన ఎన్నికల్లో ఓడిపోయిన కొండేటి శ్రీధర్ కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరాక, ఈ నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తగా నమిండ్ల శ్రీనివాస్ వ్యవహరిస్తున్నారు. పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ టికెట్‌పై బరిలోకి దిగడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో తాజాగా మాజీ పోలీసు అధికారి కెఆర్ నాగరాజు కాంగ్రెస్‌లో చేరడంతో కాంగ్రెస్ రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. ఇప్పటి వరకు పార్టీ వర్గాల్లో 'నమిండ్ల' లేదా 'సిరిసిల్ల' ఇద్దరిలో ఒకరికి పార్టీ టికెట్ దక్కుతుందని భావించిన రాజకీయ వర్గాలు, తాజాగా మాజీ పోలీసు అధికారి రంగ ప్రవేశంతో సమీకరణలు మారుతున్నాయని భావిస్తున్నారు. స్వతహాగా కెఆర్ నాగరాజు వరంగల్ లోక్‌సభ స్థానం నుండి కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేయాలని భావించినా, తాజాగా నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలు నాగరాజును వర్ధన్నపేట అసెంబ్లీకి పోటీ చేస్తే గెలుపు సునాయసమవుతుందని చెప్పినట్లు సమాచారం. దీంతో ఆయన ఈ దిశగా యోచిస్తున్నట్లు సమాచారం. ఏదేమైనా కాంగ్రెస్ పార్టీలోనూ ఆశావహుల మధ్య పోటీ తీవ్రం కావడం ఆసక్తికరంగా మారింది.

లోక్‌సభా..? అసెంబ్లీనా..?

మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య గతంలో వరంగల్ లోక్‌సభ స్థానం నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగి ఎంపిగా విజయం సాధించారు. అనంతరం ఎన్నికల్లో ఓడిపోయారు. వరంగల్ లోక్‌సభ నియోజకవర్గంలో అనంతరం జరిగిన ఉప ఎన్నికల్లో పార్టీ టికెట్ ఖరారు చేసిన క్రమంలో ఆయన కోడలు తన కుమారులతో సహా ఆత్మాహుతికి పాల్పడి మృతిచెందడంతో 'సిరిసిల్ల'కు బి ఫారం పార్టీ తిరస్కరించింది. అనంతరం 'సిరిసిల్ల'పై కేసు నమోదు కావడం ఇటీవలె ఆ కేసు కొట్టివేయడంతో మళ్లీ ఆయన రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ క్రమంలో మళ్లీ వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ టికెట్‌పై పోటీ చేయాలని భావిస్తున్నారు. రాష్ట్రంలో పార్టీ గ్రాఫ్ పెరుగుతుండడంతో వర్ధన్నపేట శాసనసభ స్థానం నుండి పోటీ చేసి ఎమ్మెల్యేగా విజయం సాధిస్తే మంత్రివర్గంలో అవకాశం దక్కే ఛాన్స్ వుంటుందని ఆయన వర్గం భావిస్తుంది. ఈ క్రమంలో వర్ధన్నపేట నుండి పార్టీ టికెట్ ఇస్తే బరిలోకి దిగాలని ఆయన భావిస్తున్నారు. తాజాగా కాంగ్రెస్‌లో చేరిన కెఆర్ నాగరాజు అటు వరంగల్ లోక్‌సభ స్థానం, ఇటు వర్ధన్నపేట నియోజకవర్గాలలో దేనిని ఎంచుకుంటారోనని పార్టీ వర్గాల్లో చర్చ సాగుతుంది. కెఆర్ నాగరాజుకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎక్కువ కాలం పోలీసు అధికారిగా పనిచేయడంతో ఇక్కడ ప్రజాప్రతినిధులు, ప్రజలతో నిత్యసంబంధాలు కలిగి వున్నారు. ఈ సంబంధాలు వచ్చే ఎన్నికల్లో ఉపయోగపడుతాయని ఆయన భావిస్తున్నారు. 'నమిండ్ల' వర్ధన్నపేట శాసనసభ స్థానం నుండే పార్టీ టికెట్‌నాశిస్తున్న విషయం విదితమే. 'సిరిసిల్ల', కెఆర్ నాగరాజులు మాత్రం అటు వరంగల్ లోక్‌సభతోపాటు, ఇటు వర్ధన్నపేట అసెంబ్లీ నియోజకవర్గాలపై దృష్టి కేంద్రీకరించారు. కాంగ్రెస్ పార్టీలో చేరికలతో ఆశావహుల సంఖ్య పెరుగుతుండడం గమనార్హం. ఏదేమైనా ఇప్పటి వరకు వర్ధన్నపేట నియోజకవర్గంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యేకు గట్టి పోటీ లేదని ప్రచారం జరిగింది. కాంగ్రెస్‌లో తాజా చేరికలతో ఆశావహుల సంఖ్య పెరుగుతుండడం సిట్టింగ్ ఎమ్మెల్యేను ఓడించాలంటే నిత్య సంబంధాలు కలిగి ఆర్థిక శక్తి వున్న నేతనే ఎంపిక చేయాలని పార్టీ నాయకత్వం భావిస్తుండడంతో ఈ దిశగా ఆశావహులు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

వెట్టిచాకిరి చేసినందుకేనా... ఇంతటి నిర్లక్ష్యం ?

రోడ్డుపై బైఠాయించి జీపీ కార్మికుల భారీ నిరసన

నవతెలంగాణ - స్టేషన్‌ఘన్‌పూర్

తెల్లవారింది మొదలు... ప్రజల ఆరోగ్యంకై తమ ప్రాణాలకు సైతం లెక్కచేయకుండా గ్రామస్థాయిలో వెట్టి చాకిరి చేసిందుకేనా... కేసీఆర్ ప్రభుత్వం తమపై ఇంతటి నిర్లక్ష్యం వహిస్తున్నదని గ్రామ పంచాయతీ కార్మికులు ధ్వజమెత్తారు. సోమవారం నియోజక వర్గ కేంద్రంలో గాంధీ విగ్రహం వద్ద పెద్దయెత్తున రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా నాయకులు గూడూరి భాస్కర్ మాట్లాడుతూ.. అన్ని వర్గాల వారిని కేసీఆర్ ఆదుకుంటున్నాడని, క్షేత్రస్థాయిలో చాకిరి చేసే మా బ్రతుకులకు న్యాయం జరిగేలా తమ డిమాండ్లను పరిష్కరించాలని 33రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. తామేమీ గొంతెమ్మ కోరికలు నెరవేర్చమని అడగడం లేదని అన్నారు. సమాన పనికి సామాన వేతనం అందడం లేదని, జీఓ 51 సవరణతోపాటు జీఓ 60 ప్రకారం మున్సిపాలిటీ కార్మికులతో సమానంగా వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొడేపాక యాకయ్య మాట్లాడుతూ గ్రామ పంచాయితీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. గ్రామాల అభివద్ధిలో ఉత్తమ పంచాయతీల ఏర్పాటులో జాతీయస్థాయిలో అవార్డులు పొందుతున్నారని, తెలంగాణ రాష్ట్రం ఉత్తమంగా నడుస్తున్నదంటే అందుకు నిదర్శనం గ్రామపంచాయతీ కార్మికులేనని, పలుమార్లు చెప్పుకున్నది వాస్తవం కాదా అని అన్నారు. ఇలాంటి ఉత్తమ గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులు, పచ్చదనం, పరిశుభ్రత లేకుండా, గ్రామపంచాయతీ కార్మికుల సేవలు లేనిదే ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డులు వచ్చాయాని దుయ్యబట్టారు. మండల అధ్యక్షుడు కందాలోజు రాజు, చిల్పూర్ అధ్యక్షుడు జీడి ఆనందం, ప్రధాన కార్యదర్శి రావుల జగన్నాథం, రాజు, చిరంజీవి, కాసాని పెద్దులు, చంద్ర మౌళి, బండ బాల నర్సు, రాజేష్, ఇస్లావత్ రాజశేఖర్, శ్రీనివాస్, గుర్రం లాజర్, కుమార్, వెంకన్న, నాగరాజు, వినయ్, అంజి, లక్ష్మి, రమ, ఎల్లమ్మ, కోమల, అనిత, తదితరులు పాల్గొన్నారు.



జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ములుగు : గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, జీవో 60లో పేర్కొన్న వేతనాలను కేటగిరీ వారిగా పంచాయతీ కార్మికులకు రూ.15600, కారోబార్, బిల్ కలెక్టర్‌కు, అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శులుగా ప్రమోషన్ ఇవ్వాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె 33వ రోజు కొనసాగింది. సోమవారం తాళ్లపాడు సెంటర్‌లో రాస్తా రోకో చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ మాట్లాడుతూ... రాష్ట్రమేర్పడి తొమ్మిది సంవత్సరాలు పూర్తయినప్పటికీ, రాష్ట్రం లో ఉన్న ఇతర ఉద్యోగులు అందరికి వేతనాలు పెంచి పంచాయతీ సిబ్బంది వేతనాలు పెంచకపోవడం చాలా అన్యాయమన్నారు. సిబ్బంది అందరికి ఉద్యోగ భద్రత, కనీసవేతనాలు, పిఎఫ్, ఈఎస్ఐ, ప్రమాదం భీమా సౌకర్యం కల్పించాలనీ అన్నారు.మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని అన్నారు. లేదంటే ఆందోళన కార్యక్రమాలు ఉదతం చేస్తామని అన్నారు. యూనియన్ నాయకులు చెవుల రాజయ్య, కొయ్యల రవీందర్, సాంబయ్య, శంకర్, లావుడ్యా వాగు,ప్రభాకర్, కళ్లెం రమేష్, శ్రీధర్, శేఖర్ భద్రయ్య, కొమురమ్మ పాల్గొన్నారు.

వైన్స్ షాప్ యజమానులపై చర్యలు తీసుకోవాలి

ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు

నవతెలంగాణ - ములుగు




పస్రా గ్రామంలోని సమ్మక్క సారక్క ,లక్ష్మి నరసింహ వైన్ షాప్ యజమా నులు అధిక లాభాల కోసం బెల్టు షాపు ప్రోత్సహిస్తూ ఎమ్మార్పీ ధరకు కాకుండా అధిక ధరకు మద్యం విక్రహిస్తున్నారని, చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం), ఐద్వా నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ములుగు ఎక్సైజ్ కార్యాలయంలో ఎస్సైకి వారు ఫిర్యాదు చేసి మాట్లాడారు. బెల్టు షాపులను ప్రోత్సహిస్తూ హెూల్ సేల్ కౌంటర్ లను ఏర్పాటు చేసి బెల్టుషాపుల వారికి అధిక రేట్లకు మద్యం విక్రయిస్తూ ప్రజల సొమ్ము దోపిడి చేస్తున్నారని అన్నారు. కనీసం మంచినీళ్ల కూడా ఇవ్వకుండా మంచినీళ్లకు డబ్బులు వసూలు చేస్తున్నారని, గ్లాసులకు కూడా అధిక రేట్లు వసూలు చేస్తున్నారని అన్నారు. మద్యంలో కల్తీ చేస్తున్నారని అన్నారు. విజిలెన్స్ అధికారులు చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కమిషనర్ కు, జిల్లా కలెక్టర్ కు జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులను కోరుతున్నామని అన్నారు. విచారణ చేపట్టి సదరు షాప్‌లను సీజ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమములో పొదిళ్ళ చిట్టిబాబు, ముమ్మది ఉపెంద్రా చారీ, అమ్జద్ పాషా, లావుద్య అచ్చమ్మ, కారం రజిత గండికోట సీత, మంచాల కవిత,జిమ్మ జ్యోతి పాల్గొన్నారు.

నార్లు ఎండిపోతే బాధ్యులు ఎవరు ?

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు సూడి కృష్ణారెడ్డి

నవతెలంగాణ-గోవిందరావుపేట



ఇప్పటివరకు రైతులు నాట్లు వేయకపోవడం, నార్లు ఎండిపోవడం వ్యవసాయం వెనుకబడి పోవడానికి బాధ్యులు ఎవరు బాధ్యత ఎవరు వహిస్తారని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నాయకులు సూడి కృష్ణారెడ్డి ప్రశ్నించారు. సోమవారం మండల కేంద్రంలో లక్నవరం ప్రధాన కాలువల గండ్లను పూడ్చా లని 163వ జాతీయ రహదారిపై రైతుల రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా యాన పాల్గని మాట్లాడారు. జులై 26 కురిసిన భారీ వర్షాలకు లక్నవరం చెరువు కాలువలకు గండ్లు పడి పది రోజులు అయినా నీటిపారుదల శాఖ అధికారులు ఇంతవరకు కాలువ గండ్లు పూడ్చలేదన్నారు. అధికారుల నిర్లక్ష్య వైఖరి ఫలితంగా మండలంలో రైతుల వేలాది ఎకరాల నార్లు, నాట్లు ఎండిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. తక్షణమే అధికారులు టెండర్ ప్రకారంగా నామినేట్ పద్ధతిలో వెంటనే మరమ్మతులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తుమ్మల వెంకట్ రెడ్డి గుండు రామస్వామి, బొబ్బ సత్తిరెడ్డి, వల్లపు నరసయ్య, లావుడియా హరి, పాపాయిపల్లి సర్పంచ్ దారావత్ రాకేష్, లక్ష్మణ్, మట్ట వెంకట పాపిరెడ్డి, ఏనుగు యాదిరెడ్డి, నరహరి పాల్గొన్నారు.



పద్మశాలీలపై వివక్ష తగదు

పద్మశాలిబంధు ప్రకటించాలి

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

నవతెలంగాణ - మట్టెవాడ

స్వరాష్ట్రంలో పద్మశాలీలపై వివక్ష తగదని, వారికి పద్మశాలీబంధు ప్రకటించాలని పద్మశాలీలు ముక్తకంఠంతో డిమాండ్ చేశాయి. సోమవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నగరంలోని కొత్తవాడలో వరంగల్ జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అన్ని రాజకీయ పార్టీలకు చెందిన పద్మశాలీలు ఐక్యంగా చేనేత మగ్గానికి పూలమాలలు వేసి ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం పద్మశాలీలను ఓటుంబ్యాంక్ గానే చూస్తుందని, దీంతో రాజకీయంగా వారు అణిచివేతకు గురౌతున్నారని అన్నారు. జనాభా ప్రాతిపదికన పద్మశాలీలకు 10 ఎమ్మెల్యే, 3ఎంపీ, 3ఎమ్మెల్సీ, వార్డు సభ్యుల నుండి జెడ్పీటీసీ వరకు రాజకీయ హక్కులు సాధించు కోవాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. పద్మశాలీలు ఏకీకతమై పార్టీలకు అతీతంగా చేయూతనిచ్చుకోవాలన్నారు. అప్పుడే రాజకీయంగా అన్నివర్గాలతో పోటీ పడగలమని సూచించారు. పదవుల కోసం పద్మశాలీ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టే నాయకులకు బుద్ధి చెప్పాలని అన్నారు. నిత్యం పద్మశాలి క్షేత్రంలో ఉండే నాయకులను అసెంబ్లీకి పంపించాల్సిన అవసరం ఉందని అన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో మనవోట్లు మనమే వేసుకుని గెలిపించుకుని అభివద్ధి చేసుకుందామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్, వరంగల్ తూర్పు బీజేపీ నాయకులు వన్నాల వెంకటరమణ, జిల్లా కార్యదర్శి ముంద్రాతి వెంకటేశ్వర్లు, ఐటి సెల్ జిల్లా కన్వీనర్ ఆడెపు వేంకటేష్, మాచర్ల దీన్ దయాల్, చిలువేరు రాజేందర్, భైరీ మురళీ కష్ణ, బొద్దు రాకేష్, వండ్ల సంతోష్, ఆడెపు నగేష్, చిప్ప వెంకటేశ్వర్లు కందకట్ల మల్లిఖార్జున్, ఆడెపు దేవేందర్, తుమ్మ రమేష పాల్గొన్నారు.



2వ ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నూరి రమేష్

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

2వ ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నూరు రమేష్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ఏవో మహేష్‌బాబుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఎంపీహెచ్ఎ(ఎఫ్) పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ 2/2023ను జారీ చేసిందన్నారు. 1,520 పోస్టుల భర్తీ కోసం రాత పరీక్ష నిర్వహించి ఎంపిక చేస్తామని, కాంట్రాక్ట్ సర్వీసెస్ పనిచేస్తున్న ఉద్యోగులకు 20మార్కులు సర్వీస్ వెయిటేజి ఇచ్చారని తెలిపారు. వయస్సు పరిమితి కూడా 44 సంవత్సరాలు, ఎస్సి, ఎస్‌టి, బీసీ తదితరులకు అదనంగా 5ఏండ్లు సడలింపు ఇచ్చారన్నారు. నోటిఫికేషన్ ప్రకారం 49 ఏండ్లు దాటిన వారు అప్లై చేసుకోవడానికి కూడా అర్హులు కారని అన్నారు. ఈ నిబంధనల వల్ల కాంట్రాక్ట్ సర్వీసులో పనిచేస్తున్న 2వ ఏఎన్ఎం, ఈసీ ఏఎన్ఎం, అర్బన్ హెల్త్ సెంటర్స్ ఏఎన్ఎంలు, హెచ్ఎర్డి ఎఎన్ఎంల పేరిట పనిచేస్తున్న సుమారు 5 వేల మందికి న్యాయం జరగదన్నారు. వారందరూ 20ఏండ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారని, యదావిధిగా ఖాళీ పోస్టుల్లో సీనియారిటీ ప్రకారం వారిని రెగ్యులర్ చేయాలన్నారు. వెంటనే ప్రభుత్వ నోటిఫికేషను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వైద్య ఆరోగ్య శాఖలోని కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసుల క్రమబద్ధీకరణకు సంబంధించి విధి విధానాల విషయంలో ద్వంద్వ ప్రమాణాలు అనుసరించడం శోచనీయమన్నారు. మిగిలిన 5 వేల మంది కాంట్రాక్ట్ ఎంపిహెచ్ (ఫిమేల్)లను సీనియారిటీ ప్రకారం రెగ్యులర్ చేయాలని కోరారు. ఎంపిహెచ్ఎ(ఫిమేల్)ల సర్వీసులను క్రమబద్ధీకరించి 11వ పీఆర్‌సీ ప్రకారం కనీస వేతనం రూ.31,040 ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో 2వ ఏఎన్ఎంల సంఘం నాయకులు సునీత, సదాలక్ష్మి సరళ పాల్గొన్నారు.

16 నుండి నిరవధిక సమ్మె చేపడతాం : ఏఐటీయూసీ

ములుగు : సెకండ్ ఏఎన్ఎం లను రెగ్యులరైజ్ చేయాలని కలెక్టరేట్ కార్యాలయం ముందు నిరసన ధర్నా నిర్వహించి గ్రీవెన్స్‌లో వ్యక్తిగతంగా ఆర్డర్ కాపీలతో జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతి పత్రాలు అందించారు. అనంతరం డీఎంహెచ్ఓకు వినతి పత్రాలను అందించారు. తమ సమస్యలు పరిష్కారం కాకుంటే ఈనెల 16వ తేదీ నుండి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్, తెలంగాణ రాష్ట్ర, ఎన్హెచ్ఎం, సెకాండ్ ఏఎన్ఎంల యూనియన్ జిల్లా అధ్యక్షులు పాయం సరోజన, ప్రధాన కార్యదర్శి కోడి సుజాత మాట్లాడారు. 17 సంవత్సరాలుగా సెకండ్ ఏఎన్ఎం లుగా సేవలందిస్తూ ఇప్పటికీ రెగ్యులరైజ్ కాక ఇబ్బందులు పడుతుంటే, కొత్త రిక్రూట్మెంట్ కోసం నోటిఫికేషన్ విడుదల చేయడం అందులో వెయిటేజ్ కూడా గతం కంటే పెంచడానికి బదులు తగ్గించడం దుర్మార్గమైన చర్య అన్నారు. వారిలో 50 సంవత్సరాలు దాటిన వారు చాలామంది ఉన్నారని, ఆన్లైన్ పరీక్షలు ఎలా సాధ్యం అవుతుందన్నారు. ప్రభుత్వం స్పందించి కేంద్ర ప్రభుత్వంతో చర్చించి అందరిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఆదిలక్ష్మి, సుజాత, శకుంతల, లలిత ,లక్ష్మి ,అనురాధ, వెంకటరమణ, సులోచన, వజ్ర, సునీత సూర్యకాంతం సునీత మంగ ,లలిత ,కన్యాకుమారి, రాజ్యలక్ష్మి ,సుమలత, పుణ్యవతి, సమ్మక్క ,పుష్పలత, గంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో ఇసుక లారీ బీభత్సం

వాహనాలను ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-భూపాలపల్లి



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలి సమీపంలో ఇసుక లారీ బీభత్సం సృష్టించగా ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.... కాళేశ్వరం నుండి నుండి పరకాల వైపు వెళ్తున్న ఇసుక లారీ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలి సమీపంలో అదుపుతప్పి పార్కింగ్ చేసి ఉన్న కార్లు, ద్విచక్రన వాహనాలపై నుండి దూసుకెళ్లింది. ఈ ఘటనలో రెండు కార్లు దెబ్బతినగా, సుమారు 10 ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. దుకాణం నుండి అప్పుడే బయటికి వచ్చిన భూపాలపల్లి మండలం మహబూబ్ పల్లికి చెందిన వెలిశెట్టి రంజిత్ ద్విచక్ర వాహనంపై వెళ్లే ప్రయత్నంలో లారీ వచ్చి ఢీకొనగా వాహనాల మధ్యలో ఇరుక్కుకొని తల్లడిల్లిపోయాడు. విషయం తెలుసుకున్న భూపాలపల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టి రంజిత్‌ను క్రేన్ సాయంతో బయటకు తీశారు. అతని పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో చికిత్స కోసం 100 పడకల ఆస్పత్రికి తరలించారు. రోడ్డు పక్కనే విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌ను ఢీకొనకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. లారీ వస్తుండగా రోడ్డు పైనే ఉన్న పాదాచారులు బెంబేలెత్తిపోయారు. కాగా డ్రైవర్ మద్యం మత్తులో నిర్లక్ష్యంగా వాహనం నడపడంతో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

లారీ ప్రమాద ఘటన దురదృష్టకరం

: గండ్ర సత్యనారాయణరావు



మొగుళ్ళ పల్లి : జిల్లా కేంద్రంలోని స్థానిక రాఘవేంద్ర ఉడిపి హెూటల్ వద్ద సోమవారం జరిగిన ఇసుక లారీ ప్రమాద ఘటన దురదష్టకరమని ప్రమాదానికి స్థానిక ఎమ్మెల్యే జిల్లా అధికార యంత్రాంగమే కారణమని టీపీసీసీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి గండ్ర సత్యనారాయణరావు ఆరోపించారు. సోమవారం మండలకేంద్రంలో ముఖ్య నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిట్ట మధ్యాహ్నం యతేచ్ఛగా భూపాలపల్లి టౌన్ లోనికి ఇసుక లారీలను అనుమతించడం వల్లే ఈ ప్రమాదం జరిగిందన్నారు. పట్టణంలో ప్రధాన రహదారి గుంతల మయంగా మారడం కూడా ప్రమాదానికి కారణమన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల అండతో ఇసుక మాఫియా యథేచ్ఛగా కొనసాగుతోందన్నారు. వెంకట్రావ్ పల్లి(బి), కాల్వపల్లిలో ఇసుక మాఫియా జోరుగా సాగుతున్నా ఎవరు పట్టించుకోవట్లేదని మండిపడ్డారు. మండల అధ్యక్షుడు కుమారస్వామి, నాయకులు రమేష్, మహేందర్, రఫీ, ప్రసాద్, ప్రకాష్, తదితరులు ఉన్నారు.



మల్హర్‌లో ఇద్దరికి మహిళా ఎస్సై ఉద్యోగాలు

నవతెలంగాణ-మల్హర్‌రావు

మారుమూల ప్రాంతంలో పుట్టిన ఇద్దరు మహిళలు స్వశక్తితో ఎస్సైలుగా కొలువులు సాధించారు. ఒక్కో ఉద్యోగానికి వేలాదిమంది పోటీ ఉన్నప్పటికీ గట్టి పోటీని తట్టుకొని విజయం సాధించి మిగతవారికి ఆదర్శంగా నిలిచారు. సివిల్ ఎస్సై ఫలితాల్లో మండలంలోని ఆన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన బానోతు గీత, చిన్నతూండ్ల గ్రామానికి చెందిన నారా రచిత్ర ఇద్దరు సోమవారం వెలువడిన ఫలితాల్లో ఎస్సైలుగా ఎంపికయ్యారు.

ఎస్సైగా గీత

ఆన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన బానోతు లలిత-సమ్మయ్య దంపతుల కుమార్తె బానోతు గీత సివిల్ ఎస్సైగా ఎంపికయ్యారు. గీత 10వ తరగతి వరకు పెద్దపల్లి జిల్లాలోని 8ఇన్‌క్లైన్ కాలనీలో చదువుకున్నారు. గోదావరిఖని గాంధీ డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదివారు. ఇటీవల నిర్వహించిన ఎస్సై పరీక్షలకు హాజరై సివిల్ ఎస్సైగా ఎంపికయ్యారు. గ్రూపు-1 కానిస్టేబుల్ పరీక్షలకు సైతం గీత హాజరైయ్యారు. డీఎస్పీ కొలువు సాధించడం తన లక్ష్యమని తెలిపారు. ఎస్సై కొలువు సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, సర్పంచ్ జగన్‌నాయక్ ఆనందం వ్యక్తం చేశారు.

సివిల్ ఎస్సైగా రచిత్ర..

చిన్నతూండ్ల గ్రామానికి చెందిన నారా లక్ష్మీ-రామయ్య దంపతుల కూతురు నారా రచిత్ర సివిల్ ఎస్సైగా ఎంపికయ్యారు. గతంలో రచిత్ర సింగరేణి నిర్వహించిన కొలువులకు పరీక్షలు రాసి జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు. ఉద్యోగ ఎంపిక కోర్టు పెండింగ్‌లో ఉంది. కాగా ఇటీవల నిర్వహించిన ఎస్సై పరీక్షకు హాజరై ఆదివారం విడుదలైన తుది ఫలితాల్లో సివిల్ ఎస్సైగా ఎంపికయ్యారు. పదోతరగతి వరకు మల్లారం గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యానభ్యసించారు. ఇంటర్, బీటెక్ బాసర ట్రిపుల్ ఐటిలో చదివారు. తండ్రి రామయ్య వీఆర్‌ఏగా విధులు నిర్వహిస్తున్నారు. రచిత్ర ఎస్సైగా ఎంపికై తల్లిదండ్రులు, సర్పంచ్ పులిగంటి మమత నర్సయ్య అభినందించారు.

నూతన తహసీల్దార్ రవీందర్‌కు సన్మానం

నవతెలంగాణ -తాడ్వాయి



తాడ్వాయి మండల నూతన తాసిల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన తోట రవీందర్ ను సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్‌గౌడ్ మర్యాదపూర్వ కంగా కలిసి ఆయనను ఘనంగా సన్మానించారు. రెవెన్యూ భౌగోళిక పరిస్థి తులు, ప్రజల సమస్యలు తదితర అంశాలపై చర్చించారు. సర్పంచ్ ఇర్ప సునీల్ దొర, కాంగ్రెస్ పార్టీ మండల గౌరవ అధ్యక్షులు జాలపు అనంతరెడ్డి, పిఎసిఎస్ మాజీ చైర్మన్ సాంబయ్య, డైరెక్టర్లు యానాల సిద్ది రెడ్డి జగన్ పాలకుర్తి రజిత రవీందర్, యూత్ అధ్యక్షులు కోడి సతీష్, నాయకులు ముజఫర్ హుస్సేన్, చిరంజీవి, బెజ్జూరి శ్రీను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ శ్రేణుల ఆధ్వర్యంలో....

నవతెలంగాణ -తాడ్వాయి



మండల నూతన తాసిల్దార్ తోట రవీందర్‌ను బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దండుగుల మల్లయ్య ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు సోమవారం ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రజలకు అందుతున్న విధానం, రెవెన్యూ, భౌగోళిక పరిస్థితులు, సమస్యలు తదితర అంశాలపై చర్చించారు. ఎంపీపీ గొంది వాణిశ్రీ, సర్పంచులు గౌరమ్మ, గుర్రం రమ సమిరెడ్డి, ఉప సర్పంచ్ ఇంద్రసేనారెడ్డి, నాయకులు వసంతరావు, బందెల తిరుపతి, ఇర్రాప రామకష్ణ, పత్తి గోపాల్ రెడ్డి, భద్రయ్య, కొంకతి సత్యం తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలే లక్షం : ఎస్సై రవికుమార్

నవతెలంగాణ-మంగపేట



మండలంలో శాంతి భద్రతలే లక్షంగా పోలిసింగ్ ఉంటుందని ఎస్సై రవికుమార్ అన్నారు. సోమవారం స్థానిక పోలిస్‌స్టేషన్‌లో 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండలంలోని అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, పాత్రికేయులు, మహిళలు, యువత పోలీసుల విధులకు సహాకరించాలన్నారు. ఎన్నికల సంవత్సరం కాబట్టి మండలంలో శాంతి భద్రతలే లక్ష్యంగా పని చేయాల్సి ఉన్నందున ఎలాంటి అసాంఘీక కార్యక్ర మాలనైనా ఉపేక్షించేది లేదన్నారు. ఇందెఎ యువత పోలీసులకు సహాకరిం చాలన్నారు. ఎలాంటి సమాచారమైనా పోలీసులకు తెలపాలని సూచించారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మండల అధ్యక్షుడు వేమా సురేష్, ప్రధాన కార్యదర్శి వడ్లకొండ వీరయ్య, అడ్వైజర్లు ఎర్రం స్వామి, ధర్మపురి శ్రీనివాస్, వడ్లకొండ శ్రీనివాస్, మఠం రమేష్, నిమ్మగడ్డ శ్రీనివాస్, మేడ ఆదినారాయణ, కుటుకూరి సాంబశివరావు, అక్కపెల్లి రాజేష్, పాత్రికేయులు అక్కినపెల్లి వెంకటేశ్వర్లు, పవన్ కల్యాన్, జయరాజు, పల్లాపు రమేష్, శివమహేష్, అజ్జు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ప్రహ్లాద్ చేయూత

నవతెలంగాణ -తాడ్వాయి

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జంపన్న వాగు ఉగ్రరూపానికి నిస్సహాయులైన మేడారం, ఊరట్టం, కన్నెపల్లి, కొత్తూరు, రెడ్డిగూడెం గ్రామాల్లోని నిరుపేద వరద బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి అజ్మీర చందూలాల్ కుమారుడు, ములుగు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అజ్మీర ప్రహ్లాద్ సోమవారం నిత్యవసర సరుకులు, దుస్తులు పంపిణీ చేశారు. బీఆ ర్‌ఎస్ ప్రభుత్వం వరద బాధితులకు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు దండుగుల మల్లన్న, స్థానిక ఎంపీపీ గొంది వాణిశ్రీ, ములుగు ఎంపీపీ శ్రీదేవి సుధీర్, ఎంపిటిసి కుక్కల శ్రీను, సర్పంచులు గుర్రం రమా సమ్మిరెడ్డి, మేడారం మాజీ సర్పంచ్ గడ్డం సంధ్యారాణి, కోఆప్షన్ సభ్యులు దిలావర్ ఖాన్, మాజీ మండల అధ్యక్షులు దిడ్డి మోహన్ రావు, బండారి చంద్రయ్య, ఎనగందుల బాపిరెడ్డి, సీనియర్ నాయకులు పత్తి గోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి మేడారంలోని సమ్మక్క-సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు వనదేవతలను ఆయన దర్శించుకుని ప్రత్యేక మొక్కులు చెల్లించారు.



గుడిసెవాసులకు త్వరితగతిన పట్టాలు ఇవ్వాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజుకుమార్

నవతెలంగాణ-భూపాలపల్లి



పేదల పట్ల రాష్ట్ర ప్రభుత్వం మొండివైఖరి వీడి గుడిసెవాసులకు వెంటనే పట్టాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజుకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎర్ర చెరువు సర్వే నెంబర్-280లోని గుడిసె వాసులకు న్యాయం చేయాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని గణేష్ చౌక్ నుండి అంబేద్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కొరిమి రాజుకుమార్, పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ... దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75ఏండ్లు గడుస్తున్నా పేదోడి సొంతింటి లేని పరిస్థితి నెలకొందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇవ్వడంలో విఫలమైందని అన్నారు సీపీఐ ఆధ్వర్యంలో గుడిసెలు వేసుకొని పోరాటాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సుమారు 3000మంది నిరుపేదలు సొంత ఇల్లు లేక వేలాది రూపాయలు కిరాయిలు కట్టలేక భగత్ సింగ్ కాలనీలో గుడిసెలు వేసుకుని 7 నెలల నుండి జీవనం సాగిస్తున్నారని అన్నారు. నేటికీ వారిని పట్టించుకోకపోవడం సిగ్గుచేటని అన్నారు. గుడిసెవాసులందరికీ పట్టాలు ఇవ్వకుంటే బీఆర్‌ఎస్‌కు బుద్ది చెప్తామని హెచ్చరించారు. స్థానిక ఎమ్మెల్యే రమణారెడ్డి గుడిసెవాసుల పట్ల చొరవ చూపాలని, జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులు స్పందించి జీవో 58 ప్రకారం గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు క్యాతరాజు సతీష్,కొరిమి సుగుణ,నేరెళ్ల జోసెఫ్,వేముల శ్రీకాంత్, పీక రవికాంత్,సాబీర్, తిరుపతి, యాకుబ్, మహేష్, ఆరబోయిన వెంకటేష్, రమేష్,వనిత, లావణ్య, సంధ్య, సాద మహేశ్వరి, గోలి లావణ్య,వేగోలపు మమత, సుజాత, ప్రియాంక, స్వప్న, సుస్మిత పాల్గొన్నారు.

అర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలి

జాతీయ రహదారిపై

ప్రజా సంఘాల జేఏసీ రాస్తారోకో

నవతెలంగాణ - ములుగు



అర్హులకు డబుల్ బెడ్ రూములు ఇవ్వాలని, అర్హుల జాబితా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ములుగు జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు.దీంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. పోలీసులు రంగ ప్రవేశం చేసి ధర్నాను భగ్నం చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ ముంజల బిక్షపతి గౌడ్ మాట్లాడుతూ.. అర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇచ్చేవరకు ఉద్యమాలు కొనసాగిస్తామని, అవసరమైతే ఉదతం చేస్తామని అన్నారు. అర్హులకు ములుగు పట్టణానికి కొత్తగా 1000 ఇండ్లు మంజూరు చేయాలని, అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూములు పూర్తిచేయాలని అన్నారు. 35 ఇండ్లు పూర్తయ్యాయని, వాటిని అర్హులకు ఇవ్వాలని కోరారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రత్నం గజ్జల లక్ష్మీ, ఝాన్సీ, రాధ, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులను పట్టించుకోని ప్రిన్సిపాల్

వెంటనే సస్పెండ్ చేయాలి : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ - ములుగు



ములుగు మండలం మల్లంపల్లి సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండా విద్యార్థులను పట్టించుకోని ప్రిన్సిపాల్ అంకయ్యను సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గుగులోత్ రమేష్ డిమాండ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఫారెస్ట్‌కు వెళ్తున్నారని అన్నారు. దీంతో విద్యార్థులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. వర్షం నీరు కూడా హాస్టల్ గదుల్లో పడుతునా గతంలో ప్రిన్సిపల్ పట్టించుకోలేదన్నారు. కనీసం తాగు నీరు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. విద్యార్థులకు ఉడకని భోజనం పెడుతున్నారని, ఇప్పటికైనా విద్యార్థుల సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివ,ముష్రాఫ్, సాయి అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా యుద్ధ నౌక గద్దర్‌కు కాంగ్రెస్ ఘన నివాళులు



నవతెలంగాణ-గోవిందరావుపేట

ప్రజా యుద్ధ నౌక, విప్లవ గాయకుడు గద్దర్ మతికి సంతాప సూచకంగా కాంగ్రెస్ పార్టీ ఘన నివాళి అర్పించింది. సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పలడుగు వెంకటకష్ణ ఆధ్వర్యంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటకష్ణ మాట్లాడుతూ ప్రజా సమస్యలను వినిపించే ప్రజా గొంతుక మూగబోయిందని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో గద్దర్ చురుగ్గా పాల్గొన్నాడని అన్నారు.వాయన మతి తెలంగాణ రాష్ట్రానికి తీరనిలోటు అని అన్నారు. మండల ఇన్‌చార్జి కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రసపుత్ సీతారాంనాయక్, సహకార సంఘ అధ్యక్షులు పన్నాల ఎల్లారెడ్డి, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు దాసరి సుధాకర్, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు పెండెం శ్రీకాంత్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల ప్రభాకర్, సహకార సంఘ పాలకవర్గ సభ్యులు జెట్టి సోమయ్య, ఎంపీటీసీ గోపిదాసు ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ మృతి కళారంగానికి తీరని లోటు

టీఎస్‌యూస్ రాష్ట్రకన్వీనర్ గట్టయ్య

నవతెలంగాణ- కోల్‌బెల్ట్



గద్దర్ మరణం కళా రంగానికి తీరనిలోటని తెలంగాణ సింగరేణి ఉద్యమ సంఘం రాష్ట్ర కన్వీనర్ కామర గట్టయ్య అన్నారు. సోమవారం జయశంకర్ జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ పీడిత, తాడిత ప్రజల విముక్తి కోసం వర్గ పోరాట దక్పథాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన విప్లవ గాయకుడు ప్రజా యుద్ధ నౌక గద్దర్ అని కొనియాడారు. ఆయన మరణం కళారంగానికి తీరని లోటని, బడుగు, బలహీన వర్గాలకు తీరని నష్టం అన్నారు పేద ప్రజల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు ఎనలేనివని అన్నారు. ఆయన మరణం తెలంగాణకే కాక యావత్ భారతదేశానికి తీరని లోటని అన్నారు. ఆయన అడుగుజాడల్లో అందరూ నడవాలని పిలుపునిచ్చారు.

మద్యం మత్తులో యాక్సిడెంట్ చేసిన ఉద్యోగి

నవతెలంగాణ- కోల్‌బెల్ట్



భూపాలపల్లి ఏరియా సింగరేణి ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న సింగరేణి ఉద్యోగి మద్యం మత్తులో సోమవారం యాక్సిడెంట్‌కు కారణమయ్యాడు. మెరుగు లక్ష్మీరాజం ఏరియా వర్క్ షాప్ లో జనరల్ మజ్దూర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. వర్క్ షాప్ నుండి మధ్యాహ్న భోజనానికి ఇంటికి వెళుతున్న సమయంలో మాంటిసోరి స్కూలు వద్ద రోడ్డుపై మైసమ్మ గుడి వద్ద టర్నింగ్ తీసుకుంటుండగా ఏరియా ఆసుపత్రిలో విధులు ముగించుకొని మధ్యాహ్న భోజనానికి వస్తున్న లకావత్ బాలాజీ (జనరల్ మజ్దూర్) తాగిన మత్తులో బండి నడుపుతూ లక్ష్మీరాజంను ఢీకొట్టాడు. లక్ష్మీ రాజ్యం హెల్మెట్ ధరించి ఉండటంతో ప్రాణాపాయం తప్పింది. కానీ, అతని కాలు, ఎముక విరిగి తీవ్ర గాయాలపాలయ్యాడు. బాలాజీకి స్వల్ప గాయాలయ్యాయి. అత్యవసర చికిత్స నిమిత్తం సింగరేణి వైద్యులు లక్ష్మీ రాజంను హైదరాబాద్ కార్పొరేట్ హాస్పిటల్‌కు రెఫర్ చేశారు. సింగరేణి ఆస్పత్రిలో విధులు నిర్వహించే కేవలం అంబులెన్స్ డ్రైవర్లకు మాత్రమే బ్రీత్ అనలైజర్‌తో ఆల్కహాల్ శాతం చెక్ చేయడం, మిగిలిన ఉద్యోగులను చెక్ చేయడం లేదని అక్కడి ఉద్యోగులు తెలపడం గమనార్హం. హాస్పిటల్ నుండి ఇంటికి వెళుతున్న క్రమంలో బాలాజీ రెండు మూడు సార్లు తాగిన మత్తులో కింద పడ్డట్టు తోటి ఉద్యోగులు తెలిపారు. సింగరేణి ఆసుపత్రిలో తాగిన వారిని విధుల్లోకి ఎలా తీసుకుంటున్నారని, దాని ప్రభావం రోగుల పట్ల ఎలా ఉంటుందని, యాజమాన్యంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి సంఘటనలు పునరావతం కాకుండా యాజమాన్యం దృష్టి సారించాలని, వారి పట్ల చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

మంద కృష్ణ పోరాట ఫలితమే ఆరోగ్యశ్రీ

ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్

భట్టు విజయకుమార్

నవతెలంగాణ-భూపాలపల్లిటౌన్



ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పోరాట ఫలితమే పేదలకు ఆరోగ్యశ్రీ పథకం సేవలు అందుతున్నాయని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ భట్టు విజయకుమార్ అన్నారు. మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఆరోగ్యశ్రీ అవతరించిన ఆగస్టు 7న సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో మంద కృష్ణ పోరాటం ఫలితంగా ఆరోగ్యశ్రీ పథకం తీసుకొచ్చారని అన్నారు. నేడు ప్రతి ఇంటికి ఆరోగ్యశ్రీ పథకం అందుతోందని తెలిపారు. ఒకప్పుడు కార్పొరేట్ వైద్యం ఉన్నత వర్గాలకు మాత్రమే అందేదని, ఆరోగ్యశ్రీ తో నుడు పేద వర్గాలు కూడా కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యాన్ని పొందుతున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలకు లాభం చేకూర్చేలా ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ మండల కన్వీనర్ అంతడుపుల సురేష్, పట్టణ కన్వీనర్ దోర్నాల రాజేందర్, ఎమ్మార్పీఎస్ పట్టణ కన్వీనర్ దోర్నాల భరత్, ఎమ్మార్పీఎస్ మండల నాయకుడు చిలివేరి పవన్, యువసేన నాయకుడు మంద తిరుపతి, మంద కిరణ్, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నవతెలంగాణ-భూపాలపల్లి

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల సమస్యలకు సంబంధించిన 35 దరఖాస్తులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ప్రాధాన్యతతో వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పెండింగ్ సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ సూచించారు.



వచ్చిన ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలి

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ పుల్ల కరుణాకర్

నవతెలంగాణ-భూపాలపల్లి

శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారానికి, బాధితులకు అండగా ఉంటూ ఫిర్యాదుల పై వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పి పుల్ల కరుణాకర్ అన్నారు. సోమవారం జిల్లా పోలిస్ కార్యాలయంలో ప్రజాదివాస్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన 16 ఫిర్యాదులు స్వీకరించి బాధితుల సమస్యలు విన్నారు. అనంతరం ఆయా పోలిస్‌స్టేషన్ల అధికారులతో మాట్లాడారు. బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తూ, శాంతిభద్రతలకు భంగం కలిగించే వారి పట్ల, మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు.



ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కారించాలి

జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) డి వేణుగోపాల్

నవతెలంగాణ - ములుగు

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కారించాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ డి వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తిరస్కరించిన ఆర్జీలకు సవివరమైన వివరణ ఇవ్వాలని జిల్లా అధికారులకు సూచించారు. నేటి ప్రజావాణిలో మొత్తం 71 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇందులో రెవెన్యూ శాఖ- 16, వివిధ రకాల పెన్షన్లు సమస్యలు-4, ఇతర శాఖలకు చెందినవి- 51 ఉన్నాయన్నారు. వీటిలో కొన్నింటిని సత్వరమే పరిష్కరించామన్నారు. ఇతర శాఖలకు చెందిన ఆర్జీలను సంబంధిత అధికారులకు సిఫారసు చేశారు. జెడ్పీ సీఈవో ప్రసూన రాణీ, సీపీఓ ప్రకాష్, డీఎంహెచ్ఓ అప్పయ్య, డీపీఓ వెంకయ్య, డీఎస్ఓ అరవింద్‌రెడ్డి, డీఎండీఎస్ఓ రాములు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, విద్యుత్ శాఖ డీఈ నాగేశ్వరరావు, జిల్లా మార్కెటింగ్ అధికారిని సుచిత్ర, ఎల్డీఎం రాజ్ కుమార్, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి సర్దార్ సింగ్, మత్స్యశాఖ అధికారి శ్రీపతి, సంబంధిత జిల్లా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



గొత్తికోయ గూడెంలో వైద్య శిబిరం

నవతెలంగాణ-గోవిందరావుపేట

మండలంలోని మచ్చాపూర్ గొత్తికోయగూడెంలో సోమవారం కాలినడకన 5 కిలోమీటర్లు నడిచి డాక్టర్ సుకుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 68మందికి పరీక్షలు చేసి ఇంటింటి ఫీవర్ సర్వే చేపట్టారు. వారిలో ఆరుగురికి జ్వరం, ఇద్దరికి మలేరియా ఉన్నట్లు నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఈవో సురేష్‌కుమాం, సబ్ యూనిట్ ఆఫీసర్ భూపాల్ రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ జంపయ్య కష్ణయ్య, ఆశాలు సరిత, రజిత పాల్గొన్నారు.

తొలిమెట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ఐనవోలు

శిక్షణను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకొని విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెంపొందించాలని మండల నోడల్ ఆఫీసర్ డాక్టర్ టి.రమేష్ కోరారు. సోమవారం ఐనవోలు ఉన్నత పాఠశాల నందు జరుగుతున్న తొలిమెట్టు గణిత శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐనవోలు పాఠశాల కాంప్లెక్స్ ప్రధానో పాధ్యాయులు పాక శ్రీహర్షుడు, రిసోర్స్‌పర్సన్స్ బాలోజు బ్రహ్మచారి, చిదురాల శ్రీనివాస్, సిఆర్పీలు రాజ్‌కుమార్, రేవతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోధనాభ్యసన సామర్థ్యాల పెంపుదలకు శిక్షణ



నవతెలంగాణ-వేలేరు

రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు మండల కేంద్రం జెడ్పిహెచెస్ మండల విద్యాశాఖ నోడల్ అధికారి, కోర్సు డైరెక్టర్ మహేష్‌నాయక్, కాంప్లెక్స్ హెచ్‌ఎం నాగకుమారి ఆధ్వర్యంలో మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న గణితశాస్త్ర తొలిమెట్టు శిక్షణా శిబి రాన్ని రాష్ట్రటీం సభ్యులు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోధనాభ్యసన సామర్థ్యాల పెంపుదలకు ఉపాధ్యాయులకు తొలిమెట్టు శిక్షణ ఉపయోగపడుతుందని సద్విని యోగం చేసుకోవాలని పలుసూచనలు చేశారు. శిక్షణకు రిసోర్సు పర్సన్లుగా ఉపాధ్యాయులు మొయినోద్దీన్, మూల రాధిక వ్యవహరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్‌పీ మొగిలిచెర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మూడున్నర కిలోల కణతి తొలగింపు



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

మహిళ కడుపులో ఉన్న మూడున్నర కిలోల కణతిని తొలగించి సర్జరీని విజయవంతం చేశామని హనుమకొండ వేయి స్తంభాల గుడిఎదురుగా శ్రీనివాస కిడ్నీసెంటర్ డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. హనుమకొండ జులైవాడకు చెందిన కోరుట్ల స్వరూప కడుపులో మూడున్నర కిలోల కణతి ఏర్పడింది. ఈ కణతి తొలగింపు కోసం పలు కార్పొరేట్ హాస్పిటల్స్ చుట్టూ తిరిగిన ప్రయోజనం లేకపోవడంతో తమ ఆసుపత్రిని సంప్రదించినట్లు డాక్టర్ రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ కణతి కుడికిడ్నీకి కాలేయానికి పెద్ద పేగులకు మధ్య ఉండడంతో సర్జరీ క్లిష్టతరంగా మారిందని పేర్కొన్నారు. జూలై 31న 3గంటలకు పైగా సర్జరీ నిర్వహించి కణతిని తొలగించినట్లు తెలిపారు. రూ.3 లక్షలు ఖర్చయ్యే ఆపరేషన్‌ను తమ ఆసుపత్రిలో కేవలం రూ.70 వేలకే పూర్తిచేసి సోమవారం పేషెంట్లు డిశ్చార్జ్ చేసినట్లు తెలిపారు. సర్జరీలో తనతోపాటు డాక్టర్ ఉపేందర్, డాక్టర్ ఆకాష్, డాక్టర్ సామ్రాట్ పాల్గొన్నారనిప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.

సైలెన్సర్లు మార్పు చేస్తే క్రిమినల్ చర్యలు

ట్రాఫిక్ ఏసీపీ భోజరాజు



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

ద్విచక్ర వాహనదారులు కంపెనీతో వచ్చిన సైలెన్సర్లను ఎలాంటి మార్పు చేసినా వాహనదారుడితో పాటు మార్పు చేసిన మెకానిక్‌పై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఏసీపీ భోజరాజు హెచ్చరించారు. ట్రాఫిక్ పోలీసులు సోమవారం కేయూక్రాస్ వద్ద అధిక శబ్దం చేసే ద్విచక్రవాహన సైలెన్సర్లను రోడ్ రోలర్‌తో ధ్వంసం చేసారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ ఆదేశాల మేరకు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాల కంపెనీ సైలెన్సర్ స్థానంలో అధిక శబ్దం వచ్చే సైలెన్సర్ల ఏర్పాటుపై ట్రాఫిక్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఇందులో భాగంగా గత కొద్ది రోజులుగా ట్రై సిటీ పరిధిలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో నిబంధనలు విరుద్ధంగా అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లు ఏర్పాటు చేసిన ద్విచక్రవాహనాలను గుర్తించి వాటి నుండి మార్పు చేసిన సైలెన్సర్లను ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. ట్రాఫిక్ పోలీసులు తొలగించిన సైలెన్సర్లను మరోమారు వినియోగించకుండా రోడ్ రోలర్ సాయంతో రెండు వందలకు పైగా సైలెన్సర్లను ట్రాఫిక్ పోలీసులు ధ్వంసం చేసారు. ధ్వంసం చేసిన సైలెన్సర్లలో హనుమకొండకు చెందినవి 70కాగా కాజీపేట 65, వరంగల్ 65 వున్నాయి. అనంతరం ట్రాఫిక్ ఏసిపి మాట్లాడుతూ సిపి ఆదేశాల మేరకు నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను మార్పు చేయడం చట్టరీత్యా నేరమని, శబ్ద కాలుష్య నియంత్రణతో పాటు ప్రజాఆరోగ్యాన్ని దృష్టిలో వుంచుకోని అధికంగా శబ్దం చేసే ద్విచక్రవాహనలపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేపట్టడం. జరిగింది. సైలెన్సర్ల మార్పుకు సహకరించిన మెకానిక్లపై క్రిమినల్ చర్యలు: తీసుకోబడుతాయని ఏసిపి అన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్, కాజీపేట ట్రాఫిక్ ఇన్స్పెక్టర్లు సీతారెడ్డి, వెంకట్, సుజాత, ట్రాఫిక్ ఎస్‌ఐలు వేణు, యుగంధర్, పూర్ణచంద్రరెడ్డి, శ్రావణితో పాటు ఇతర ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.


నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి



నవతెలంగాణ-శాయంపేట

గత 10 రోజుల క్రితం కురిసిన అధిక వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని ఎంసిపిఐ (యు) మండల కార్యదర్శి పెంట తిరుపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సోమవారం డిప్యూటీ తహసిల్దార్ భద్రునాయక్‌కు అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేళ్ల పూర్తయిన ప్రజా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు సైతం అమలకు నోచుకోలేదని మండిపడ్డారు. వ్యవసాయ కూలీల కుటుంబానికి మూడెకరాల భూమి, ఉచితంగా విద్య, వైద్యాన్ని అందజేయాలని, కార్మికుల కనీస వేతనం 26,000 నిర్ణయించి అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంద భద్రయ్య, కుసంబుచ్చయ్య, పెద్దిరెడ్డి మహేందర్‌రెడ్డి, పరికరాల భూమయ్య కక్ర వెంకటరెడ్డి, ఇటికాల బాపూరావు, మహిళలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన ఉపసర్పంచ్



నవతెలంగాణ-నెక్కొండ

మండలానికి చెందిన సూరిపల్లి ఉపసర్పంచ్ సుక్క ఐలయ్య, నాలుగో వార్డ్ మెంబర్ పిట్టల శ్రీకాంత్, ఏఐసీసీ సభ్యులు దొంతి మాధవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌పార్టీలో చేరారు. ఈ సందర్భంగా దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ టిఆర్ఎస్ పరిపాలనకు రోజులు దగ్గర పడ్డాయన్నారు.రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట పిసిసి సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్, జిల్లాప్రధాన కార్యదర్శి రావుల హరీష్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్ జిల్లా యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బండి శివకుమార్, లావుడియా తిరుమల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఐక్య పోరాటాలు



నవతెలంగాణ-కాశిబుగ్గ

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్యంగా ఉద్యమించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ పిలుపునిచ్చారు. సోమవారం వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో ఏఐటీయూసీ (హమాలీ యూనియన్) ఆధ్వర్యంలో ఈనెల 9 10 తేదీల్లో జిల్లాకలెక్టర్ కార్యాలయం ముందుచేపట్టనున్న మహాధర్నా పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 44 కార్మిక చట్టాలను నాలుగు కొడులుగా మార్చి కార్మిక వర్గాన్ని విచ్ఛిన్నం చేసిందని ఆయన అన్నారు. మరొకవైపు ప్రభుత్వ రంగ సంస్థలన్నీటిని ప్రైవేటుపరం చేస్తూ బడా పెట్టుబడిదారులకు పారిశ్రామికవేత్తలకు ఊడిగం చేస్తుందని ఆయన ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి దామెర కష్ణ, గుమస్తల సంఘం అధ్యక్షులు ఇనుముల మల్లేశం జిల్లా కార్యదర్శి చుచ్చు జగదీశ్వర్, జిల్లా నాయకులు గోర్రె శేఖర్, కుమార్, హఫీజ్, మలకుమ్మరి రమేష్, వేణు గోపాల్, కుమార స్వామి, మంద దేవేందర్, వైకుంటం తదితరుల పాల్గొన్నారు.

అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలి

సీపీఎం వరంగల్ జిల్లా కార్యదర్శి సీహెచ్.రంగయ్య



నవతెలంగాణ-నెక్కొండ

మండల కేంద్రంలో సర్వేనెంబర్ 436లో గల నాలుగు ఎకరాల 38 గుంటలు ప్రభుత్వ భూమి ఆక్రమించుకొని అనుభవిస్తున్న యాదవరెడ్డి పెట్టిన తప్పుడు కేసులను వెంటనే ఎత్తివేయాలని సిపిఎం వరంగల్ జిల్లా కార్యదర్శి సిహెచ్.రంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పేదలు వేసుకున్న గుడిసెల స్థలాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములను స్వేచ్ఛగా ఆక్రమించుకుంటున్న రియల్ ఎస్టేట్ భూకబ్జాదారులకు ప్రభుత్వం అధికారం కొమ్ముకాస్తుందన్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన ప్రభుత్వం యంత్రాంగం అన్యాక్రాంతమైన 4.38 ఎకరాల భూమిని వెలికి తీసి ప్రభుత్వం హద్దులను నిర్వహించాల్సిన సోయి లేకుండా పోయిందని ఆపైగా ప్రభుత్వ భూములు రక్షించుకున్న పేదలపై సీపీఎం నాయకులపై, సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు, నెక్కొండ మండల కార్యదర్శి ఈదునూరి వెంకన్నపట్టణ కార్యదర్శి పల్సర్ ముత్తయ్య,వెంకటయ్య, యాకూబ్‌లపై తప్పుడు కేసులుపెడుతూ బ్బందులకు గురిచేస్తుందన్నారు. జైలుకు పంపినంత మాత్రాన ప్రభుత్వ భూములు పట్టాభూములు కాలేవని అధికారులు తొత్తులుగా మారినంత మాత్రాన ప్రభుత్వ భూమికాకుండా చేయడం ఎవరి తరం కాదని ఆయన అన్నారు.

మండల కేంద్రంలో అనేక సర్వే నంబర్లలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమై భూస్వాముల కబంధహస్తాల్లో ఉన్న భూమిని వెలికి తీయడంలో మండల రెవెన్యూ యంత్రాంగం చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రభుత్వ భూములను పేదలు ఆక్రమించి గుడిసెలు వేసుకుంటే కేసులు పెట్టాల్సిన అవసరం ఏమిటని ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్న ప్రతి ఒక్కరి పైన కేసులు పెట్టే దమ్ము ధైర్యం అధికార యంత్రాంగానికి ఉందా అని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం ఒకపక్క ఇంటి స్థలం లేని పేదలకు ఇంటి స్థలాలు ఇస్తామని ఏమి లేని పేదలకు ఇల్లు కట్టించి ఇస్తామని మాయమాటలు చెప్పి కాలం వెళ్లదీస్తున్నారు. తప్ప ఏ ఒక్కరికి కూడా నెక్కొండ మండల కేంద్రంలో డబల్ బెడ్ రూమ్ కానీ సొంత ఇంటి స్థలం కానీ ఈ తొమ్మిది సంవత్సరాల కాలంలో ఎవరికిచ్చారు వారి పేర్లను ప్రకటించాలని అన్నారు. ఏ ఒక్కరికి కూడా ఇంటిని గాని ఇంటి స్థలం ఇవ్వని ఈ ప్రభుత్వం ప్రభుత్వ భూములను వెలికి తీసి భూస్వాములతో ఘర్షణ పడి బయటికి తీసిన పేదలపై కేసులు పెట్టడం ఏంటని ఆయన ప్రశ్నించారు. నెక్కొండ మండలంలోని ప్రభుత్వ భూములను ఎక్కడెక్కడ ఉన్నాయో వాటి వివరాలను బయటపెట్టాల్సిన రెవెన్యూ యంత్రాంగం ఎందుకు బయట పెట్టడం లేదని అన్నారు. డబ్బున్న భూస్వాములు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు బెదిరింపులకు పాల్పడినంత మత్రాన ప్రజలను భయభ్రాంతులను చేసినంత మాత్రాన నిజాలు అబద్ధాలు కావని ఆయన అన్నారు.

సీపీఎం పార్టీ వరంగల్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భూక్య సమయ్య మాట్లాడుతూ పేదలు ఆక్రమించుకున్న ప్రభుత్వ భూములకు వెంటనే పట్టాలు ఇచ్చి జీవో నెంబర్ 58 ని అమలు చేయాలని ఎక్కడైతే ప్రభుత్వ భూములు ఆక్రమించుకొని నివాసముంటున్న పేదలందరికీ పట్టాలు ఇచ్చి గహలక్ష్మి పథకం ద్వారా ప్రతి పేదవాడికి ఐదు లక్షల రుణ సహాయం చేసి వారిని ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

ఈ సమావేశంలో స్థానిక కార్యకర్తలు రాధ కవిత, రమేష్, బాలు, కవిత తదితరులు పాల్గొన్నారు

ప్రజాయుద్ధనౌక గద్దర్‌కు వామపక్ష నేతల ఘన నివాళి



నవతెలంగాణ-మట్టెవాడ

ప్రజాయుద్ధ నౌక గద్దర్‌కు సీపీఎం నాయకులు ఘనంగా నివాళులర్పించారు. రంగశాయిపేట ఏరియా కమిటీ ఆధ్వర్యంలో నాయుడు పెట్రోల్ వంపు జంక్షన్ వద్ద సీఐటీయూ జిల్లా అధ్యక్షులు మాలోత్ సాగర్ మాట్లాడుతూ రూపకర్తలూ అనతి కాలంలోనే కనుమరుగవుతారు. గద్దర్ స్వయం ప్రకాశమైన ఒక సూర్యుడిలా కనిపిస్తాడు కానీ ఆ నక్షత్రాన్ని మోసిందీ వెలుగులు ఈ లోకం మీద విరజిమ్మేలా బాహువులు సాచిందీ మాత్రం అణగారిన కులాలేనన్నారు. వర్గ వ్యతిరేక పోరాటంలో అంతర్భాగంగా ఆయన రూపొందింది ఎంత నిజమో పీడిత కుల సమాజం ఆయనను తీర్చిదిద్దింది కూడా అంతేనిజమన్నారు. పాటను ఆయన విప్లవీకరించాడని విమర్శకులు అంటారు. కానీ పాటే ఆయన్ని విప్లవకారుడిగా మార్చింది. ఆ పాటను ప్రజారూపంగా ఆది నుండీ మలిచింది అస్పృశ్య జాతులే. నక్సల్బరీ ఉద్యమమే గద్దర్‌ను సృష్టించింది. తెలంగాణ సాయుధ పోరాటం మొదలుకొని ఇప్పటి వరకు వర్గ వాస్తవికత పేరుతో ప్రజాకళాకారుల పరిమితులను విస్మరిస్తూ వచ్చారు. భూస్వామ్య వ్యతిరేక పోరాటంతో తెలంగాణ ప్రాంతంలో కమ్యూనిస్టు ఉద్యమం మొదల్కెంది. తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రజా నాట్యమండలి విశేష పాత్ర పోషించింది. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అన్ని కులాలు పాల్గొన్నాయన్నారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మారపు సాంబమూర్తి మాటాడుతూ గద్దర్‌లో ఒక సుగుణంలాంటి మనస్తత్వం వుందనీ. అది సమాజ చలనశీలతను గమనించే గుణం అనిఅన్నారు. ప్రజా పోరాటాలలో వస్తున్న మార్పులను గమనిస్తూ, పాలకుల వ్యూహాలను పసిగట్టే గుణం అతనిలో వుంది. తెలంగాణ ఉద్యమం పతాకస్థాయికి చేరుకోవడానికి గద్దర్ రాసి పాడిన పాటలు, ఆయన చేసిన ప్రసంగాలు కూడా ముఖ్యమైనవన్నారు.

ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉసిల్ల కుమార్, ఐద్వా ఏరియా కమిటీ సభ్యులు మాలోత్ ప్రత్యూష జ్యోతి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రశాంత్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రామ సందీప్, నాయకులు విజయ్, రాజు , అనిల్, కవిత, విజయ తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ మృతి తీరనిలోటు : రంగయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి

విప్లవ గాయకుడు గద్దరు మృతి కళా రంగానికి తెలంగాణ విప్లవ నాయకులకు తీరని లోటని సిపిఎం వరంగల్ జిల్లా కార్యదర్శి చింతామల్ల రంగయ్య అన్నారు. అనారోగ్య కారణంగా ఆదివారం చనిపోయిన విప్లవ చైతన్య గాయకుడు గద్దర్ మరణానికి సంతాపం తెలియజేస్తూ గద్దర్ చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించిన రంగయ్య మాట్లాడుతూ ప్రజా గాయకుడు విప్లవ వీరుడు ఉద్యమ నౌక మరణం అత్యంత దురదష్టకరమని అన్నారు. ఆయన చైతన్య పాటలతో ఎంతోమంది ఉద్యమాల బాట పట్టారని చైతన్య గీతాల గొంతు మూగబోయిందని ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని అన్నారు.

వ్యవసాయ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గుమ్మడి రాజుల రాములు



నవతెలంగాణ-కమలాపూర్

వ్యవసాయ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గుమ్మడి రాజుల రాములు అన్నారు. సోమవారం మండలంలోని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని తహశీల్దార్ మాధవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికులకు 1948 కనీస వేతన చట్టం ప్రకారం రెండు సంవత్సరాల ఒకసారి పెరిగిన ధరలు సామాజిక ఆర్థిక పరిస్థితుల ఆధారంగా వేతన చట్టాన్ని సవరించి సవరించిన చట్టం ప్రకారం వ్యవసాయ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలన్నారు. ప్రస్తుత ధరల ప్రకారం వేతన చట్టాన్ని సవరించి వ్యవసాయ కార్మికులకు రోజు కూలి 600 వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని 57 సంవత్సరాల నిండిన ప్రతి వ్యవసాయ కార్మికుడికి పెన్షన్ ఇవ్వాలని వ్యవసాయ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక లేబర్ డిపార్ట్మెంట్ ఏర్పాటు చేయాలని వ్యవసాయ కార్మికులందరికీ డబుల్ బెడ్‌రూమ్ నిర్మించి ఇవ్వాలని సొంత స్థలం ఉన్న వ్యవసాయ కార్మికునికి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న పేదలందరికీ పట్టాలు ఇవ్వాలని అలాగే వ్యవసాయ కార్మికులకు ట్రేడ్ యూనియన్ హక్కులు కల్పించాలని వ్యవసాయరంగంలో స్త్రీ,పురుషులకు సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో టీవీకేఎస్ మండల అధ్యక్షులు లత, కార్యదర్శి పి.శ్రీనివాస్, నాయకులు మౌటం రాజు, రమాదేవి ,చంద్రమౌళి, ఏలియా తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : పెరిగిన ధరలకు అనుగుణంగా వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వ ర్యంలో తహసిల్దార్ జగత్‌సింగ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మడి రాజుల రాములు మాట్లాడుతూ కార్మికులకు, వ్యవసాయ కార్మికులకు, కనీస వేతన చట్టాన్ని తక్షణమే అమలు చేసి రోజు వేతనం రూ 600 ఇవ్వాలని డిమాండ్ చేశారు.

57 ఏళ్ల పైబడిన ప్రతి వ్యవసాయ కార్మికుడికి పెన్షన్ ఇవ్వాలి అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు,లోకిని స్వరూప, ముద్ర కోళ్ల యాదగిరి, అంబాల మమత, దుంపేటి అరుణ, సుబ్రహ్మణ్యం, గుడిసెల వాసులు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి : డీఎంహెచ్ఓ



నవతెలంగాణ-హన్మకొండ/మట్టెవాడ

ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనుష్-5లో భాగంగా వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోని, పాక్షి కంగా వేయించుకున్న పిల్లలనుగుర్తించి టీకాలు వే యించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ బి.సాంబశివరావు తెలిపారు. సోమవారం పోచమ్మకుంట యూపీహెచ్‌సీలో ఇంటెన్సి ఫైడ్ మిషన్ ఇంద్రధనుష్, కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ ముఖ్యంగా హైరిస్క్ ఏరియా లైన స్లమ్‌ఏరియాలు, ఇటుక బట్టీలు పెట్టె ప్రదేశాలు, సంచార జాతుల వారు, ఎక్కువగా టీకాలను మిస్సవుతున్నారని, ఆగస్టు 7 నుండి 12, సెప్టెంబర్ 11 నుండి 16, అక్టోబర్ 9 నుండి 14 తేదీల్లో వారంలో ఆరు పనిదినాల్లో ఈ ప్రత్యేక సెషన్లను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇక నుండి పిల్లలు, గర్భిణీ స్త్రీలు యువిన్ అప్ లో తమ వివరాలను నమోదు చేసుకోవచ్చునని, లేదా టీకాలు ఇచ్చే ఆరోగ్యసిబ్బంది వారి వివరాలను నమోదు చేస్తారని, ఇక నుండి వ్యాక్సి నేషన్ సర్టిఫికేట్ కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చునన్నారు. ఇంతవరకు వ్యాక్సి న్ తీసుకొని వారు, డ్రాప్ ఔట్స్ వారిని గుర్తించి ఈటీకా సెషన్ లలోవేయించాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ యాకూబ్‌పాషా, డిఐఒ డాక్టర్ గీతాలక్ష్మి, డబ్ల్యూహెచ్వో సర్వేలెన్స్ వైద్యాధికారి డాక్టర్‌ప్రశాంత్, ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఉమాశ్రీ, డిస్టిక్ సర్వేలెన్స్ ఆఫీసర్ డాక్టర్ వాణిశ్రీ, జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ హిమ బిందు, జిల్లా మాస్ మీడియా అధికారి వి. అశోక్‌రెడ్డి, డిప్యూటీ డెమో ప్రసాద్, పోచమ్మకుంట అర్బన్ హెల్త్‌సెంటర్ వైద్యాధికారి డాక్టర్ దీప్తి, ఐసిటడిఎస్ సూపర్ వైసర్లు రమాదేవి, రాజ్య లక్ష్మి, సిహెచ్ఓ మాధవరెడ్డి, భగవాన్ రెడ్డి, అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-నడికూడ

అంతర్జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నడికూడ మండల పద్మశాలి సేవా సంఘం అధ్యక్ష కార్యదర్శులు గాదె శంకరయ్య, పాశికంటి రమేష్ ఆధ్వర్యంలో చర్లపల్లి- రాయపర్తి గ్రామంలోని చేనేతకార్మికులను సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి నేతలు మాట్లాడుతూ చేనేత కార్మికులు పొట్ట చేత్తో పట్టుకుని పొరుగు రాష్ట్రాలకు వెళ్లి దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకొని చేనేత కార్మికులను ప్రోత్సహించి వారికి ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసి ప్రోత్సహించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పరకాల రూరల్ మండల అధ్యక్షుడు దాసరి బిక్షపతి, కడారి సమ్మయ్య, సంపత్, చేనేత కార్మికులు, పద్మశాలిలు తదితరులు పాల్గొన్నారు.

మట్టెవాడ : జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని డాక్టర్ రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వరంగల్ కొత్తవాడలోని నివాసం ఉంటూ చేనేత మొకాళ్లపై జీవనోపాధి గత 50 ఏళ్లుగా చేనేత వృత్తిపై ఆధారపడి కుటుంబాన్ని పోషిస్తూ జీవనం సాగిస్తున్న కల్లపల్లి రాజసమ్మయ్య, పెండెం పోషాలు, కళ్ళపెల్లి లక్ష్మి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ ట్రస్ట్ మాట్లాడుతూ గత 50 ఏళ్లుగా జీవనోపాధి దీనిపై ఆధారప డుతూ చేస్తూ రెక్కాడితేగాని డొక్కాడని పరిస్థితుల్లో వీరి జీవనం సాగిస్తున్నందుకు బాధాకరమే అన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్ట్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ తో పాటు కో-ఆర్డినేటర్ మోహన్ వారణాసి ఆర్గనైజర్ శ్రవణ్, శారద, లింగమూర్తి, శంకర్, తాగటం రాము, చందర్ మరియు హరికృష్ణ చేనేత కార్మికులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నాయకులపై దాడిని ఖండించండి



నవతెలంగాణ-నర్సంపేట

ఛలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులపై దాడి చేయడాన్ని ఖండించాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి పైసా గణేష్ కోరారు. సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తెలంగాణ అమరవీరుల స్తూపం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిదేండ్లలో మూడేండ్లగా స్కాలర్‌షిప్, ఫీజురీయాంబర్స్ మెంట్‌లను విడుదల చేయలేదన్నారు. అసెంబ్లీ సమావేశాలలో నూతన విద్యా విధానాన్ని అమలు చేయకూడదని డిమాండ్ చేస్తూ ముట్టడి చేపట్టగా పోలీసులు అత్యుత్సాహంతో దాడికి పాల్పడి పోలీసు స్టేషన్‌కు తరలించడం హేయమైనా చర్య అన్నారు. విద్యార్థి సంఘాల నాయకులను ఎక్కడిక్కడా అరెస్టు చేసి ముట్టడి కార్యక్రమాన్ని విఫలం చేయాలని ప్రభుత్వం భావించిడం సరికాదన్నారు.2018 ఎన్నికల్లో ఇంటర్మీయేట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేస్తామని హామీనిచ్చి అమలు చేయలేదన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని తెలిపారు. ఈ డిమాండ్‌లను నెరవేర్చాలని అసెంబ్లీ ముట్టడి ఆందోళన చేపడితే అరెస్టులు చేసి ప్రభుత్వం అమానుష చర్యలకు పాల్పడుతుందని విమర్శించారు. వెంటనే ప్రభుత్వం డిమాండ్‌లను పరిష్కరించకపోతే మరింత తీవ్రస్థాయిలో పోరాటాలను కొనసాగించాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు మోహన్, రాజు, తరుణ్, నితిన్, వంశీ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

నవతెలంగాణ-నర్సంపేట

గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని జీపీ జేఏసీ ఆధ్వర్యంలో చేపడుతున్న సమ్మె సోమవారం నాటికి 33వ రోజుకు చేరుకొంది. జేఏసీ మండల అధ్యక్షులు ఆనంద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్‌లను పరిష్కంచడంలో పూర్తిగా నిర్లక్ష్యంగావ్యవహరించడం అన్యాయమన్నారు. వెంటనే మల్టీపర్పస్ రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అప్పటి దాకా సమ్మె కొనసాగుతుందని తెలిపారు. ఈ కారక్రమంలో ఉపాధ్యక్షులు మహేందర్, ప్రధాన కార్యదర్శి రాజేశ్వరావు, ఎండీ.యాకూబ్ పాషా, చిన్న, కృష్ణ, శ్రీనివాస్, సుధాకర్, శ్రీశైలం, శ్రీనివాస్, కోటి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలపై పోరాటాలు నిర్వహించాలి



నవతెలంగాణ-ఐనవోలు

స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సిపిఎం కార్యకర్తల కషి చేయాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య పిలుపునిచ్చారు. రెండురోజుల క్లాసులకు మండల కమిటీ సభ్యులు బండి పర్వతాలు అధ్యక్షులు గా వ్యవహరించారు. ఈ క్లాసుల ముగింపు సందర్భంగా రాబోయే రెండు నెలల్లో పార్టీ కార్యకర్తలు చేయవలసిన కృషి వివరించారు. ఈ సందర్భంగా లింగయ్య మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నరు సమస్యలు అధ్యయనం చేసి వాటి పరిష్కారానికి ఆందోళన పోరాటాలు నిర్వహించాలని దీనికి కార్యకర్తలు సిద్ధం కావాలని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యవసర వస్తువుల ధరలను పెంచుతూ పేదలపైన అనేక భారాలు మోపుతున్నాయని అన్నారు. మండలంలో ప్రభుత్వ భూములను కొంతమంది ఆక్రమించుకొని సాగు చేస్తున్న అధికారులు పట్టి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజా సమస్యలు పరిష్కరించి ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్న వారి దగ్గర నుండి తీసి హద్దులు ఏర్పాటు చేయాలని లింగయ్య డిమాండ్ చేశారు. లేకుంటే మేమే ఆ భూమిలో పేదల సమీకరించి గుడిసెలు వేయిస్తామని లింగయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కే. నారాయణరెడ్డి, మహేందర్ దర్శనాల,సంపత్, కవిత, మెకిరి మోహన్ రావు, బాబురావు, నరసయ్య, యాకయ్య, కొమురయ్య, శంకర్ రెడ్డి,గోపాల్ మహేందర్, మాదాసి సలీం, రాజ్ పోచమ్మ, శరణ్య, సుష్మిత, సోనీ, సజనా, సరేనా, తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలి



నవతెలంగాణ-కాజీపేట

అర్హులైన పేదలందరికీ రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్ రూ మ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కా జీపేట మండల సిపిఎం కార్య దర్శి తొట్టె మల్లేశం అన్నారు. భా రత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ కాజీపేట మండల సమావేశాన్ని నాయకులు జంపాల రమేష్ అధ్యక్షతన సోమవా రం దర్గాకాజీపేటలో నిర్వహించగా ముఖ్యఅతిథిగా మండల కార్యదర్శి తొట్టె మల్లేశం హాజరై మాట్లాడుతూ ఫాతిమా నగర్ నుండి దర్గాకు వెళ్లే రోడ్డు మార్గం నిర్మాణం పనులు, హంటర్ రోడ్డు న్యూ శాయంపేట బస్టాండ్ నుండి రైల్వే గేట్ వరకు రోడ్డునిర్మాణ పనులు చేపట్టినందుకు సిపిఎం కాజీపేట మండల కమిటీ పక్షాన ప్రభుత్వ చీప్ విప్ వినయ్‌భాస్కర్‌కి కృతజ్ఞతలు తెలపడం జరుగుతుందన్నారు. దర్గా కాజీపేటలో లైబ్రరీ గతమూడు సంవత్సరాలుగా మూతబడి ఉందని, బస్తీ దావఖానలో డాక్టర్లు సిబ్బంది లేరనీ, దర్గా నుండి బోడగుట్టకు వెళ్లేం దుకు రోడ్డుమార్గం సరిగ్గా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రని, కాజీపేట పట్టణంలోతాగునీరు సరఫరా సక్రమంగా లేదనీ, వెంటనే అట్టి సమ స్యలను పరిష్కరించాలని సిపిఎం పార్టీ పక్షాన కోరడం జరుగుతుందన్నారు.

న్యూ శాయంపేటలో దళితుల భూములలో రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టడం జరిగిందని, అటు ఇండ్లను మాత్రం దళితులకు ఇవ్వకపోవడం అన్యాయమని, 43 కుటుంబాలకు బేసరత్తుగా ఇండ్లు ఇవ్వాలన్నారు. భూ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కందులబండ వద్ద దళిత పేద కుటుంబాలు 500 కు పైగా గుడిసెలు వేసుకున్నారని వెంటనే వారికి 58 జీవో ప్రకారం పట్టాలి ఇచ్చి, ఇండ్ల నిర్మాణం కొరకు రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షలు, కేంద్ర ప్రభుత్వం 10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా

నవతెలంగాణ-శాయంపేట

ఇంటిస్థలం ఉండి ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.5 లక్షల సహాయం అందించాలని ఎంసిపిఐ (యు) ఆధ్వర్యంలో సోమవారం తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. గ్రామ పంచాయితీ కార్యాలయం నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసిల్దార్ కార్యాల యంలో అందజేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పరికరాల భూమయ్య, పెంట తిరుపతి, మంద భద్రయ్య, బుచ్చయ్య, వెంకట్‌రెడ్డి, బాబు రావు, మాధవి, పోషక్క, సంధ్య, లావణ్య, దీప, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రజలు ఎదుర్కుంటున్న ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంసిపిఐ, ఆ పార్టీ అనుబంధ,ప్రజా సంఘాల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం రాష్ట్ర నాయకులు కామ్రేడ్ మంద రవి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎండి ఇస్మాయిల్, కళాకారుల సంఘం జిల్లా నాయకులు కె.రవి పాల్గొన్నారు.



ఏలాంటి హామీ ఇవ్వక పోవడం హాస్యాస్పదం



నవతెలంగాణ-కొత్తగూడ

ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలలో సీఎం కేసీఆర్ పంచాయతీ కార్మికుల గురించి ప్రస్తావించినప్పటికీ ఏలాంటి హామీ ఇవ్వకుండా అంశాన్ని ముగించడం హాస్యాస్పదంగా ఉందని గ్రామపంచాయతీ కార్మిక జేఏసీ కార్యదర్శి మిడతపల్లి యాకయ్య విమర్శించారు. సోమవారం గ్రామపంచాయతీ కార్మికుల జేఏసీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిండి తిప్పలు, ఇల్లు వాకిలి వదిలి 33 రోజులుగా సమ్మె చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల వైపు రాష్ట్ర ప్రభుత్వం కన్నెత్తి చూడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా సీఎం కేసీఆర్ స్పందించి అన్ని కేటగిరీల సిబ్బందికి జీతాలను పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది శంకర్, వెంకన్న, సాంబయ్య, రమేష్, సుమన్, బిక్షపతి, నారాయణ, రామయ్య, కృష్ణ ప్రసాద్, సమ్మయ్య, నరేష్, రమణయ్య, సారక్క, కవిత తదితరులు పాల్గొన్నారు.

వివేకవర్ధినిలో విశ్వకవికి ఘన నివాళి



నవతెలంగాణ-కేసముద్రం రూరల్

మండలంలోని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్లో సోమవారం విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ 77వ వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ రవీంద్రనాథ్ ఠాగూర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ విశ్వకవి, జాతీయ గీతం సృష్టికర్త, నోబెల్ అవార్డు గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ చిన్నతనం నుంచే సాహిత్యం పై మక్కువ పెంచుకున్నారన్నారు. ఠాగూర్ రాసిన గీతాంజలి ఎంతో ఆదరణ పొంది నోబెల్ బహుమతి లభించిందన్నారు. విశ్వకవి అనే బిరుదును కూడా సాధించి పెట్టిందన్నారు. నోబెల్ బహుమతి పొందిన తొలి భారతీయుడు గానే కాకుండా ఆసియాలోనే తొలి వ్యక్తిగా రవీంద్రనాథ్ ఠాగూర్ రికార్డులోకి ఎక్కారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోపణలు విజ్ఞతకే వదిలేస్తున్నా : కొమ్మూరి



నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

పట్టణంలో పార్టీ పరంగా ఎలాంటి కార్యక్రమం చేపట్టే ముందు రాజ్యాంగ రచయిత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి గౌరవించడం తనకు అలవాటని, రెండు రోజుల క్రితం అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసిన సందర్భంగా తనపై కొంత మంది వాస్తవ విరుద్ధమైన ఆరోపణలు చేశారని, వారి విజ్ఞతకే వదిలివేస్తున్నానని మాజీ శాసన సభ్యులు, పిసిసి సభ్యులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఆర్టీసి చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన మాట్లాడుతూ తాను బూట్లు ధరించి దండ వేసినట్లు బిఆర్ఎస్ దళిత సోదరులు చేసిన ఆరోపణలను ఖండిస్తున్నట్లు చెప్పారు. స్వార్ధ రాజకీ యాలతో భూ కబ్జాలు చేసే నాయకుల కుట్రలో భాగంగా తనపై తప్పుడు ఆరో పణలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత రత్న డాక్టర్ రాజమౌళి, కౌన్సిలర్ రామగళ్ళ విజయ్‌కుమార్, బిట్ల నర్సింగరావు, గంధమల్ల కమలాకర్, బండారు శ్రీనివాస్, బాల మైసయ్య, తాటి కనుకస్వామి, చింతకుంట శ్రీనివాస్ తదతరులు పాల్గొన్నారు.

కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలి



నవతెలంగాణ-నరసింహులపేట

వ్యవసాయ రంగంలో పనిచేస్తున్న వ్యవసాయ కూలీలకు కనీస వేతనాల చట్టాన్ని పటిష్టంగా అమలు పరిచి కనీస వేతనాలు అమలయ్యేలా తాసిల్దారులు చర్యలు చేపట్టాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మహబూబాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు బాణాల రాజన్న డిమాండ్ చేశారు. సోమవారం రోజున నరసింహులపేట తాసిల్దారు కార్యాలయం ఆర్ఐ సైదులుకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం రాజన్న మాట్లాడుతూ అన్ని రకాల ధరలు పెంచిన పాలకవర్గాలు పేదలను పీల్చుకు తింటున్నాయని, తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2016 సంవత్సరంలో తీసుకు వచ్చిన కనీస వేతనాలజీవోను సవరించలేదని, ప్రస్తుత ధరలకు అనుగుణంగా జీవోను సమీక్షించి కనీస వేతనాలు నిర్ణయించి లేబర్, రెవిన్యూ డిపార్ట్మెంట్ ద్వారా గ్రామాల్లో టామ్ టామ్ వేయించి కనిస వేతనం అయ్యేలా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో కనీస వేతనాలపై గ్రామాల్లో గ్రామీణ పేదలను సమీకరించి పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల నాయకులు ఎనగండ్ల సోమిరెడ్డి,కూలీలు మహంకాళి, ఏకమ్మ గాడిదల పెద లచ్చమ్మ, సత్తయ్య, వెంకటమ్మ, సోమయ్య, వెంకన్న, సైదులు, బద్రి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి



నవతెలంగాణ-కేసముద్రం రూరల్

మండల తహసిల్దార్ కార్యాలయం ముందు ప్రజా సంఘాల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రజాసంఘాలైన ఏఐసిటియు, ఏఐకేఎఫ్, ఏఐఎడబ్ల్యుఎఫ్, ఏఐఎఫ్టివై గిరిజన సంఘం ఆధ్వర్యంలో ప్లే కార్డ్స్ పట్టుకొని గత ఎన్నికల హామీలను తక్షణమే అమలు చేయాలని కోరుతూ ధర్నా నిర్వహించి తహసిల్దార్ వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం ఏఐసిటియు జిల్లా అధ్యక్షులు కంచ వెంకన్న మాట్లాడుతూ ఇంటి స్థలం లేని పేదలకు ఇంటి బంధు పథకం ప్రవేశపెట్టి ఇంటి నిర్మాణానికి 10 లక్షల రూపాయలు ఇవ్వాలని, ధరణి లోపాలను సరి చేసేందుకు డిజిటల్ సర్వే చేపట్టాలని తహసిల్దార్లకు రికార్డులను సరిచేసే అధికారం ఇవ్వాలని, వర్షాలతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ప్రకటించిన విధంగా నష్ట పరిహారం ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటు కరణ ఆపాలని, రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఉద్యోగం వచ్చేవరకు 5000 రూపాయల నిరుద్యోగ భృ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం గనుక వీటిని అమలు చేయకపోతే దశలవారీ పోరాటాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేరడ వీరస్వామి, కే.కరుణాకర్, ఎస్కే మీరా సాబ్, ఏఐకెఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు జాటోతు బిచ్చ నాయక్, వెన్ను ఎల్లయ్య, బోలకొండ సూరయ్య, బి.రాము పాల్గొన్నారు.

మైనార్టీ బంధులో కొత్తవారికి అవకాశం కల్పించాలి

గ్రీవెన్ సెల్‌లో వినతి



నవతెలంగాణ-తొర్రూరు

రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీలకు ప్రవేశపెట్టిన మైనార్టీ బంధు దరఖాస్తులు చేసుకోవడానికి ఆప్షన్ లాగిన్ ను తక్షణమే ఓపెన్ చేయాలని మైనారిటీ జిల్లా నాయకులు మహ్మద్ అమీర్ సోమవారం జిల్లా కేంద్రంలో గ్రీవెన్స్ సెల్‌లో వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమం కొరకు అర్హులైన ముస్లిం మైనార్టీలకు ఇటీవల లక్ష రూపాయల మైనార్టీ బంధు ఇవ్వడం జరుగుతుందని ప్రకటించి వారం రోజులు గడుస్తున్నప్పటికీ ఇంతవరకు దరఖాస్తు చేసుకోవడానికి ఆన్లైన్లో ఆప్షన్ లాగిన్ ఓపెన్ కాకపోవడంతో లోన్‌కి అర్హులైన పేద ముస్లిం సోదర, సోదరీమణులు అయోమయానికి గురవుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ బంధును దరఖాస్తు చేసుకోవడానికి మరోసారి అవకాశం కల్పించాలని కోరారు. అదేవిధంగా గత ఆరు నెలల క్రితం మైనార్టీ కార్పొరేషన్ క్రింద లోన్ల కోసం అప్లై చేసుకున్న వారికే మైనార్టీ బంధు వర్తిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం, మైనార్టీ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ ఒక ప్రకటన చేయడంతో అర్హులైన వారు నష్టపోయే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు మహమ్మద్ గఫార్,మహమ్మద్ గని, మహమ్మద్ జఫిరుద్దీన్, మహమ్మద్ సైదుల్లా, యాకూబ్ పాషా పాల్గొన్నారు.

నీలం ఐలేష్‌కు కార్మిక వైభవ సేవా రత్న అవార్డు

నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్

టీఎస్ ఎన్పీడీసీఎల్ లైన్ ఇన్స్పెక్టర్, తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 327, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం ఐలయ్య కార్మిక వైభవ కళా రత్న అవార్డు అందుకున్నారు. ట్రేడ్ యూనియన్ నాయకుడిగా విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమ స్యల పరిష్కారానికి హక్కుల సాధనకు చేస్తున్న కృషిని గుర్తించిన లలిత కళా సమాఖ్య ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ అవార్డుకు ఎంపిక చేసింది. ఆదివారం హైదరాబాద్ హరిహర కళాభవన్‌లోజరిగిన అవార్డు ల ప్రధాన ఉత్సవంలో ఐలేష్‌కు కళా సమైక్య ప్రతినిధులు అవార్డు ప్రధానం చే శారు. ఈ సందర్భంగా సోమవారం నియోజకవర్గ కేంద్రంలో ఆయన మాట్లాడు తూ ఇంతటి అరుదైన పురస్కారానికి అర్హునిగా గుర్తించినందుకు యూనియన్ నాయకులు, లలిత కళా సమాఖ్య ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే



నవతెలంగాణ-గూడూరు

ప్రజల సంక్షేమమే ప్ర భుత్వ లక్ష్యమని అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షే మ పథకాలు అందజేస్తామ ని మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ అన్నారు.సోమవారం గూడూరు మండల కేంద్రంలో జెడ్పీ కో ఆప్షన్ ఎండి కాసిం గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం బీసీ బంధు, మైనార్టీ బంధు, గృహలక్ష్మి పథకాలకు అర్హులైన వారందరికీ న్యాయం చేస్తామన్నారు. గ్రామాలలో విభేదాలు లేకుండా గ్రామస్థా యి నుండి వివరాలతో లిస్ట్ అందజేయాలని సూచించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి నిరంతరం కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌కు రానున్న ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తాడని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జెడ్పీకో ఆప్షన్ నెంబర్ ఎండి కాసిం, సర్పంచుల ఫోరం అధ్యక్షులు ముక్క లక్ష్మణ్ రావు, చిన్న ఎల్లాపూర్ సర్పంచ్ బాలు, నాయకులు వెంకన్న, సంపత్ రావు, కటార్‌సింగ్, అశోక్, నవీన్, శివ, హరీష్‌లు పాల్గొన్నారు.

ప్రజావాణి ధరఖాస్తులను పరిష్కరిస్తాం : అదనపు కలెక్టర్



నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన ధరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరిస్తామని అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ చెప్పారు. సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో పాల్గొని ప్రజల నుండి ఆయన ఫిర్యాదులను స్వీకరించారు. జనగామ పట్టణానికి చెందిన దుర్గేటి పుష్ప తాను నిరుపేద కుటుంబానికి చెందిన మహిళనని, తనకు ఆసరా ఫించన్‌ను అందించి ఆదుకోవాలని కోరారు. జనగామ నుండి దుద్దెడ వెళ్ళే మార్గంలో బైపాస్ రోడ్డులో తమ స్వంత భూమి నుండి రహదారి వెళ్తున్నప్పటికీ సంబంధిత అధికారులు తమకు సమాచారం ఇవ్వలేదని, తమకు న్యాయం చేయాలని బచ్చన్నపేటకు చెందిన అర్వపల్లి కృష్ణ శర్మ ప్రజావాణిలో ధరఖాస్తు చేసుకున్నారు. తాను చట్టపరంగా కొనుగోలు చేసిన భూమిని తన పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నప్పటికీ రికార్డుల్లో తన పేరును నమోదు చేసేందుకు అధికారులు ససేమిరా అంటున్నారని, జిల్లా అధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు. జిల్లా ప్రజల నుండి వివిధ సమస్యల పరిష్కారం కోసం 45 ఫిర్యాదులు వచ్చినట్లు రోహిత్ సింగ్ వివరించారు. పై ధరఖాస్తులను తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని జిల్లా అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమలో జెడ్పీ సిఇఒ వసంత, సిపిఒ ఇస్మాయిల్, డాక్టర్ మనోహర్, ఎస్పీడిసిఎల్ ఎస్సీ వేణుమాధవ్, జిల్లా వ్యవసాయాధికారి వినోద్‌కుమార్, డిఎస్ఒ రోజా రాణి, బిసి సంక్షేమ శాఖ అధికారి రవీందర్, విద్యాధికారి రాము, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రశాంత్, కలెక్టరేట్ పరిపాలనాధికారి రవీందర్, మన్సూర్ అలీ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దేవాలయంలో చోరీకి యత్నం



నవతెలంగాణ-లింగాలఘనపురం

శ్రీ బండగుట్ట శ్రీ లక్ష్మీ నర్సింహ్మస్వామి దేవాలయంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి ప్రయత్నించిన సంఘటన మండలంలోని బండ్ల గూడెం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిసిన వివరాల ప్రకారం గుర్తు తెలియని దుండగులు దేవాలయం తాళ్లు పగళ్ల గొటి స్వామి వారి అభరణాలు పూజ సామగ్రిని చిదరవందర పడేసినట్లు తెలిపారు. క్లూస్ టీం సిఐ రాజశేఖర్ బృందం ఆధారాలను సేకరించారు. ఆలయ అర్చకులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. జనగామ రూరల్ సిఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఐ ప్రవీణ్ ఆలయ ప్రాంగణంలో సందర్శించి పరిశీలించారు. వీరితోపాటు సర్పంచ్ కాటం విజయకుమార్ స్వామి ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కేటీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు



నవతెలంగాణ-పాలకుర్తి

బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, పురపాలక, ఐటి శాఖల మంత్రి కేటీఆర్‌ను సోమవారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆధ్వర్యంలో బిఆర్ఎస్ మండలాధ్యక్షుడు పసునూరి నవీన్ హైదరాబాదులో గల జిహెచ్ఎంసి కార్యాలయంలో కలిశారు. నవీన్‌తో పాటు జిల్లా కో ఆప్షన్ సభ్యులు ఎండి మదర్, రైతు బంధు సమితి మండల కో ఆర్డినేటర్ వీరమనేని యాకాంతరావు, ఐలమ్మ మార్కెట్ కమిటీ చైర్మన్ ముస్కు రాంబాబులను మంత్రి ఎర్రబెల్లి కేటీఆర్‌కు పరిచయం చేశారు. నియోజకవర్గ సమస్యలను మంత్రి కేటీఆర్‌కు వివరించారు.

ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టిన నరసింహారావు



నవతెలంగాణ-తొర్రూరు

తొర్రూరు ఆర్డీవోగా జి.నరసిం హారావు సోమవారం పదవి బాధ్యత లు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న రవీంద్రనాథ్ బదిలీపై వెళ్లగా ఎస్ డి సి, ఆర్ అండ్ ఆర్ ఎల్ ఏ యూనిట్ నల్గొండలోపనిచేస్తున్న జి.నరసింహా రావు తొర్రూరు ఆర్డీవోగా బదిలీపై వచ్చారు. నూతన ఆర్డీవోకు సిబ్బంది స్వాగతం పలికారు.

తొర్రూరు మున్సిపాలిటీకి రూ.25 కోట్లు మంజూరు...

మహబూబాబాద్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం తొర్రూరు మున్సిపాలిటీకి 25 కోట్ల రూపాయలను మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ మేరకు సంబంధిత ఉత్తర్వులను హైదరాబాద్‌లో ఐటీ, పరిశ్రమలు, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి కెటి రామారావు మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు సోమవారం అందచేశారు. గతంలో తొర్రూరులో జరిగిన బహిరంగ సభలో మంత్రి కెటిఆర్ ఇచ్చిన హామీ మేరకు ఈ నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులను తొర్రూరులోని పలు అభివృద్ధి పనులకు ఉపయోగించుకోవాలని కెటిఆర్ ఎర్రబెల్లికి చెప్పారు. ఈ సందర్భంగా ఇచ్చిన మాటను నిలుపుకున్న కెటిఆర్‌కి మంత్రి ఎర్రబెల్లి కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు. కాగా, తొర్రూరు అభివృద్ధికి ఈ నిధులు మరింతగా తోడ్పడతాయని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

నవతెలంగాణ-కేసముద్రం రూరల్

పద్మశాలీలు ఐక్యతతో ఉంటూ ఆర్థికంగా రాజకీయంగా ఎదగాలని పద్మశాలి మండల అధ్యక్షుడు సామల నర్సయ్య అన్నారు. సోమవారం జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని మండల కేంద్రంలోని పద్మశాలి సంఘ భవనంలో జెండాను ఆవిష్కరించి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవాళికి మానాన్ని కాపాడి సమాజంలో విలువలతో కూడిన జీవితాన్ని కొనసాగించడానికి వస్త్రాలు నేస్తూ వున్న పద్మశాలీలు ఆర్థికంగా,రాజకీయంగా వెనుకబడుతున్నారన్నారు. రాజకీయ ఐక్యతను చాటుట కొరకు పద్మశాలి గర్జనను ఆగస్టు 13 ఆదివారం రోజున కోరుట్లలో జరుగు సభను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి దాసరి శ్రీనివాస్, కోశాధికారి మామిడాల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు చిట్యాల వీరన్న,పట్టణ యూత్ అధ్యక్షుడు చలమల్ల కిరణ్,సామల రమేష్,సామల లింగమూర్తి, ప్రకాష్, రాపోలు శ్రీనివాస్,సామల వెంకటేశ్వర్లు,సామల శ్రీనివాస్, ముల్క వెంకన్న,బత్తుల కృష్ణ, బత్తుల వీరన్న, సామల సూర్యం,కుసుమ సాంబమూర్తి,రాపోలు రమేష్, రామస్వామి, పొట్ట బత్తిని సదానందం తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన చేనేత కార్మికులు

బచ్చన్నపేట : హైదరాబాదు కన్వెన్షన్ హాల్‌లో సోమవారం జాతీయ దినోత్సవం సందర్భం గా ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ముఖ్య అతిథిగా కేటీఆర్ పాల్గొని సందేశం ఇస్తుండడంతో మండలంలోని చేనేత కార్మికులు బచ్చ న్నపేట నుండి రెండు బస్సులలో 120 మంది తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘ నాయకులు గుర్రపు బాలరాజు మచ్చ నరేందర్, బేతి విమల కృష్ణమూర్తి మంగళపల్లి గణపురం నాగేష్ కొండా హరికృష్ణ, వేముల మురళి, వేముల రాములు, మండల నవీన్, పాము రమేష్, గుండా కేశవులు, గణపురం వెంకటేష్, భాస్కర్, చక్రపాణి, సిద్ధిరాములు, వేముల సత్యం, మల్లిపెద్ది సిద్ధి లింగం తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ రద్దు చేసి, చేనేత బంధు ప్రకటించాలి

నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్

చేనేతపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం చేనేత బంధు ప్రకటించాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం మండల అధ్యక్షులు సిద్దుల సుదర్శన్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని తాటికొండ గ్రామంలో చేనేత జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామ అధ్యక్షుడు రాజేందర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని ఆర్భాటంగా నిర్వహించినంత మాత్రాన సరిపోదని, చేనేత పరిశ్రమ పరిరక్షణకు, కార్మికుల సమస్యల పరిష్కారానికి నిర్దిష్టమైనటువంటి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చేనేతకు రూ. 500 కోట్లు కేటాయించాలని, ప్రతీ కార్మికుడికి పని కల్పించి నెలకు రూ.16వేల ఆదాయం వచ్చేలా చూడాలని అన్నారు. న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం స్పందించి బాసటగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుసుమ రమేష్, వైట్ల బిక్షపతి, గణపురం రాములు, రమేష్, లింగయ్య, కొండయ్య, వెంకటేశం, కుసుమ అనిల్, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా తీజ్ పండుగ వేడుకలు ప్రారంభం

నవతెలంగాణ-గార్ల

గిరిజన సంస్కృతి, సాంప్రదాయలకు ప్రతీకగా నిలిచిన తీజ్ పండుగ వేడుకలు మండలంలోని పినిరెడ్డిగూడెం, డాక్యతండ, చిన్నకిష్టాపురం, చిన్నబంజర, పుల్లూరు, రాజుతండ, బిఆర్ఎస్ తండా, మర్రిగూడెం,బుద్దారం,సీతంపేట తదితర తండాలలో ఆదివారం రాత్రి ఘనంగా ప్రారంభం అయ్యాయి.పెళ్లికాని గిరిజన యువతులు తమ ఆచారం ప్రకారం తొమ్మిది రోజుల పాటు ఉపవాసం ఉంటూ గోధుమలు అలికిన బుట్టలలో ప్రత్యేకంగా తయారు చేసిన ఆలయంలో ఉంచి ఉదయం, సాయంత్రం నీళ్ళు పోసి పూజిస్తూ ఉంటారు.తమను చల్లగా చూడాలని, పాడి పంటలు సంవద్ధిగా పండాలని గిరిజనులు జరుపుకునే ఈ తీజ్ పండుగ వేడుకలలో సర్పంచ్‌లు ఎన్.జ్యోతి, బి.భారతి,జి.రుక్మిణీ, బి.ఉష, యం.జ్యోతి, బి.రాంబాయి, బి.ప్రవల్లిక,బి.బుజ్జి, బి.కమిలి,బి.లావణ్య, గార్లలో కాంగ్రెస్ నాయకులు జి.శ్రీను, గిరిజన యువతులు, పెద్దలు, పిల్లలు, మహిళలు పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులు అవలంభించాలి



నవతెలంగాణ-గార్ల

మిర్చి నారుమడి మరియు ప్రధాన పంటలలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయ అధికారి కావటి రామారావు రైతులకు సూచించారు. మండలంలోని సీతంపేట గ్రామంలో సోమవారం మిర్చి నారుమూడులను క్షేత్రస్థాయిలో ఉద్యానవన శాఖ అధికారి అరుణ్ తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో మిర్చి నారులో ఒక లీటరు నీటికి 10 గ్రాముల 19:19:19 లేదా 3 గ్రాముల అగ్రోమీన్ మ్యాక్స్ అనే మందులను పిచికారీ చేయడం ద్వారా సూక్ష్మ పోషకాల లోపాలను నివారించడం ద్వారా నారు ఏపుగా పెరుగుతుందని చెప్పారు.తెగుళ్ళ నివారణకు ఒక లీటరు నీటికి 3 గ్రాముల కో సైడ్ లేదా 2 గ్రాముల కాపర్ ఆక్సి క్లోరైడ్ ను పిచికారీ చేయాలని సూచించారు. పచ్చిరొట్ట వేసిన రైతులు భూమిలో కలియ దున్ని ఎకరానికి రెండు బస్తాల సూపర్ పాస్పేట్ ను చల్లుకోని, వారం తరువాత జీవ నియంత్రణ పద్ధతులు ఉపయోగించుకోవాలని ట్రైకోడెర్మా, సూడోమోనాస్, పాస్ఫోబ్యాక్టీరియాలను ఎండిన పశువుల పెంటతో కలిపి వినియోగించడం ద్వారా వేరుకుళ్లు, కాండం కుళ్లు, ఎండు తెగుళ్ళను సమర్థవంతంగా అరికట్టవచ్చని తెలిపారు.అచ్చుతోలుటకు ముందు 20 కేజీల జింకు సల్ఫేట్ ను ఎక ఎకరానికి తప్పకుండా వాడాలని సూచించారు. ఈ పంటల పరిశీలనలో రైతులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసు ప్రారంభం



నవతెలంగాణ-గార్ల

మానుకోట ఆర్టీసీ డిపో అధ్వర్యంలో జిల్లా కేంద్రం నుండి గార్ల, డోర్నకల్,అమ్మపాలెం మీదుగా ఖమ్మంకు నూతనంగా ప్రారంభించిన బస్సు సర్వీసును ఈ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిపో ట్రాఫిక్ సూపరిడెంట్ అజీముద్దిన్ అన్నారు. జిల్లా కేంద్రం నుండి గార్ల, డోర్నకల్, అమ్మపాలెం మీదుగా ఆర్‌టిసి నూతన బస్సు సర్వీసును స్థానిక నెహ్రూ సెంటర్‌లో సర్పంచ్ అజ్మీర బన్సీలాల్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలు,ప్రజాప్రతినిధుల అభ్యర్థన మేరకు నూతనంగా బస్సు సర్వీసు ప్రారంభించామని ప్రజల ఆస్తిగా ఆర్‌టిసి సర్వీసును భావించి బస్సులలో సురక్షిత ప్రయాణం ద్వారా గమ్యానికి చేరుకోవాలని కోరారు. నూతనంగా బస్సు సర్వీసు ప్రారంభం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు జితేందర్ అగర్వాల్,యం.గిరిప్రసాద్,పి.రాధాకృష్ణ,వజ్రం,రాజశేఖర్,టి.నాగేశ్వరరావు,దుర్గ, లక్ష్మీనరసింహారావు, కృష్ణ, ఐలేష్, కండక్టర్ అశోక్, డ్రైవర్ దశరథ్ ఉన్నారు.

ఎమ్మెల్సీ కడియం శ్రీహరి కలిసిన పిఏసిఎస్ డైరెక్టర్



నవతెలంగాణ-లింగాలఘనపురం

హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రివర్యులు ప్రస్తుత యం.ఎల్.సి కడియం శ్రీహరిని మండలంలోని నెల్లుట్ల గ్రామానికి చెందిన ప్యాక్స్ డైరెక్టర్ గుర్రం బాలరాజు సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి తన పుట్టినరోజు సందర్భంగా కడియం ఆశీస్సులు తీసుకున్నారు. వారితో పాటుగా పాక్స్ డైరెక్టర్ వేముల కృష్ణా రెడ్డి, కొత్తకొండ గంగాధర్, నారగొని శ్రీనివాస్ గౌడ్, దామెరా ప్రభాకర్ ఉన్నారు.

వృథాగా పోతున్న నీటిని అరికట్టాలి

ఎంపీడీవో రఘురామకృష్ణ



నవతెలంగాణ-బచ్చన్నపేట

మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో ఓవర్ హెడ్ ట్యాంక్ నుండి వృథాగా పోతున్న నీటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రఘురా మకృష్ణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో ఉన్న ట్యాంకును పరిశీలించి మాట్లాడారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి అనిల్ రాజుకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామపంచాయతీ ఆవరణ ఎప్పటికప్పుడు హరిత వనంగా ఉండేవిధంగా చూసుకోవాలని అన్నారు.



హమాలీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

సంఘం జిల్లా కార్యదర్శి నాగయ్య

నవతెలంగాణ-బయ్యారం

హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని హమాలీ సంఘం జిల్లా కార్యదర్శి కుమ్మరికుంట్ల నాగయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వేజేళ్ళ సైదులు రావు భవనంలో వెన్ను మోహన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ నాలుగు లేబర్ కోడ్‌గా మార్చి కార్మికులను కట్టు బానిసలుగా, శ్రమ దోపిడి చేస్తూ ఎనిమిది గంటల పని దినాల నుంచి 12 నుంచి 16 గంటల పని దినాలు తీసుకురావాలని, పెట్టు బడిదారులకు యాజమాన్యాలకు కొమ్ము కాస్తూ నూతన కార్మిక చట్టాలను మారుస్తూ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు. హమాలి కార్మికులకు వెల్ఫేర్ సంక్షేమ బోర్డు ఏర్పాటుచేసి బీమా, ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు కల్పించాలని, డబల్ బెడ్ రూమ్ ఇల్లు కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 9న మండల కేంద్రంలో తాహసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాను, 10న జిల్లా కేంద్రంలో ధర్నాను జయప్రదం చేయాలని, అన్ని రంగాల కార్మికులని భాగస్వామ్యం కావాలని పిలుపు నిచ్చారు.ఈ సమావేశంలో మండల కన్వీనర్ వల్లాల వెంకన్న, డి.పెంటయ్య, ఆర్.అప్పయ్య, ఎస్కే.కాసిం, వెంకన్న, పురుషోత్తం, సైదులు తదితరులు పాల్గొన్నారు.

నలంద కళాశాల యజమాన్యంపై చర్యలు తీసుకోవాలి : పీడీఎస్‌యూ వినతి



నవతెలంగాణ-మహబూబాబాద్

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ కళాశాలలు విద్యార్థుల దగ్గర డిలీట్ ఆప్షన్ల పేరా అధిక ఫీజులు దోపిడిని అరికట్టాలని పిడిఎస్‌యూ ఆధ్వర్యంలో డిఐఈఓకి సమస్యల వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ మాట్లాడుతూ అడ్మిషన్ల సమయంలో విద్యార్థుల దగ్గరకు వెళ్లి వారి హాల్ టికెట్ నెంబర్ తీసుకుని అడ్మిషన్లు చేసుకున్న ప్రవేట్ కళాశాల యాజమాన్యం అడ్మిషన్లు డిలీట్ చేయాలన్నారు. విద్య హక్కు చట్టం ప్రకారం విద్యార్థులు ఒరిజినల్ టిసి మెమో ఎక్కడ ఇస్తే అక్కడే విద్యార్థులకు అడ్మిషన్లు తీసుకోవాలన్నారు. తక్షణమే విద్యార్థులకు సంబంధం లేకుండా అడ్మిషన్లు చేసిన ప్రైవేట్ కళాశాల వారి యొక్క అడ్మిషన్లను లాగిన్ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డిలీట్ ఆప్షన్ ఇచ్చిన కూడా ప్రైవేటు యజమాన్యాలు డిలీట్ చేయకపోవడం సరికాదన్నారు. అడ్మిషన్లను తొలగించాలని నలంద జూనియర్ కళాశాలకు విద్యార్థులు వెళితే విద్యార్థులను పట్టుకొని అనుచిత వ్యాఖ్యలతో అసభ్యకరమైన పదజాలాలతో మాట్లాడిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల పిడిఎస్‌యూ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చరణ్, దిలీప్, రఘు, జగదీష్, సంతోష్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సు...

నవతెలంగాణ-బయ్యారం

మండలలోని జడ్‌పిహెచ్ఎస్ ఉప్పలపాడు పాఠశాలలో పిడిఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులకు శాస్త్రీయ విద్యా విధానం గురించి అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్య కాషాయికరణ చేస్తూ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తుందన్నారు. అంతేకాకుండా శాస్త్రీయ విద్యా విధానాన్ని అమలు చేసి అన్ని వర్గాల ప్రజలకు సమాన విద్య అందించాలని డిమాండ్ చేశారు. సాధారణ ప్రజానీకం నుండి ప్రధాన మంత్రి మనవడి వరకు ఒకే రకమైన విద్యను అందించినప్పుడే శాస్త్రీయ విద్యా విధానం పూర్తిస్థాయిలో అమలైనట్లని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు రేవంత్, ప్రకాష్, రంజిత్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన ఏసీపీని సత్కరించిన ఉపాధ్యాయులు



నవతెలంగాణ-బచ్చన్నపేట

ఇటీవల ఏసీపీగా బచ్చ న్నపేటకు చెందిన మహమ్మద్ సర్వర్ ప్రమోషన్ పొంది ప్ర స్తుతం కరీంనగర్ ఏసీపీగా బాధ్యతలు నిర్వహిస్తున్న క్ర మంలో బచ్చన్నపేట జిల్లా ప రిషత్ సెకండరీ పాఠశాల ప్ర ధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గతంలో పాఠశాలకు చేసిన సేవలకు గా ను శాలువా, పూలమాలతో సత్కరించారు.అలాగే గతంలో 14 వందల నోట్ బు క్స్ తన సొంత ఖర్చులతో విద్యార్థులకు అందించడం జరిగిందని ఉపాధ్యాయు లు తెలిపారు. ఈ సందర్భంగా ఏసిపి సర్వర్ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థుల కు ఏ సహకారాలు కావాలన్నా అందించడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నీలం వేణు, ఉపాధ్యాయ బృందం గట్టు రామచంద్రం, యాకస్వామి, శ్రీనివాస్, ఖాలీల్‌లు పాల్గొన్నారు.

ఆదివాసీల హక్కుల రక్షణకై పోరాడుదాం


ఆల్ ఇండియా ట్రైబల్ ఫోరం పిలుపు



నవతెలంగాణ-బయ్యారం

ఆల్ ఇండియా ట్రైబల్ ఫోరం ఇచ్చిన పిలుపులో భాగంగా సోమవారం మండలంలోని బాలాజీపేటలో దబ్బా రంగయ్య అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ స దస్సులో ఆల్ ఇండియా ట్రైబల్ ఫోరం మహబూబాబాద్ జిల్లా నాయకులు చింత వెంకన్న మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు నుండి మొదలుకొని బీ ర్సా ముండా, కొమరంభీమ్, గంటం దొర, మల్లుదొర, లింగన్న,బాటన్న, కోటన్న తదితర ఆదివాసి తెగల పోరాటాల ఫలితంగాపీసా చట్టం,1/70 చట్టం, 2006 అటవీ హక్కుల చట్టం సాధించుకోవడం జరిగిందన్నారు. ఆదివాసీల హక్కులకు రక్షణగా ఉన్న చట్టాలను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయకుండా కార్పొరే ట్ శక్తులకు ఖనిజ, అటవీ సంపదను కట్టబెట్టుటకు బిజెపి ప్రభుత్వం 2022 అటవీ హక్కుల సంరక్షణ నియమాల పేరుతో చట్టాన్ని తీసుకు వచ్చి ఆదివాసి హక్కులను కాలరాస్తుందని, దీనికి వ్యతిరేకంగా ఆదివాసీలు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ సదస్సులో కొత్త రామదాసు, వెంకన్న, ఏర్నె వెంకటేష్, చిర్రా వెంకన్న,చిర్రనరేష్, కొప్పులకృష్ణ, కొత్తసీత, సరూప,చిర్రాలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం చోటు చేసు కుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం వర్ధన్నపేట నియోజకవర్గం రాయపర్తి మండలం తిరుమలాయపాలెం గ్రామానికి చెందిన తాళ్లపల్లి ప్రభాకర్ (40) హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో నివాసముంటూ కార్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత కొంతకాలంగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడని,ఇటీవల సొంత గ్రామం లో భూసంబంధమైన వివాదాలతో మనస్థాపం చెంది స్థానిక రైల్వే స్టేషన్ ప్లా టు ఫాం బెంచీపై పురుగుల మందు సేవించి మృతి చెందాడు. విషయం తెలు సుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా చేసి, ఏరి యా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య అనిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ



నవతెలంగాణ-నల్లబెల్లి

మండలంలోని బుచ్చిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణానికి సోమవారం స్థానిక సర్పంచ్ లూనావత్ వెంకన్న ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణానికి ఎన్ఆర్ఈజీఎస్ గ్రాండ్ నుండి రూ.20 లక్షల నిధులు ప్రభుత్వం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి కూచన ప్రకాష్, ఏఈ సత్యనారాయణ, గ్రామ పంచాయతీ కార్యదర్శులు శ్రీకాంత్, శ్రవణ్, స్థానిక గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలి

నవతెలంగాణ-భీమదేవరపల్లి

ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకున్న పేదలకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం హనుమకొండ జిల్లా కార్యదర్శి గుమ్మడి రాజుల రాములు అన్నారు వ్యవసాయ కార్మికుల సమస్యలపై భీమదేవరపల్లి తాసిల్దార్ వెంకట భాస్కర్ కు వినతి పత్రం సోమవారం అందజేశారు ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కూలి పెంచాలి భూమి పంచాలి అనే నినాదంతో కార్మికుల పక్షాన పోరాడుతున్నామని అన్నారు కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలన్నారు రోజువారి కూలీ 600 పెంచాలన్నారు 57 సంవత్సరాలు నిండిన ప్రతి వ్యవసాయ కార్మికుడికి పెన్షన్ మంజూరు చేయాలన్నారు వ్యవసాయంలో స్త్రీ పురుషులకు సమాన వేతనాల అందించాలన్నారు. స్వంత స్థలం ఉన్న వారికి ఐదు లక్షల మంజూరు చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అజ్మీర బిక్షపతి కమిటీ సభ్యులు సారయ్య కొమరయ్య గూళ్ళ లక్ష్మి సన్నీళ్ల లక్ష్మి దొండ ఎల్లమ్మ పాల్గొన్నారు.

ఎస్సైగా ఎంపికైన దీక్షకుంట యువకుడు



నవతెలంగాణ-నెక్కొండ

ఇటీవల విడుదలైన ఎస్సైఫలితాలలో మండలంలోని దీక్షకుంట గ్రామానికి చెందిన అ నంతగిరి మధు సివిల్ విభాగంలో ఎస్సైగా ఎంపికయ్యాడు. అనంతగిరి రమ భర్త రవి 1993లో మృతిచెందినా కూలినాలీ చేసుకుంటూ పిల్లలను ఉన్నతంగా చదివించడానికి ఎన్నోకష్టనష్టాలు ఎదుర్కొంది. 2019లో పెద్ద కుమారుడు సిద్దార్థ సివిల్ కానిస్టేబుల్‌గా ఎన్నికయ్యాడు. మధు ఎస్‌ఎస్‌సీ వరకు గ్రామంలోనే పూర్తి చేశాడు. బీటెక్ ఖమ్మంలోని సీఎంఆర్ కాలేజిలో చదువుతూ లక్ష్యంవైపు అడుగులు వేసాడు. 2019లో తన అన్నతో పాటు సివిల్ కానిస్టేబుల్ పరీక్షరాసి తృటిలో ఉద్యోగాన్ని కోల్పోయాడు. 2022లో గ్రూప్-డిలో ఎంపికై రైల్వేలో ఉద్యోగం సాధించాడు. తల్లికి భయంకరమైన క్యాన్సర్ వ్యాధి వచ్చినా తట్టుకుని తల్లి కష్టానికి ఉన్నత ఉద్యోగం సాధించడమే ఏకైక మార్గమని పట్టుదలగా ఎస్సై ఉద్యోగం కోసం ప్రయత్నం చేసాడు. ఇటీవల విడుదలైన సివిల్ ఎస్సై ఫలితాల్లో భద్రాద్రి జోన్ నుండి సివిల్ ఎస్సైగా సెలెక్ట్ ఎంపికై తల్లి కలను నిజం చేసాడు. హైదరాబాద్ లోని పరవస్తు మధుకర్ స్వామి ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ నిర్వహిస్తున్న 'పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ లభించడంతో లక్ష్యంవైపు అడుగులువేశాడు. తల్లి రమ, భార్య మౌనిక, అన్న సిద్దార్థ సహకారంతోనే లక్ష్యం సాధించారని తెలిపాడు. దీంతో మండల,గ్రామ ప్రజలు మధుకి అభినందనలు తెలియజేశారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే గండ్ర పరామర్శ



నవతెలంగాణ-శాయంపేట

మండలంలోని తహరాపూర్ గ్రామానికి చెందిన మిషన్ భగీరథ కాంట్రాక్టర్, పార్టీ సీనియర్ నాయకులు అల్లం రాజ కొమురయ్య ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. సోమవారం బాధిత కుటుంబాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సందర్శించి రాజ కొమురయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మనో ధైర్యంతో ఉండాలని సూచించారు. ఆయన వెంట ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ కుసుమ శరత్, పరకాల ఏఎంసి వైస్ చైర్మన్ రేణుకుంట్ల సదయ్య, సర్పంచ్ బొమ్మకంటి సాంబయ్య, మాజీ సర్పంచ్ జిన్నా రాజేందర్, ఎంపిటిసి గొట్టిముక్కల స్వాతి విష్ణువర్ధన్ రెడ్డి, ఉప సర్పంచ్ సుమన్, నాయకులు ఐలయ్య పాల్గొన్నారు.

ఓటర్లకు అవగాహన సదస్సు



నవతెలంగాణ-నడికూడ

కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన సూచనల మేరకు రెవెన్యూ ఆర్ఐ లవుడియా హేమానాయక్ ఆధ్వర్యంలో ఓటర్లకు అవగాహన సదస్సు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం ప్రదర్శన వాహనం ద్వారా మండలంలోని నర్సక్క పల్లి, వెంకటేశ్వర్ల పల్లి, కౌకొండ గ్రామాలలో వివిధ పోలింగ్ స్టేషనులకు వెళ్లి ప్రజలతో ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించారు. ఓటు వేయుట బ్యాలెట్ యూనిట్ యందు నీలిరంగు బటన్ నొక్కి ఓటు వేయుట, ధ్రువీకరించుట ఓటు వేసిన పిదపద్ నందు పేపర్ స్లిప్ ను ధ్రువీకరించుకొనుట, సంతృప్తి చెందుట మీరు వేసిన ఓటు మీరు ఎంచుకున్న అభ్యర్థికి పడినట్లు ధవీకరించుకొని సంతృప్తి చెందుట కార్యక్రమంలో ఓటర్లు సంతోషంగా పాల్గొని వారి ఓటును ఏ విధంగా వేయాలో తెలుసుకున్నారు. నేటితో నడి కూడ మండలం కార్యక్రమం సంపూర్ణంగా విజయవంతంగా అయినట్లు హేమానాయక్ తె లిపారు. ఈ కార్యక్రమంలో బిఎల్వోలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షునిగా రాజశేఖర్

నవతెలంగాణ-కాశిబుగ్గ

తెలంగాణ ఎరుకల సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షునిగా గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ పరిధిలోని ఎస్సార్ నగర్ కు చెందిన కేతిరి రాజశేఖర్ ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాదులో జరిగిన ఎరుకల సంఘం రాష్ట్ర సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూతాటి రాములు, కన్వీనర్ లోకిని రాజు, మాజీ ఎమ్మెల్యే కుర్ర సత్యనారాయణ ల చేతుల మీదుగా రాజశేఖర్ నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో పదవి అప్పగించిన రాష్ట్ర జిల్లా నేతలకు కతజ్ఞతలు చేశారు.

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి



నవతెలంగాణ-నెక్కొండ

కెసిఆర్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తహశీల్దార్ కార్యాలయం ముందు ఎంసిపిఐయు తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి గాజుల వెంకటయ్య, జిల్లా కమిటీ సభ్యులు సీతారాములు, జల్లి బుచ్చన్న, ఘట్టం సాంబయ్య, అలీసాబ్ తదితరులు పాల్గొన్నారు

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-పర్వతగిరి

మండలం నారాయణపురంలో ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన కందికట్ల యాకయ్య కుటుంబాన్ని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఎర్రబెల్లి వెంకటేశ్వరరావు పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో కందికట్ల ప్రవీణ్, గోగుల బాబు, కందికట్ల స్కైలాబ్, ఉప సర్పంచ్ బొమ్మెర లింగమూర్తి, కందికట్ల సునీల్, శ్రీనువాస్ నాయక్, జేరిపోతుల భాస్కర్, కందికట్ల రాజు,కందికట్ల విష్ణు, కందికట్ల అశోక్, తదితరులు పాల్గొన్నారు.



ప్రజా యుద్ధనౌక గద్దర్‌కు ఘన నివాళి













నవతెలంగాణ-మట్టెవాడ

అనారోగ్య కారణంతో ఆదివారం తనువు చాలించినప్రజా గాయకుడు గద్దర్ కు భద్రకాళి ట్యాంక్ బండ్ ఏరియా అధ్యక్షులు మర్రి రవీందర్ ఆధ్వర్యంలో కాలనీ వాసులు కొవ్వొత్తులతో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గద్దర్ గతస్మృతులు స్మరించుకున్న ఆయన మాట్లాడుతూ నైజాం సర్కారుకు వ్యతిరేకంగా మాభూమి అనే సినిమా తీసి బీద ప్రజలను చైతన్య పరిచారని సిపిఐ ఎం ఎల్ పీ పుల్స్‌వార్ పార్టీలో పనిచేసే ఎన్నో పోరాటాలు చేశారని ఆటపాటలతో తెలంగాణ ఉద్యమాన్ని ఉధ్రుతలూగించారని అన్నారు. తెలంగాణ ఉద్యమం కోసం పాట పాడి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లపల్లి రమేష్, సమ్మయ్య యాదవ్, సిద్దిరాజు యాదవ్, వీ.శ్రీనాథ్ పాల్గొన్నారు.

శాయంపేట : ప్రజా గాయకుడు గద్దర్ తన పాటల ద్వారా అణగారిన వర్గాలను చైతన్యం చేసి ప్రజాఉద్యమాలు చేశారని, ఆయన మరణం యావత్ ప్రజలందరికీ తీరని లోటు అని టిపిసిసి సభ్యులు, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్చార్జి గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ప్రజా గాయకుడు గద్దర్ చిత్రపటానికి జి ఎస్ ఆర్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి, చిందం రవి, మారపల్లి రాజేందర్, ఎండి రఫీ, వలి హైదర్, మార్కండేయ, కట్టయ్య, బిక్షపతి, వీరన్న, విష్ణు, రియాజ్ పాల్గొన్నారు.

కాజీపేట : ప్రజా యుద్ధ నౌక విప్లవకారుడు బహుజన పోరాట యోధుడు గద్దర్ ఆదివారం మరణించగా కాజీపేట చౌరస్తా నందు గద్దర్ చిత్రపటానికి టీడీపీ వరంగల్ పార్లమెంటు సీనియర్ నాయకులు చిలువేరు మహేష్ ఆధ్వర్యంలో సోమవారం నివాళులర్పించగా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హన్మకొండ సాంబయ్య, రాష్ట్ర కార్యదర్శి షేక్ బాబా ఖాదర్ అలీ, ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ నరేష్ నాయక్, పిట్టల శ్రీనివాస్ ముదిరాజ్, వెలగందల రవీందర్, గుప్తా, బైరి శేషాద్రిలు గద్దర్ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి సంతాపం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మల్లయ్య గౌడు, సదానందం, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లి : ప్రజా నాట్యమండలి కళా సమస్త ఏర్పాటుచేసిన ప్రజా కవి కామ్రేడ్ గద్దర్ ఆదివారం అకాల మరణం చెందగా సోమవారం స్థానిక బస్టాండ్ ఆవరణంలో ఆయన చిత్రపటానికి సిపిఐఎం మండల కార్యదర్శి కడియాల మనోహర్, బొడిగె సమ్మయ్య, కడియాల మనోహర్, రాజాబాబు, నాగెల్లి శ్రీను, రామ్మోహన్ చారి, ధామ సాంబయ్య, పరంధాములు, ఆకుల సాంబారావు, బట్టు సాంబయ్య, సాగర్‌లు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ తన ఆట,పాట ద్వారా చైతన్యం కల్పించిన వ్యక్తి కామ్రేడ్ గద్దర్ అని అన్నారు. ప్రజాకవి, యుద్ధనౌక అనే పేర్లు ప్రజలు ఇచ్చిన బిరుదులు ప్రతి ఒక్కరూ గద్దర్ పాడిన పాటకు చెందేయాల్సిందే అని కొనియాడారు. ఇలాంటి నాయకున్ని కోల్పోవడం ఎంతోబాధాకరమని ఆయనఆశయాల కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జోహార్ కామ్రేడ్ గద్దర్ అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నల్లబెల్లి మండల కమిటీ నాయకులు రవి ఇతర అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ గొంతుక మూగబోయింది

హనుమకొండ : హన్మకొండ, ప్రజయుద్ధనౌక, రచయిత, గాయకుడు, నృత్యకా రుడు గద్దర్ కు హన్మకొండ సౌత్ మండల ప్రజా సంఘాల ఆధ్వర్యంలో 31 వ డివిజన్ జ్యోతిరావు పూలేనగర్‌లో ఘనంగా నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ హన్మకొండ జిల్లా కార్యదర్శి మంద సంపత్ మాట్లాడుతూ ప్రముఖ జానపద గాయకుడు, సామాజిక కార్యకర్త గద్దర్ (74) గుండెపోటుతో కన్ను మూశారని ఆయన శాంతిచేకూరాలని అన్నారు. గుమ్మడి విఠల్ రావు అని కూడా పిలువబడే గద్దర్‌ప్రధానంగా తనరంగస్థల పేరుద్వారా ప్రజాదరణ పొందారన్నారు. సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై దష్టిని ఆకర్షించి తన పాటల ద్వారా ప్రజా గాయకుడిగా పేరు తెచ్చుకున్నారని, అంతేకాకుండా 'మాభూమి', 'రంగులకళ' వంటి కొన్నిచిత్రాలలో తన నటనా కౌశలాన్ని ప్రదర్శించారన్నారు. గద్దర్ 1987లో దళితులపై కారంచేడు ఊచకోత తర్వాత జరిగిన పరిణామాలలో ముఖ్యంగా పాల్గొని చురుగ్గా మద్దతునిచ్చారు. తన పరివర్తన ప్రయాణంలో, గద్దర్ ఒక అంకితమైన విప్లవకారుడిగా ఉద్భవించారన్నారు. వెన్నులో బులెట్ ఉన్న పాటను ఏ రోజు ఆపలేదన్నారు.

1969 తెలంగాణ ఉద్యమంలో గద్దర్ చురుగ్గా పాల్గొని భావ వ్యాప్తికోసం ఆయన ఊరురా తిరిగి ప్రచారం చేసేవారన్నారు. బలమైన కమ్యూనిస్ట్ భావజాలం ఉన్న వ్యక్తి అన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రశ్నించే ప్రజా గాన గొంతుగా గద్దర్ ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ అలకుంట్ల యాకయ్య, రజక వృత్తిదారుల జిల్లా కార్యదర్శి కంచర్ల కుమరస్వామి, సీఐటీయూ నాయకులు ఎన్నాం వెంకటేశ్వర్లు, మాచర్ల సతీష్, శ్రావణ్, సౌజన్య స్రవంతి, నవ్య, సరితా తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ కు జోహార్లు : టిపిటిఎఫ్

ప్రజా గాయకుడు సాంస్కతిక యోధుడు గద్దర్ మతికి టి పి టి ఎఫ్ వరంగల్ జిల్లా కమిటీ తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు.వరంగల్ లో జిల్లా ఉపాధ్యక్షులు జె.స్వామి అధ్యక్షతన గద్దరన్న కు ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ మాట్లాడుతూ గుమ్మడి విఠల్‌రావుగా (గద్దర్)చిన్న నాటి నుండే కళలపట్ల ఆసక్తితో ఉండేవాడు. ఇంజనీరింగ్ చదువుకునే రోజుల్లో విప్లవోద్యమానికి ఆకర్షతులయి జానపద కళల్ని, గేయాల్ని ప్రజల్ని చైతన్య వంతం చేయడం కోసం ఇతర మిత్రల తో కలిసి విప్లవ రాజకీయాల్ని వినూత్న పద్ధతుల్లో బహుళ ప్రచారం చేసి ప్రజా కళల్ని, ప్రజా సంస్కృతిని, జానపద కళల్ని అభివృద్ధి చేయడంలో, ప్రజాపరంగావించడంలో గొప్పగా కృషి సాగించాడు. అంతిమంగా ఈ దేశ ప్రజల విముక్తి కోసం గోచి, గొంగడి ధరించి, కాలు కు గజ్జె కట్టి తనదయిన ప్రత్యేక ఆహార్యంతో ముద్రతో ప్రజల్లోకి వెళ్లి అసాధారణమైన కషిని సల్పారు. తాను రాసిన అనేక పాటలు, గీతాలు ప్రజల్ని గొప్పగా చైతన్యవంతంచేసి ప్రజల్ని సమాజ మార్పుకోసం విప్లవోణ్ముఖుల్ని చేశాయని ఆయన లేని లోటు ప్రజాస్వామ్య ఉద్యమాలకు తీరని లోటని పేర్కొన్నా రు. గద్దర్ తన జీవన చివరంకం కాలాన్ని మినహాయస్తేఆయన ప్రజాకళాకారు డుగా, వాగ్గేయకారుడిగా, విప్లవ రచయితగా, జానపద కళలకు, అభివృద్ధికి అసామాన్యమైన కృషిని సాగించాడు.

సాంస్కతిక సేనానిగా, యోధుడిగా గొప్ప కృషిసల్పాడు. ప్రతి కళాకారుడు, రచయితా, కవి గద్దర్ నుండి తీసుకోవాల్సిన స్ఫూర్తి ఇదేఅని టి పి టి ఎఫ్ వరంగల్ జిల్లా అభిప్రాయ పడుతూ ఘన నివాళులు అర్పించింది.నివాళులు అర్పించిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి మనోజ్,ఉపాధ్యాయ దర్శిని సంపాదకులు వి.అజయ్ బాబు,ఉపాధ్యక్షులు జె.స్వామి,. అశోక్, బి పూర్ణచందర్, డి.అశోక్, యాకూబ్ పాషా, డి.రవీందర్ కనక స్వామి తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ ఆశయ సాధన కోసం పాటుపడాలి : స్వర్ణ

కాశిబుగ్గ : పేద ప్రజల కోసం కాలికి గజ్జె కట్టి ఆడి పాడిన ప్రజాయుద్ధం ఒక గద్దర్ ఆశయసాధనకు మనమంతా కషి చేయాలని కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అన్నారు. సోమవారం వెంకటరామ జంక్షన్‌లో ప్రజా గాయకుడు గద్దర్ కు కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎర్రబెల్లి స్వర్ణ ఘనంగా నివాళులు అర్పించారు. యాట ప్రతాప్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ఎంబడి రవీందర్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అయుబ్, నాయకులు అనిల్ కుమార్, జన్ను రవి లింగమూర్తి, గోల్లేన రవి, సుభాష్ గౌడ్ కిన్నెర రవి మహేష్ వరుణ్ రాధిక శ్రీనివాస్ వివేక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాయుద్ధనౌక గద్దర్ కు ఘన నివాళి

ప్రజాయుద్ధనౌక ప్రజా గాయకుడు కామ్రేడ్ గద్దర్ (గుమ్మడి విటల్ రావు)కు సోమవారం పోచమ్మ మైదాన్ లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. కొండా దంపతుల ఆదేశం మేరకు గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పిసిసి నాయకులు నల్గొండ రమేష్ మీసాల ప్రకాష్‌లు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమానికి తన ఆటపాటలతో ఊపిరి పోసిన ప్రజా గాయకుడు గద్దర్ మరణం తెలంగాణ సమాజానికి తీరని లోటు అన్నారు. కార్యక్రమంలో వరంగల్ సిటీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నారగోని స్వప్న నాయకులు మురళి గౌడ్, గిరిగిరి పుష్ప, విజయక్క, సయ్యద్ వసీమ్, ఎండి.సాజిద్, కురిమెల్ల సంపత్, సుందరిగిరి శ్రీనివాస్, సింగం శెట్టి లవన్ కుమార్, దాసరిరాజేష్, ఎర్రం కమల్, విశాల్ బాబు, జన్ను సుధాకర్, జంగం ప్రభాకర్, గౌస్, సిరిమల్లె చెన్నమల్లు, బత్తుల వినోద్,గొండ శ్రీను, దామెర రాజ్ కమల్, దొంతుల రాజేష్, కొమ్ము ఆశీర్వాదాం, జన్ను అరవింద్, మడూరి నరేష్ తదితరులు ఉన్నారు.

వర్ధన్నపేట : ప్రముఖ ప్రజా గాయకుడు గద్దర్ (గుమ్మడి విఠల్ రావు) పార్థివ దేహానికి హైదరాబాద్‌లోని ఎల్బీస్టేడియంలో మంత్రి వర్యులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి బిఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన ఉద్యమం లో తన పాటద్వారా పల్లె పల్లెన భావజాలవ్యాప్తి చేసిన గద్దర్ గారి మరణం చాలా బాధాకరమని,ఆయన పవిత్ర ఆత్మకుశాంతి చేకూరాలని ఆ భగవంతుణ్ణి కోరుకుంటు వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ప్రగాఢ సానుభూతి తెలిజేయజేశారు.

హామీల ప్రచారంలో యూత్ కాంగ్రెస్ ముందుండాలి : రేపల్లె



నవతెలంగాణ-కాజీపేట

కాంగ్రెస్‌అమలు చేయనున్న హామీలను గడపగడపకు తీసుకెళ్ల డంలో యూత్‌కాంగ్రెస్ ముందుం డాలని జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రేపల్లె రంగనాథ్ అన్నారు. వరంగల్ పశ్చిమ నియోజగవర్గంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కొడిపాక గణేష్ ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ డోర్ టు డోర్ ప్రచారం సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రేపల్లె రంగనాథ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి యూత్ కాంగ్రెస్ వెన్నెముక లాంటిదని బూత్‌స్థాయిలో పనిచేయడంలో యువజన కాంగ్రెస్ నాయకులు ముందుండాలన్నారు. కాంగ్రెస్‌హామీలని గడప గడపకు తీసుకెళ్ళాలని, బిఆర్ఎస్,బిజెపిల మోసాలని వివరించాలన్నారు. కాంగ్రెస్ గెలుపు కోసం 4నెలలు యువనాయకులు నిరంతరం శ్రమించాలని సూచించా రు. వచ్చే ఎన్నికల్లో వరంగల్ పశ్చిమ లో కాంగ్రెస్ పార్టీ జెండాని ఖచ్చితంగా ఎగరవేద్దామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 47వ డివిజన్ సందెల విజయ్ కుమార్, రావుల విద్యాసాగర్, గంగులరాజిరెడ్డి, సత్యవరం మధుకర్, అశోక్, 47వ డివిజన్ యూత్ ప్రెసిడెంట్ ఇమ్మడి నాగరాజు, సంజయ్, అఫ్రోజ్,యాకుబ్, సురేందర్ ఆకారపు శివాజీరమేష్, దాస్‌రాజు, లాలు,మహేష్‌రబ్బాని,అఖిల్,బన్నీ పాల్గొన్నారు.

భగ్గుమన్న భూ తగాదాలు

విచక్షణా రహితంగా ఇంటిపై దాడి

ఒకరికి తీవ్ర గాయాలు



నవతెలంగాణ-చెన్నారావుపేట

గ్రామాల్లో భూతగాదాలు భగ్గుమంటున్నాయి ఒకరిపై ఒకరు దాడులు చేసుకునే స్థాయికి చేరాయి, ఇలాంటి ఘటనే ఆదివారం చెన్నారావపేట మండల పరిధిలోని ఎల్లయ్యగూడెం గ్రామంలో బీసీలకు బీసీలకు మధ్యనే ఆరు ఎకరాల భూమిని కౌలుకు తీ సుకొని పెట్టుబడుల విషయం లో గొడవలు జరిగాయి, పంచాయతీ పెద్దమనిషి ఇంటిపై కర్రలతో విచక్షణ రహితంగా కొట్టుకోగా తీవ్ర గాయాలయ్యాయి, మరికొంతమందికి స్వల్ప గాయాలు కాగా వీరిని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

పంచాయతీ పెద్దమనిషి పై దాడులు

గ్రామంలోని చిప్ప ఈశ్వర్, అదే గ్రామానికి చెందిన కర్రె రవి ఆరు ఎకరాల భూమిని గత సంవత్సరం కౌలు కు దున్నుకున్నారు. భూమిలో పెట్టిన పెట్టుబడులు పండిన ధాన్యం అమ్మిన డబ్బుల విషయంలో ఆదివారం గ్రామ పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ పెట్టుకోగా చిప్ప ఈశ్వర్ తరపున పెద్దమనిషిగా జినుకల కనకమల్లు పంచాయతీ పెద్దగా రాగా, కర్రె రవి నువ్వు నా మీద పంచాయితీ చేస్తావా అంటూ దుర్భాషలాడుతూ పంచాయతీలోనే కనకమల్లుతో గొడవ పడినట్లు తెలిపారన్నారు. విషయాన్ని మనసులో పెట్టుకున్న కర్రె రవి అతని కుటుంబ సభ్యులతో సాయంత్రం 11: 30 కనుక మల్లు ఇంటి మీద కర్రలతో దాడి చేసి అతని భార్య, తండ్రి పై దాడి చేసి గాయపరిచారని బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తోట మహేందర్ తెలిపారు.

ప్రభుత్వం మారితే సర్పంచ్‌ల పరిస్థితి ఏంటి ?



నవతెలంగాణ-ఆత్మకూర్ (గీసుగొండ)

ప్రభుత్వం మారిన,ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన అప్పులు తెచ్చి పనులు చేసిన సర్పంచుల పరిస్థితి ఏంటని జడ్పిటిసి పోలీస్ ధర్మారావు ఇంజనీరింగ్ అధికారులపై విరుచుకుపడ్డాడు. సోమవారం గీసుకొండ మండలం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భీమగాని సౌజన్య అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ప్రారంభంతోటే ఇంజనీరింగ్ అధికారులు పిఆర్ ఏ ఈ నల్ల సుధాకర్ మాట్లాడుతుండగా జడ్పిటిసి పోలీస్ ధర్మారావు ఈజీఎస్‌లో మంజూరైన సీసీ రోడ్లను వేగవంతంగా ప్రజాప్రతినిధులు పూర్తి చేశారు. కానీ ఇంజనీరింగ్ అధికారులు నేటివరకు ఎందుకు ఆన్లైన్ చేయలేదంటూ అధికారులపై జెడ్పిటిసి మండిపడ్డారు. రెండు నెలలలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినా, ప్రభుత్వం మారినా పనులు చేసిన సర్పంచ్‌ల పరిస్థితి ఏంటని అధికారులను ప్రశ్నించారు. పక్క మండలం సంగెంలో బిల్లు ఎందుకు వచ్చాయి? ఇక్కడఎందుకు రావడంలేదని అధికారులను మందలించారు. పిఆర్ ఎఈ మాట్లాడుతూ సకాలంలో బిల్లులు చెల్లించేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. మండలంలో 12 గ్రామపంచాయతీలకు నిధులు మంజూరు అయితే ఇప్పటివరకు ఎన్ని గ్రామ పంచాయితీ భవనాలు పూర్తి చేశారని నిలదీశారు. మీ నిర్లక్ష్యం వల్లనే నిధులు ఉన్నా కూడా 7 గ్రామ పంచాయతీలను

మొరం తరలిస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారు

ఇంజనీరింగ్,ఇరిగేషన్ అధికారులపై మండిపడ్డ జెడ్పీటీసీ

సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధుల గరం గరం

ఎందుకు మొదలుపెట్టలేదంటూ ఇంజనీరింగ్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.కెనాల్ మురాన్ని విచ్చలవిడిగా తవ్వకెళ్తుంటే ఇరిగేషన్ అధికారులు ఏం చేస్తున్నారంటూ జడ్పిటిసి ప్రశ్నించారు.కోట్లాది రూపాయల మొరాన్ని తవ్వకెళుంటే మీరెందుకు పట్టించుకోవడంలేదని దాని వెనుకున్న ఆంతర్యం ఏమిటని నిలదీశారు.సమాధానం చెప్పలేక ఇరిగేషన్ అధికారులు నీళ్లు మింగారు. కుడా, గ్రామ పంచాయతీ పర్మిషన్ లేకుండా ప్లాట్లు చేసి అమ్ముతుంటే అధికారులు ఏం చేస్తున్నారంటూ కొమ్మాల ఎంపిటిసి గోపాల్, కో ఆప్షన్ మెంబర్ రహీం నిలదీశారు. అధికారులు కాసులకు కక్కుర్తి పడి తప్పుడు రిజిస్ట్రేషన్లు చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి అందిన కాడికి దోచుకుంటున్నారన్నారు. జిల్లా ఉన్నతాధికారుల స్పందించి లేఅవుట్లపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మండలంపై ప్రభుత్వ వివక్షత ఎందుకు : ఎంపీపీ సౌజన్య

అధికారులు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు ప్రజా ప్రతినిధులు చేసిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లించకుండా కాలయాపన చేయడం వల్ల పనులు చేసిన ప్రజా ప్రతినిధులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే చేసిన పనులకు ఎంబిలు రికార్డు చేసి సకాలంలో బిల్లులు చెల్లించాలన్నారు. గ్రామాల్లో పనిచేసేటప్పుడు అధికారులు గ్రామంలోని ప్రజా ప్రతినిధులకు ఎందుకు సమాచారం ఇవ్వడం లేదని అధికారులను ప్రశ్నించారు. విప్లవ వీరుడు అకాల మరణానికి నివాళులు అర్పించాలని ఎంపీపీ కోరడంతో మండల సర్వసభ్య సభ్యులు అధికారులు ఒకేసారి లేచి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ సమావేశంలో గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌గా జగత్‌సింగ్



నవతెలంగాణ-ఎల్కతుర్తి

ఎల్కతుర్తి మండల తహసీల్దారుగా జగత్ సింగ్ పదవీ బాధ్యతలను సోమవారం చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న తహసిల్దార్ గుజ్జుల రవీందర్ రెడ్డి సిద్దిపేట జిల్లాకు బదిలీపై వెళ్లారు. కరీంనగర్ కలెక్టరేట్లో ఏవోగా పనిచేస్తున్న జగత్ సింగ్ తాసిల్దారుగా వచ్చారు. ఆయనకు డిప్యూటీ తాసిల్దార్ సునీత, సీనియర్ అసిస్టెంట్ నెహ్రూ, ఆర్ ఐ బత్తిని శ్రీధర్, సర్వేయర్ సుజాత, వి ఆర్ ఏ లు, గంజి నరసింహులు, వల్ల బోజుల విష్ణు, బొంకూరి రవీందర్, శ్రీకాంత్, ఆవుల శ్రావణ్ కుమార్, అంబీరు రాజు, పుష్పగుచ్ఛమిచ్చి ఆహ్వానం పలికారు.

రామచంద్రుతండాలో 110 తులాల వెండి చోరీ



నవతెలంగాణ-పెద్దవంగర

తాళంవేసిన ఇంట్లో దొంగలు పడి 110 తులాల వెండి దోచుకెళ్లారు. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లా, పెద్దవంగర మండల పరిధిలోని రామ చంద్రు తండాలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జాటోత్ కష్ణ తన గహానికి తాళం వేసి వత్తిరీత్యా హన్మకొండలో నివాసముంటున్నారు. అప్పుడప్పుడు వస్తూ, గ్రామంలోని వ్యవసాయ పనులు చూసుకునేవారు.ఇటీవల వచ్చి వెళ్లిన ఆయన ఆదివారం మధ్యాహ్నం వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు బీరువా తెరచి రూ. 33 వేల విలువచేసే 110 తులాల వెండి, విలువైన పత్రాలను దోచుకెళ్లారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి



నవతెలంగాణ-పాలకుర్తి

సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పిఎస్ యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు టి.హేమలత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12న జనగామలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ యుఎస్‌పిసి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గల ఉన్నత పాఠశాలలో వాల్ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హేమలత, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు నష్టం వాటిల్లే సిపిఎస్ విధానాన్ని ప్రభుత్వం రద్దు చేయాలన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలని, పండిట్ పీఈటీల పోస్టులు అప్‌గ్రేడేషన్ చేయాలని, పిఆర్‌సిని వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యు.ఎస్.పి.సి జిల్లా బాధ్యులు ఇమ్మడి అశోక్, చిక్కుడు శ్రీనివాస్,ఎండి షరీఫ్, మండల ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ సభ్యులు వీరమల్ల బాబయ్య, చిదురాల శ్రీనివాస్, డి వెంకటేశ్వర్లు, పోగు వెంకట నరసయ్య, చిదురాల రమేష్ పాల్గొన్నారు.



భారీగా నల్ల బెల్లం, పట్టిక స్వాధీనం

ఒక కారు, మహేంద్ర వాహనం సీజ్

మహబూబాబాద్ జిల్లా అడిషనల్ ఎస్పీ జే.చెన్నయ్య

నవతెలంగాణ-నెల్లికుదురు

అక్రమాలకు నిబంధనలకు విరుద్ధంగా పాల్పడితే ఎంతటి వారినైనా సహించేది లేదని మహబూబాబాద్ జిల్లా అడిషనల్ ఎస్పీ జె.చెన్నయ్య తెలిపారు. మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో డిఎస్పి వెంకటేశ్వర బాబు, తొర్రూర్ సిఐ సత్యనారాయణతో కలిసి సోమవారం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిందితుడు బాదావత్ భాస్కర్ అనే వ్యక్తి త్వరగా డబ్బులు సంపాదించాలని ఉద్దేశంతో తనకున్న మినీ వ్యాన్‌లో బీదర్ వెళ్లి అక్కడ గుడుంబాకు అవసరం పడే నల్లబెల్లం, పట్టికను తీసుకువచ్చి తెలంగాణ రాష్ట్రంలో నిషేధించబడిన నల్లబెల్లంను మరిపెడ పరిసర ప్రాంతంలో ఎక్కువ రేటుకు విక్రయించి అధిక లాభాలు పొందేవాడు అని అన్నారు. నెల్లికుదురు ఎస్సై కనుకుల క్రాంతి కిరణ్ తన సిబ్బందితో బ్రాహ్మణ కొత్తపెల్లి ఆకేరు వాగు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మహేంద్ర లోడు మినీ వ్యాన్‌లో ఉన్న 120 బస్తాలు 60 క్వింటాల నల్లబెల్లం, 50 కేజీల పట్టికను తరలిస్తుండగా బాధావత భాస్కర్ అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. తేజావత్ యాకూబ్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ నిందితుడిపై గతంలో మరిపెడ దంతాలపల్లి శిరోల్ చిన్న గూడూర్ పోలీస్ స్టేషన్లో నాలుగు కేసులు ఉన్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ 9 లక్షల రూపాయలు ఉంటుందన్నారు. పిడిఎస్ బియ్యం, అక్రమ ఇసుక రవాణా, బెల్లం, పట్టికను ఎవరైనా దొంగతనంగా తరలించాలని చూస్తే ఊరుకునేది లేదని అన్నారు. పోలీస్ సిబ్బందికి అవార్డు, రివార్డ్స్ అందజేశారు.

తొర్రూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో...

కొమ్మనపల్లి తండాకు చెందిన గుగులోత్ అనిల్ అనే వ్యక్తి అక్రమ వ్యాపారం చేస్తుండగా తొర్రూరు ఎస్సై కె జగదీష్‌కు నమ్మదగిన సమాచారం రాగా తొరూరు పరిసర ప్రాంత తండాలో బెల్లం అమ్ముతున్నాడని సమాచారం మేరకు తన సిబ్బందితో కలిసి మడిపల్లి ఎక్స్ రోడ్డు వద్ద ఏడవ తేదీన ఉదయం అందాజ నాలుగున్నర గంటలకు వాహనాలు తనిఖీ చేస్తుండగా టాటా ఇండికా కార్లు తొర్రూరు నుండి నెల్లికుదురు వైపు వస్తుండగా ఎస్సై తన సిబ్బంది విజేందర్ శ్రీనివాస్‌తో కలిసి అనుమానంతో ఆపి తనిఖీ చేస్తుండగా పోలీసులను చూసి కారు వదిలేసి పారిపోయాడని అన్నారు. 15 బస్తాల్లో ఉన్న బెల్లం, 25 కేజీల పట్టికను సీజ్ చేసినట్టు తెలిపారు.



ప్రతీ విద్యార్థికి ఆధార్ సంఖ్య తప్పనిసరి

నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్



ప్రతీ విద్యార్థి ఆధార్ సంఖ్య తప్పనిసరి కలిగి ఉండాలని ఆధార్ సేవా కేంద్రం జిల్లా కో ఆర్డినేటర్ తేజావత్ మోహన్ పిలుపునిచ్చారు. చిల్పూర్ మండలం వెంకటాద్రిపేట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో నమోదు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ప్రతీ సంవత్సరం యూ డైస్ (డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఎడ్యుకేషన్) లో భాగంగా ప్రభుత్వ ప్రయివేట్ పాఠశాలలోని సదుపాయాలతో పాటుగా, విద్యార్థుల పూర్తి వివరాలు నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు కాత్యాయని, స్వరూప, రేఖ, అంగన్వాడీ టీచర్ వరలక్ష్మి, ఆధార్ నిర్వాహకులు శ్రీపతి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ హింసాత్మక ఘటనపై క్రైస్తవుల ర్యాలీ

నవతెలంగాణ-పాలకుర్తి



మణిపూర్‌లో జరుగుతున్న హింసాత్మక అల్లర్లను నిరసిస్తూ సోమవారం క్రైస్తవులు పాలకుర్తిలో నియోజకవర్గ స్థాయి ర్యాలీని నిర్వహించారు. మణిపూర్‌లో జరుగుతున్న హింసాత్మక ఘటనలను ఆపాలని, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తూ క్రైస్తవులు పాలకుర్తి తహసిల్దార్ తీరందాస్ వెంకటేష్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

హామీలు కాదు... అమలు చేయాలి...

నవతెలంగాణ-బయ్యారం

ఉపాధ్యాయుల ప్రయోజనాలు, విద్యారంగ సమస్యల పరిష్కారం పట్ల హామీలు ఇవ్వడం కాకుండా తక్షణమే అమలు చేసి చూపాలని, ఇప్పటికే విద్యా రంగం చాలా కాలంగా సమస్యల పరిష్కారానికి ఎదురుచూస్తుందని టీపీటీఎఫ్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు చుంచు శ్రీశైలం అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సందర్శించి ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఉద్యోగ ఉపాధ్యాయులకు వేతనాలు పెంచు కుందామని తొమ్మిదేండ్ల క్రితం ఇచ్చిన హామీని మళ్ళీ ఇప్పుడు వల్లె వేస్తున్నారని అన్నారు. కుల, మత, ఆర్థిక అంతరాలు లేకుండా పిల్లలందరూ ఒకే పాఠశాలలో చదువుకునే విద్యా విధానాన్ని అమలు చేస్తామని ఇచ్చిన వాగ్దానం ఏమైందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కోసం అమలు చేస్తున్న నిధులు లేని పథకం మన ఊరు మన బడి ప్రచారానికే పరిమితం అయిందన్నారు. పెండింగులో ఉన్న డి.ఎ, మధ్యంతర భృతి (ఐ.ఆర్) ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల బాధ్యులు ఎం.శ్రీనివాస్ రెడ్డి, బి.లక్ష్మయ్య, సరోజిని, రామ ప్రవీణ్, జి.కిషన్, వేణుగోపాల్ రెడ్డి, టి.రమేష్, నాగ సరస్వతి, రత్నమాల, కె.కవిత, మౌనిక, శమంతకమణి, పద్మావతి, పద్మ, జి.నిర్మల, బి.శంకర్, బి.భాస్కర్, రాంజీ, కుమారి, కె.లక్ష్మీనారాయణ, మహబాద్ మండల బాధ్యులు రాచకొండ ఉపేందర్, ఎస్.విద్యాసాగర్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా గాయకులు గద్దర్‌కు ఘన నివాళులు









నవతెలంగాణ-నర్సింహులపేట

జీవితాంతం సమాజానికి త్యాగాలకు, ప్రజాసేవకు సూచికగా ప్రజా గాయకులు గద్దర్ అని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జినుకల రమేష్, పిఎసిఎస్ డైరెక్టర్ రజనీకాంత్ రెడ్డి అన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక వివేకానంద విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి ఘన నివాళులర్పించి, ఆయన మృతికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణలో ఉద్యమ గళం మూగబోయిందని, తన పాటతో.. ఆటతో చైతన్యం నింపిన ప్రజా యుద్ధ నౌక గద్దర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గౌని యాదగిరి, ఇసాక్, రేఖ అనిల్, తోట కేశవ్, దాసురు నాయక్, ఏరానాగి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని నెహ్రూ సెంటర్‌లో ప్రజా గాయకులు గద్దర్ అకాల మరణాన్ని చింతిస్తూ మహబూబాబాద్ అర్బన్ కాంగ్రెస్ అధ్యక్షులు ఘణపురపు అంజయ్య నేతృత్వంలో వారి చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ గద్దరన్న తన శరీరంలో బుల్లెట్లు ఉంచుకొని కూడా పీడిత ప్రజల కోసం కొట్లాడటం జరిగిందని, తన చివరి దశలో ఈ దేశంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే సబ్బండ వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని కాంగ్రెస్ పార్టీని బలపరచాలని పిలుపు నిచ్చారని, వారి ఆశయ సాధనకై కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని అన్నారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఎస్టీ సెల్ రాష్ట్ర కో ఆర్డినేటర్ వెంకట్ నాయక్, కిసాన్ సెల్ అధ్యక్షులు తోట వెంకన్న, ఎస్టీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షులు బానోత్ ప్రసాద్ నాయక్, బయ్యారం మండల పీఏసీఎస్ డైరెక్టర్ జూలకంటి సీతారాం రెడ్డి, రాంశెట్టి వీరేందర్, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు రియాజ్ అన్సారీ, మహబూబాబాద్ మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు బాతుక స్వర్ణలత, విజయలక్ష్మి, రామరాజు ఉపేందర్ పటేల్, గండు కార్తీక్, ఖాజా పాషా తథితరులు పాల్గొన్నారు.

కళ కళ కోసం కాదు కళా ప్రజల కోసం కళా ప్రగతి కోసం ప్రజా సంస్కృతిక యుద్ధనౌక గద్దర్ అన్న అంటు పిఎన్ఎమ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏర్పుల వెంకన్న కొనియాడారు. సోమవారం ప్రజానాట్యమండలి పిఎన్ఎమ్ మహబూబాబాద్ జిల్లా విస్తృత స్థాయి సమావేశం పిఎన్ఎం సీనియర్ నాయకులు నూనె శీను అధ్యక్షతన పెరుమాండ్ల జగన్నాథం భవన్ జరిగింది. ఈ సమావేశంలో ఏర్పుల వెంకన్న ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసం గిస్తూ "కల కల కోసం కాదు, కల ప్రజల కోసం, కల ప్రగతి కోసం"అంటూ 1948 గరికపాటి రాజారావు చిన్న సంస్థగా స్థాపించారని తెలిపారు. ప్రపంచంలోనే అనేక దేశాలలో అనేక ప్రదర్శనలు ఇచ్చిన సంస్థ పిఎన్ఎమ్ అని తెలిపారు. దేశవ్యాప్తంగా అనేక స మస్యలపై ప్రపంచ దృష్టికి పిఎన్ఎం తీసుకుపోయిందన్నారు. ప్రజానాట్యమండలి జిల్లా నిర్మాణ సుర్ణపు సోమయ్య మాట్లాడుతూ ప్రజాకళలు అట్టడుగు ప్రజలను చైతన్య పరిచి వాళ్ళ హక్కుల సాధన కోసం తోడ్పడాలని తెలిపారు. రాష్ట్రంలో కెసిఆర్ ప్రభుత్వం భూస్వామ్య అణిచివేత ప్రజాస్వామ్య హక్కులు లేకుండా భూదోపిడి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కుర్ర మహేష్, కడియం సత్యం, జంగం కాంపెల్లి ఉప్పలయ్య, బూర్గుల లక్ష్మణ్, మచ్చ వెంకన్న, పచ్చ నగేష్, ఎస్‌డి ఫర్వీన్, కొమ్ము శ్రీనివాస్, వెంపటి మహేందర్, వద్దూరి నరేందర్, మన్యం మల్లేష్, ఉప్పలయ్య, కడారి విజయ, హరిత పాల్గొన్నారు.

కొత్తగూడ : ప్రజల సమస్యలనే అస్త్రాలుగా చేసుకొని ఆటపాటలతో ప్రజలను చైతన్య పరుస్తూ చివరి వరకు ప్రజల వెంట నడిచిన యోధుడా నీకు లాల్ సలాం అని సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా గ్రామ కార్యదర్శి ముద్రబోయిన కొమ్మాలు అన్నారు. సోమవారం మండలంలోని గుండంపల్లి గ్రామ పంచాయతీ పరిధి తిమ్మాపురం గ్రామంలో సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అలుపెరుగని పోరాట యోధుడా లాల్ సలాం అంటూ గద్దర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో యూత్ అధ్యక్షులు పెనుక సతీష్, గట్టి సుధీర్, శోభన్, గ్రామ పెద్దలు పెద్ద వీరస్వామి, సదానందం, స్వామి, రాజు తదితరులు పాల్గొన్నారు.

తొర్రూరు : గద్దర్ మృతి బడుగు బలహీన వర్గాల పేద ప్రజలకు తీరని లోటని నేషనల్ హ్యూమన్ రైట్స్ అధ్యక్షులు మంగళపల్లి హుస్సేన్ అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కేంద్రం విశ్రాంతి భవనం ముందు తెలంగాణ అమరుల వీరుల స్థూపం వద్ద గద్దర్ చిత్రపటానికి పూలమాలతో కమిటీ సభ్యులతో కలిసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మంగళ పెల్లి హుస్సేన్ మాట్లాడుతూ కామ్రేడ్ గద్దర్ అన్న సేవలు తెలంగాణ ప్రజలు ఎన్నటికీ మర్చిపోరన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్, ట్రెజరర్ శ్రీరామ్ నవీన్, రాష్ట్ర కమిటీ సభ్యులు గంధం బాలయ్య, మహబూబాబాద్ జిల్లా సోషల్ సర్వీస్ ప్రెసిడెంట్ గారవీరస్వామి, నవీన్, శ్రీనివాస్, కార్మికులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

జనగామ కలెక్టరేట్ : స్థానిక చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం మాజీ శాసన సభ్యులు, పిసిసి సభ్యులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి గద్దర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కొమ్మూరి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కీర్తి తెచ్చిన ప్రజా వాగ్గేయ కారుడు గద్దర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి అధికార ప్రతినిధి సుధాకర్ గౌడ్, నాయకులు దయాకర్ రెడ్డి, జిల్లేల సిద్దారెడ్డి, డాక్టర్ రాజమౌళి, మోటె శ్రీనివాస్, ఆలేటి సిద్దిరాములు తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ : గద్దర్ మృతిపై సీపీఎం, సీపీఐ, ఏఐఎస్ఎఫ్, సోమవారం నియోజక వర్గ కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తెలంగాణ పీడిత ప్రజల హక్కులు, సమస్యల పరిష్కారానికి తన గళంతో ఆడి పాడే ప్రజా యుద్ధనౌక గద్దర్ గొంతుక మూగపోవటం తీరని లోటని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఎండీ రహ్మతుల్లాహ్, చింత జగదీష్, ఎండీ యూనస్, సీపీఎం నాయకులు కొడేపాక యాకయ్య, మహేందర్, సీపీఐ మండల కార్యదర్శి తోట రమేష్, పస్తం పృథ్వీ, రాంబాబు, సముద్రాల రాజు, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

పాట బతికున్నంత కాలం విప్లవ ధివిటీ గద్దర్ బతికే ఉంటారని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే డా. తాటికొండ రాజయ్య అన్నారు. ప్రజా గాయకుడు, ప్రజా యుద్ధనౌక, వాగ్గేయ కారుడు గద్దర్ పార్థీవ దేహాన్ని సోమవారం దర్శించి, పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. తన ఆట పాటలతో ప్రజల్లో చెరిగిపోని ముద్ర వేసిన గద్దరన్న లోటు తీర్చలేనిదని అన్నారు. తన తల్లి తాటికొండ లక్ష్మమ్మ మరణించిన సందర్భంలో తన వద్దకు వచ్చి తమ కుటుంబ సభ్యులకు ఓదార్పునిచ్చినట్లు ఎమ్మెల్యే గుర్తు చేసుకున్నారు.

చిన్నగూడూరు : మండల కేంద్రంలోని దాశరథి సెంటర్లో సోమవారం ప్రజా గాయకుడు గద్దర్ మృతి పట్ల వివిధ పార్టీల నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గద్దర్ మృతి తెలంగాణ రాష్ట్రానికి తీరని లోటన్నారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ(ఎం) జిల్లా కార్యవర్గ సభ్యులు గునిగంటి మోహన్, వీరయ్య, లింగయ్య, కాంగ్రెస్ నాయకులు నాగేష్, సుధాకర్, వెంకన్న, ఉప్పలయ్య మోహన్, బీఆర్ఎస్ నాయకులు గంగన్న ఉన్నారు.







ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

నవతెలంగాణ-పాలకుర్తి

ముర్రుపాలే బిడ్డ ఆరోగ్యానికి దోహదపడుతుందని సర్పంచ్ జలగం నాగభూషణం అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం అంగన్వాడి ఆధ్వర్యంలో మండలంలోని బమ్మెరలో వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ మల్లీశ్వరితో కలిసి సర్పంచ్ నాగభూషణం మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు, చిన్నారులకు అంగన్వాడి కేంద్రాలలోనే పౌష్టికరమైన ఆహారం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శివరాత్రి సుధాకర్, పంచాయతీ కార్యదర్శి రాజు, అంగన్వాడి టీచర్లుపి.బిక్షంయు.తార బి.నాగమణి. ఆశావర్కర్లు ప్రమీల, యాదమ్మ, ఏలేంద్ర, పాల్గొన్నారు.

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం : జెడ్పీటీసీ సంగీత

నవతెలంగాణ-నరసింహులపేట

మండలం కేంద్రంతోపాటు మండలంలోని పడమటి గూడెం గ్రామంలో సోమవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అవగాహన కల్పించి విజయవంతం చేయాలని జెడ్పిటిసి సంగీత, సర్పంచ్ వేముల రజిత రామ్ రెడ్డి, జొన్న గడ్డ యాదలక్ష్మి అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిపాలు అమృతమని, బిడ్డకు ముర్రుపాలు పట్టించడంతో వ్యాధి నిరోధకశక్తి పెరగడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్లు, శ్రీదేవి, విజయ, అంగన్వాడి టీచర్స్ లలిత, సుహాసిని, శ్రావణి, సరోజన, విమల, వెలుగు సిఏలు, గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు.

పుట్టిన గంటలోపే తల్లిపాలు తాగించాలి : ఎంపీపీ

నవతెలంగాణ-బచ్చన్నపేట

బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు తాగించాలని ఎంపీపీ భావండ్ల నాగజ్యోతి కృష్ణంరాజు అన్నారు. సోమవారం మండలంలోని ప్రభుత్వ హాస్పిటల్లో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గర్భిణీలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏసిడి పిఓతః విక్టోరియా,హెల్త్ సూపర్వైజర్ అనురాధ,అనాంబిక, సూపర్వైజర్ మనోహర,ఆశాలు, ఏడబ్ల్యు టిఎస్ విజయలక్ష్మి, రజిని, కవిత, బాలమణి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

గర్భిణీలు పౌష్టికాహారం తీసుకోవాలి : రావుల శోభ

నవతెలంగాణ-తొర్రూరు

గర్భిణీ మహిళలు పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని అంగన్వాడి సూపర్వైజర్ రావుల శోభ అన్నారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని 1వ వార్డులో ఉన్న అంగన్వాడి సెంటర్‌లో ప్రపంచ తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా గర్భిణీలకు శ్రీమంతాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడి సెంటర్లలో ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మానస, అంగన్వాడి టీచర్లు టి.ప్రమీల, డి.వెంకటలక్ష్మి, ఆశా వర్కర్ సుభద్ర, గర్భిణీలు పాల్గొన్నారు.



జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి







నవతెలంగాణ-నరసింహులపేట(కురివి)

గ్రామపంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె 33 రోజులకు చేరుకుంది. సోమవారం మండల కేంద్రంలో రాస్తారోకో కార్యక్రమం చేపట్టగా సిఐటియు మండల కన్వీనర్ పోతుగంటి మల్లయ్య, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి నవీన్ పాల్గొన్నారు. ఈ రాస్తారోకోను ఉద్దేశించి నాయకులు మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులు సమ్మె చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందని, మా డిమాండ్లు న్యాయబద్ధంగానే ఉన్నాయని, ప్రభుత్వం డిమాండ్లను నెరవేర్చేదాక రోజుకు ఒక్క విధంగా వినూత్న కార్యక్రమాలు చేపతామని హెచ్చరించారు. ఈ రాస్తారోకోలో గ్రామపంచాయతీ కార్మి కుల అధ్యక్షులు మంజుర ఆలీ, టి.రామచంద్రయ్య, లచ్చయ్య, ఉపేంద్ర చారి, సోషల్ మీడియా కన్వీనర్ జీ. రమేష్, సోందు సుగుణ, మరియా, కృష్ణ పాల్గొన్నారు.

బచ్చన్నపేట : తమ న్యాయమైన కోరికలు ప్రభుత్వం తీర్చే వరకు సమ్మె కొనసాగుతుందని గ్రామ పంచాయతీ ఉద్యోగులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు శ్రీనివాస్ మాట్లాడుతూ మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని పంచాయతీ సిబ్బంది అందరినీ పర్మినెంట్ చేయాలని కనీస వేతనాలు అమలు చేయాలని కారోబార్ బిల్ కలెక్టర్లను సహాయ పంచాయతీ కార్యదర్శులుగా నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకుడు శ్రీనివాస్, కారోబార్లు ప్రభాకర్, రాజు, నాగయ్య, బాబు గౌడ్, శ్రీనివాస్, చంద్రశేఖర్,నరసయ్య లలిత,అంజి, లచ్చమ్మ,అశోక్, దయాకర్, కృష్ణయ్య, దేవయ్య, కర్ణాకర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవరుప్పుల : మండల కేంద్రంలో గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులు మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో రాస్తారోకో నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సింగారపు రమేష్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఈరోజు జేఏసీ పేరుతోచర్చలకు పిలవడం జరిగిందని,ఆ చర్చలు గనుక ఫలించక పోతే రేపు రాబోయే రోజు నుంచి సమ్మెను బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎడవెల్లి వెంకట్ రెడ్డి, గనాగని ఉప్పలయ్య, జోగు కలమ్మ, జోగు ఎల్లయ్య, పైండ్ల వెంకటరమణ, చింత రామచంద్రు, పోరండ్ల వెంకన్న,చింత సోమయ్య, చింత అశోక్,చిలకని రాములు,గుగులోతూ రవి,ఉతెప్పు ఐలయ్య,పడమతింటి రామచంద్రు, దండంపెల్లి యాదయ్య, పడమతింటి అంజయ్య, ఏడెల్లి సోమయ్య, బెజగం సంజీవ, పిచ్చమ్మ, రాధిక, ఐలమ్మ, దావుల శ్రీనివాస్, మేడ ఎల్లయ్య, మేడ దయాకర్, బట్ట పరశు రాములు, ఇస్తారి, చింత ఉప్పలయ్య పాల్గొన్నారు.

గార్ల : గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని సిఐటియు మండల కన్వీనర్ కందునూరి శ్రీనివాస్, జిపి కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండ్ల అప్పిరెడ్డిలు డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా సోమవారం స్థానిక నెహ్రూ సెంటర్‌లో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(సిఐటియు) జిపి కార్మికులు మోకాళ్ళపై నిలుచొని రాస్తారోకో నిర్వహించి పలు సెంటర్‌లలో భిక్షాటన చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు దస్తగిరి, పి.దాస్, పి.రమేష్, భద్రు, జి.కిషన్, అశోక్, వీరాస్వామి,ఎం.శ్రీను, ప్రభాకర్, జితేందర్, సైదులు తదితరులు ఉన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సులు

తాసిల్దార్ నాగేంద్రప్రసాద్

నవతెలంగాణ-తొర్రూరు

100-పాలకుర్తి నియోజకవర్గం పరిధిలోని తొర్రూరు మండలం లో గల ఓటరు లకు ఓటు హక్కు వినియోగం పై, వివి ప్యాట్ అవగాహన కార్యక్రమాలు మండల పరిధిలోని గ్రామాలలో నిర్వహించబడుతుందని తాసిల్దార్ నాగేంద్ర ప్రసాద్ సోమవారం తెలిపారు. ఈనెల 8న కర్కాల పిఎస్, నాంచారి మడూరు యుపిఎస్, 9న హై స్కూల్ వెలికట్టే, 10న తొర్రూరు డిఎన్టిపిఎస్ దుబ్బ తండా, యుపిఎస్ ఫతేపురం, 11న మాటేడు హైస్కూల్, ఎంపీపీ పిఎస్ పోలేపల్లి, 14న ప్రభుత్వ జూనియర్ కళాశాల తొర్రూరు, 16న బాలికల పాఠశాల తొర్రూరు, 17న కంటాయపాలెం హై స్కూల్, 18న మడిపల్లి పిఎస్, 19న సోమరం కుంట తండా డిఎన్టిపిఎస్, మడిపల్లి, ఎంపీపీ ఎస్ఎస్సీ కాలనీ తొర్రూరు, 21న హైస్కూల్ తొరూరు, 22న పిఎస్ వెంకటాపురం, టిడబ్ల్యూపిఎస్ అమర్ సింగ్ తండా, హరిపిరాల హై స్కూల్, 23న చింతలపల్లి పిఎస్, హచ్‌తండా, కొమనపల్లి తండా, 24న యుపిఎస్ అమ్మాపురం, 25న పిఎస్ కానాపురం, గుర్తురు హై స్కూల్, 26న పిఎస్ జనస్తానపురం, యుపిఎస్ సోమవారం, పిఎస్ గోపాలగిరి, 28న చర్లపాలెం హై స్కూల్, చికటయపాలెం ప్రాథమిక పాఠశాలలో అవగాహన సదస్సులు నిర్వహించబడతాయని ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విజయవంతం చేయాలని తాసిల్దార్ నాగేంద్రప్రసాద్ కోరారు.



ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ

నవతెలంగాణ-నెల్లికుదురు

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నెల్లికుదురు వృక్షశాస్త్ర అధ్యాపకుడు మర్సకట్ల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ ముక్కెర ప్రకాష్ బాబు చేతుల మీదగా ఉచిత వృక్షశాస్త్ర స్టడీ మెటీరియల్ పంపిణీ చేయడం జరిగింది. అనంతరం కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అనిల్ కుమార్ స్టడీ మెటీరియల్ ను రూపొందించి, సుమారు 5000 రూపాయల స్టడీ మెటీరియల్ ను ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ నాణ్యమైన స్టడీ మెటీరియల్ ను వినియోగించుకొని, అత్యంత ప్రతిభ కనబర్చాలని కోరారు. ప్రతి సంవత్సరం అనిల్ కుమార్ ఉచితంగా స్టడీ మెటీరియల్ ను అందజేస్తూ గ్రామీణ పేద విద్యార్థులను ప్రోత్సహిస్తూ, వారి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. స్టడీ మెటీరియల్‌ను సులభ పద్ధతిలో రూపొందించి, విద్యార్థులకు ఉచితంగా అందించిన అనిల్ కుమార్‌ను ఇంచార్జ్ ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కవిరాజు, కూన సతీష్, యాకన్న కందికొండ బాబు, మహేందర్, నాగేశ్వరరావు, సుధాకర్, శ్రీనివాస్ మరియు అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

ఉరి వేసుకుని రైతు ఆత్మహత్య

నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్

చిల్పూర్ మండలంలోని క్రిష్టాజిగూడెం గ్రామానికి చెందిన ముడిక వెంకటయ్య(55) అనే రైతు చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం జరిగింది. రోజువారీగా వ్యవసాయ పనుల కోసం బావి వద్దకు వెళ్లిన వెంకటయ్య తన వ్యవసాయ క్షేత్రంలోని ఓ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య కళావతి, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. తనకున్న మూడు ఎకరాలతో పాటు కొంత కౌలు కూడా చేస్తున్న అతని మృతికి ఆర్థిక ఇబ్బందులా, కుటుంబ కలహాలు కారణమా తెలియాల్సి ఉంది.

పాలకుర్తిలో ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

నవతెలంగాణ-పాలకుర్తి

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సోమవారం జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని గుడివాడ చౌరస్తా నుండి రాజీవ్ చౌరస్తా వరకు పద్మశాలి చేనేత కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు మాచర్ల సారయ్య మాట్లాడుతూ పద్మశాలీ కులస్తులకు రాష్ట్ర ప్రభుత్వం పద్మశాలి బంధు ప్రకటించి, ప్రతి కుటుంబానికి 10 లక్షలు అందించి డిమాండ్ చేశారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత దినోత్సవంను అధికారంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ నెల13న కోరుట్లలో జరిగే పద్మశాలి సభ కు పద్మశాలిలు పెద్దఎత్తున తరలి వెళ్లి విజయవంతం చేయాలని కోరారు. పాలకుర్తి మండల కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న పద్మశాలి కళ్యాణమండపం భవనంకు నిధులు మంజూరు చేసేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు బిర్రు సోమేశ్వర్, భారత శ్రీనివాస్, దేవసాని కపాకర్, చిలకమారి సోమేశ్వర్, పోగు వాసుదేవ్, చిరంజీవి, శ్రీరాం వెంకన్న పాల్గొన్నారు.



పుట్టిన బిడ్డకు తల్లిపాలే శ్రేష్టం

నవతెలంగాణ-మల్హర్‌రావు

తల్లి పాలే నవజాత శిశువుకు అనేక వ్యాధుల నుంచి రక్షిస్తాయని, శిశువు ఎదిగేందుకు దోహదం చేస్తాయని, అమ్మపాలే అమతమని అంగన్‌వాడిల మండల సూపర్‌వైజర్ సరస్వతి అన్నారు. తల్లి పాలు వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని తాడిచెర్ల, పెద్ద తూండ్ల గ్రామాల్లోని అంగన్‌వాడి కేంద్రాల ఆధ్వర్యంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా సూపర్‌వైజర్ హాజరై మాట్లాడారు. ముర్రు పాల ప్రాధాన్యత, అంగన్‌వాడీల్లో లభ్యమయ్యే పోషకాహారాలు, బాలామృతంపై వివరించారు. కిషోర బాలికలకు కిషోరామృతం అందించారు.14 నుంచి 18 సంవత్సరాల పిల్లలకు ఒక్కొక్కరికి 3 కిలోలన్నర కిశోరామృతం అందిస్తారని, దీనిద్వారా రక్తహీనత తగ్గి, ముందు ముందు ఆరోగ్యమైన పిల్లలకు జన్మనివ్వడానికి తోడ్పడుతుందన్నారు. ఇందుకు రోజుకు 140 గ్రాముల కిషోరామృతం తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో



సర్పంచ్‌లు సుంకరి సత్తయ్య, విజయ, అంగన్‌వాడి టీచర్లు జయప్రద, అరుణ, వెంకటమ్మా వెంకటనారమ్మ, అన్నపూర్ణ, మనెమ్మ, వెంకట నరసమ్మ, లక్ష్మీ, ఏఎన్‌ఎంలు, ఆశాలు, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజానికి కిషోరామృతం

మహదేవపూర్ : మండలంలోని అన్నారం గ్రామంలో సీడీపీవో రాధిక ఆదేశాల మేరకు కిషోరామృతం పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా సర్పంచ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు. తల్లిపాల వారోత్సవాల గురించి అవగాహన కల్పించి అనంతరం కిషోర్ బాలికలకు కిషోర్ అమృతం పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ కార్యక్రమం మూడు జిల్లాల్లో ప్రారంభించారని ఇందులో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రారంభమైన సందర్భంగా ప్రాజెక్టు పరిధిలో పంపిణీ కార్యక్రమం నిర్వహించామన్నారు. జిల్లాలో ఎంపిక చేసిన 14 నుండి 18 సంవత్సరాలు గల 2780 మంది కిషోర్ బాలికలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తారన్నారు. కిషోరామృతం ద్వారా బల వర్ధకమైన పోషక పదార్థాలతోపాటు అదనపు శక్తి లభిస్తుందన్నారు. దీంతో ఆరోగ్యవంతమైన ఎదుగుదల ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వేమనూరు రమాదేవి చంద్రశేఖర్, ఎంపీటీసీ మంచినీళ్ల దుర్గయ్య, అంగన్‌వాడీ టీచర్లు, స్వరూప శ్రీలత, సుశీలతోపాటు కిషోర బాలికలు, తల్లులు పాల్గొన్నారు.

మిత్రుని అంత్యక్రియల్లో పాల్గొన్న చల్ల

నవతెలంగాణ-కాటారం

కాటారం మండల కేంద్రానికి చెందిన గుండె శ్రీశైలం సోమవారం ఉదయం గుండె పోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, కాటారం పీఎసీఎస్ చైర్మన్ చల్ల నారాయణరెడ్డి మతుడి శ్రీశైలం భౌతిక కాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. శ్రీశైలం కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని తెలిపారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొన్నారు.

బాధిత కుటుంబలకు పరామర్శ

నవతెలంగాణ-మహాదేవపూర్

మహాదేవ్ పూర్, అంబట్‌పల్లి, సూరారం గ్రామాలలో ఇటీవల అనారోగ్యం తో మరియు ప్రమాదలలో మరణించిన వారి కుటుంబ సభ్యులను సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే అనారోగ్యం తో బాధపడుతున్న పలువురిని పరామర్శించి ఆర్ధిక సహాయం అందించారు. అసెంబ్లీ కన్వీనర్ మల్కామోహన్ రావ్, మండల అధ్యక్షులు సిరిపురం శ్రీమన్నారాయణ, మండల ఇన్‌చార్జి ఉడుముల విజయ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు సూరం మహేష్, బొల్లెన కిషన్, మంథని రాజేందర్, బీజేవైఎం మండల అధ్యక్షులు రాంశెట్టి మనోజ్, మహిళ మోర్చా మండల అధ్యక్షురాలు తొర్రెమ్ జ్యోతి,సీనియర్ నాయకులు గుజ్జుల శంకర్, ఎం ఆర్ యాదవ్, సల్ల జనార్దన్, యువ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ పోరాటంతోనే ఎస్సీ ఉద్యోగుల భవిష్యత్

మాదిగ ఉద్యోగుల పెడరెషన్

ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంద రాజు

నవతెలంగాణ-ములుగు

ఎమ్మార్పీఎస్ పోరాటంతోనే మాదిగ ఉద్యోగుల భవిష్యత్ అని మాదిగ ఉద్యోగుల ఫెడరెషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంద రాజు మాదిగ అన్నారు. జిల్లా కేంద్రంలో గ్రామపంచాయతీ ప్రభుత్వ గెస్ట్ హౌస్‌లో మాదిగ ఉద్యోగుల పేడరేషన్ ఎంఈఎఫ్ జిల్లా సమన్వయకర్త నెమలి నర్సయ్య మాదిగ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశాపిరి ముఖ్య అతిథిగా మంద రాజు హాజరైయ మాట్లాడుతూ షెడ్యూల్ కులాలలో వర్గీక రణతోనే 59 కులాలకు అన్ని రంగాలలో సమ, సమ సామాజిక న్యాయం అమలవు తుందని, మాదిగ ఉద్యోగుల ఉజ్వల భవిష్యత్తు సంక్షేమ భవిష్యత్తు, విద్యా భవిష్యత్తు, ఉద్యోగ భవిష్యత్తు, ఎమ్మార్పీఎస్ పోరాటంతోనే సాధ్యమని, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు ప్రమోషన్ రిజర్వేషన్ సాధించిన చరిత్ర, ఎస్సీ ఎస్టీ అట్రా సిటీ చట్టాన్ని కాపాడిన ఘనత మందకృష్ణకే దక్కిందని అన్నారు. మందకృష్ణ ఉద్యమ పోరాటంలో పాలపంచుకోవాలని పిలుపునిచ్చారు. ఆగస్టు చివరి వారంలో హైదరాబాదులో నవ్వు తూ నా భుతో నా భవిష్యత్తు పేరుతో ఈ నెల చివరి వారంలో ప్రపంచంలో కనివినీ ఎరుగని రీతిలో మాదిగల విశ్వరూప మహాసభ 30 లక్షల మందితో జరగబోతుందని అన్నారు. ఈసమావేశంలో మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ మాదిగ, రెవెన్యూ విభాగం ములుగు జిల్లా రెవెన్యూ పిఆర్ డిపార్టుమెంట్ జిల్లా ఇన్‌చిర్జి సూరయ్య పాల్గొన్నారు.

మహదేవ్‌పూర్ : మహాదేవపూర్ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు బెల్లంపల్లి సురేష్ ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ వారోత్సవాలు జరుపుకున్నారు. బెల్లంపల్లి సురేష్ పాల్గొని మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ అలుపెరుగని పోరాటం ఫలితమే ఆరోగ్యశ్రీ అన్నారు. ఆరోగ్యశ్రీ లోగో పై మందకష్ణ ఫోటో పెట్టాలని డిమాండ్ చేశారు. సీనియర్ నాయకులు నల్లబూగ ధర్మయ్య, మోతే సాంబయ్య, ఆయిల్ల సమ్మయ్య. ఎమ్మార్పీఎస్ మండల అదికార ప్రతినిధి మంథని రవితేజ, ప్రధాన కార్యదర్శి కొయ్యల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చేకుర్తి శంకరయ్య. ఎమ్మార్పీఎస్ యువ నాయకులు కొలుగురీ శ్రీకాంత్ పాల్గొన్నారు.

భారత జాగృతి జిల్లా పీఆర్‌వోగా గాజుల అరుణ్

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్



భారత జాగృతి జయశంకర్ భూపాలపల్లి జిల్లా పీఆర్‌వోగా భూపాలపల్లి పట్టణానికి చెందిన గాజుల అరుణ్ నియమాకమ య్యారు. సోమవారం భారత జాగృతి జిల్లా అధ్యక్షుడు మాడ హరీష్ రెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా హరీష్ రెడ్డి మాట్లాడుతూ భూపాలపల్లి పట్టణానికి చెందిన గాజుల అరుణ్ గత కొన్ని సంవత్సరాల నుండి జాగతి బలోపేతానికి కషి చేసినందుకు గాను అరుణ్ సేవలను గుర్తించి భారత జాగతి జిల్లా పీఆర్‌వోగా నియమించినట్లు తెలిపారు. అనంతరం అరుణ్ మాట్లాడుతూ నా పై నమ్మకం తో అప్పగించిన ఈ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని, సమస్త బలోపేతానికి కషి చేస్తానని తెలిపారు. నియామకానికి సహకరించిన భారత జాగృతి వ్యవస్థపాక అధ్యక్షులు, నిజామాబాదు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితక్క , ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారీ, ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్ భాస్కర్, రాజీవ్ సాగర్, కొరబోయిన విజయ్, ముఠా భిక్షపతి, రాష్ట్ర అధ్యక్షులు పసుల చరణ్, జిల్లా అధ్యక్షులు మాడ హరీష్‌రెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు.

దళితులకు భూమి, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

చంద్రుపట్ల సునీల్ రెడ్డి

నవతెలంగాణ-మహదేవ్‌పూర్

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్ పూర్ మండలం సూరారం గ్రామంలో (కుమ్మరి కుంట)లో ఏళ్ళ తరబడి సాగు చేసుకుంటున్న భూమిని ప్రభుత్వ అధికారులు దౌర్జన్యంగా పంటని వేయకుండా అడ్డుకుంటున్నారని గ్రామస్తులు సునీల్ రెడ్డి దష్టికి తీసుకువెళ్లగా సోమవారం ప్రదేశాన్ని సందర్శించి రైతుల సమస్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేసీఆర్ దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తామని, పోడు భూములకు పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు ఉన్న భూమిని లాక్కూనే ప్రయత్నం చేస్తున్నా ఇక్కడ ఉన్న ఎమ్మెల్యే శ్రీధర్ బాబు, ఇద్దరు జడ్పీచైర్మన్ లు ఎందుకు స్పందించడం లేదన్నారు. ప్రభుత్వం వీరికి అంతిమ పట్టా ఇచ్చి ఒకరికి 18 గుంటలు ఇచ్చింది, డీఎఫ్ఓతో మాట్లాడాను ఎవరైతే ఏళ్ళ తరబడి సాగు లో ఉన్న కాస్తులో ఉన్న వారి ల్యాండ్ ని తీసుకోమని చెప్పారు మరి ఇక్కడ ఉన్న అధికారులు ఎవరి అండ దండలతో వీరిని సాగు చేసుకోకుండా పోలీస్ వారితో ఇబ్బందులకు గురి చేస్తున్నారు, ఇప్పటికైనా ప్రభుత్వం పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, లేని పక్షం లో బీజేపీ పార్టీ తరపున బాధితుల పక్షాన పోరాడుతామన్నారు. బీజేపీ పార్టీ అధికారంలోకి రాగానే పోడుభూములకు పట్టాలు ఇస్తామన్నారు. ఈకార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ మల్కా మోహన్‌రావు, మండల అధ్యక్షులు సిరిపురం శ్రీమన్నా రాయణ, మండల ఇన్‌చార్జి ఉడుముల విజయ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు సూరం మహేష్, బొల్లెన కిషన్, మంథని రాజేందర్, సీనియర్ నాయకులు గుజ్జుల శంకర్, ఎంఆర్ యాదవ్, సల్ల జనార్దన్, యువ నాయకులు జోగేష్, పోటు శ్రవణ్‌రెడ్డి, రెవెల్లి రాకేష్, తునురి శ్రీనివాస్, మండల సోషల్ మీడియా ఇన్‌చార్జి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

గద్దర్‌కు ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు నివాళి

నవతెలంగాణ-మల్హర్ రావు

ప్రజాయుద్ధ నౌక గద్దర్ అంతిమయాత్రలో సోమవారం కాంగ్రెస్ పార్టీ జాతీయ కార్యదర్శి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరై ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు తాడిత, పీడిత ప్రజల కోసం తన గళాన్ని వినిపించిన ప్రజా గాయకుడు గద్దర్ అన్నారు. స్వరాష్ట్ర సాధన కోసం గోసి, గొంగడి వేసి ప్రజల్ని చైతన్య వంతులను చేస్తూ ఉద్యమంలో తనవంతు పాత్ర పోషించారని కొనియాడారు. గద్దర్ అకాల మరణం తెలంగాణ ప్రజలకు తీరని లోటన్నారు. గద్దర్ ఆకస్మిక మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. గద్దర్ కుటుంబానికి యావత్ తెలంగాణ ప్రజలు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు.

సీఎం కేసీఆర్‌ను కలిసిన జెడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి

నవతెలంగాణ-ములుగు

ములుగు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బడే నాగజ్యోతి తెలంగాణ భవన్ లో ముఖ్యమంత్రి కేసీఆర్ కు సోమవారం పుష్పగుచ్ఛం అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు సమస్యలపై, జిల్లాలో ప్రస్తుతం నెలకొన్న వరద బాధిత ప్రాంతాల గురించి వినతి పత్రం రూపంలో వారికి విన్నవించారు. ముఖ్యమంత్రి కెసిఆర్ సానుకూలంగా స్పందిస్తూ ఆదివాసీ జిల్లా అయిన ములుగు జిల్లాపై తనకు ఉన్న ప్రేమను తెలియజేస్తూ ములుగు జిల్లాపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని హామీ ఇచ్చారు. తాను ముఖ్యమంత్రి కేసీఆర్‌తో ప్రత్యేక సమావేశం కావడానికి సహకరించిన ములుగు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యవతి రాథోడ్, తెలంగాణ పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డికు ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ధృవీకరణ పత్రాలు సమర్పించాలి

నవతెలంగాణ-మహదేవపూర్

గహలక్ష్మి పథకం కింద లబ్ధి పొందాలనుకునేవారు తహసీల్దార్ కార్యాలయంలో ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్‌లు, అప్లికేషన్ ఫామ్ నింపి ఆఫీస్ లోని సీనియర్ అసిస్టెంట్ కి ఆగస్టు 10 లోగా ఇవ్వగలరు. మీసెల్ నెంబర్ కూడా ఇవ్వగలరు. : ఎంక్వయిరీ నిమిత్తం మీకు సమాచారం ఇచ్చి మీ వద్దకు వచ్చినప్పుడు కులం, ఆదాయం, బ్యాంకు ఎకౌంటు కు సంబంధించిన పత్రాలు, మీరు ఇల్లు కట్టుకోవడానికి ఉన్న స్థలము (ఉంటే సంబంధించిన డాక్యుమెంట్లు) చూపించవలసి ఉంటుందనే ఇన్‌ఛార్జ్ తహసీల్దార్ కష్ణ, జెడ్పిటిసి గుడాల అరుణ శ్రీనివాస్‌లు సోమవారం ఒక ప్రకటన తెలిపారు.

అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌ను కలిసిన రైస్ మిల్లర్స్ అసోసియేషన్

నవతెలంగాణ-ములుగు

ములుగు జిల్లా నూతన అడిషనల్ కలెక్టర్ గా భాద్యతలు స్వీకరించిన డి.వేణుగోపాల్‌ను సోమ వారం జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో ములుగు జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసి యేషన్ గౌరవ అధ్యక్షులు బాదం ప్రవీణ్, జిల్లా అధ్యక్షులు కాట్రగడ్డ సతీష్, కార్యదర్శి వాసుదేవరెడ్డి, కోశాధికారి విజేందర్, డిఎస్ఓ అరవిందరెడ్డి, డిఎం రాములు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు రేపాల సత్యం, నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టాఫీసుల్లో జాతీయ జెండాలు విక్రయించాలి

నవతెలంగాణ-మహదేవ్‌పూర్

హర్ ఘర్ తిరంగా 2.0లో భాగంగా తపాలా శాఖ ఆధ్వర్యంలో ప్రతి పోస్టాఫీస్‌లో జాతీయ జెండాలను విక్రయించనున్నట్లు మంథని సబ్ డివిజన్ పోస్టల్ ఇన్స్పెక్టర్ సయ్యద్ అజహరుద్దీన్ సోమవారం మహాదేవపూర్‌లో ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ జెండా కావాల్సిన వారు పోస్టాఫీసుకు వెళ్లి రూ.25 చెల్లించి జాతీయ జెండాను కోనుగోలు చేయవచ్చన్నారు. పోస్ట్ ఆఫీస్ కి వెళ్ళలేని వారు ఆన్‌లైన్‌లో షషష.వజూశీర్‌శీటటఱషవ.స్త్రశీజ.ఱఅ ద్వారా బుకింగ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకున్న వారు పోస్ట్ ఆఫీస్ ద్వారా ఇంటి వద్దనే జెండాను పొందవచ్చని పేర్కొన్నారు.

ఎస్సైగా ఎంపికైన గీతకు ఘన సన్మానం

నవతెలంగాణ-మల్హర్‌రావు

సివిల్ ఎస్సై ఫలితాల్లో మండలంలోని ఆన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన బానోత్ గీత ఆదివారం వెలువడిన ఫలితాల్లో ఎస్సైగా ఎంపికైంది. ఈసందర్భంగా గ్రామ సర్పంచ్ గుగులోత్ జగన్‌నాయక్ తోపాటు పలువురు సోమవారం ఘనంగా సన్మానించి అభినందించారు. ఈకార్యక్రమంలో వార్డు సభ్యులు గ్రామ యువకులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సన్మానం

నవతెలంగాణ-మహదేవ్‌పూర్

8వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా మంథని పట్టణంలో పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి పెద్దపల్లి జిల్లా జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ సోమవారం మహదేవ్‌పూర్ మండల కేంద్రానికి చెందిన బెనికి మల్లయ్య, బాడీష బాపు, గంజి మల్లయ్య పంతగాని రాజును సన్మానించారు.



గద్దర్ మృతి పేదలకు తీరని లోటు

నవతెలంగాణ-భూపాలపల్లిటౌన్

ప్రజా యుద్ధనౌక గద్దర్ మరణం పేదలకు తీరని లోటని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి గుర్రం దేవేందర్ అన్నారు. సోమవారం గద్దర్ మృతి పట్ల ఘన నివాళులర్పించారు. అనంతరం గద్దర్ కుటుంబానికి సానుభూతి ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య దశ నుండి తుది శ్వాస వరకు కష్టజీవుల పక్షాన గొంతెత్తి ఆలపించిన ప్రముఖ ప్రజా గాయకుడు, రచయిత, కవి గద్దర్ మృతి సామాజిక ప్రజా ఉద్యమాలకు తీరని లోటన్నారు. కోట్లాది మంది ప్రజలు తన గానంతో చైతన్య పరిచిన గొప్ప నాయకుడని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువ మంది ప్రజలను ప్రభావితం చేసిన గొప్ప నాయకుడని చెప్పారు. తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి పడటంలో కీలక భూమిక పోషించారని అన్నారు. నాటితరం నుండి నేటితరం వరకు గద్దర్ మించిన గాయకుడు లేరని కొనియాడారు. ప్రస్తుతం తెలంగాణ గాయకులందరికీ గద్దర్ స్ఫూర్తి అన్నారు. నాడు టీ మాస్ ఉద్యమంలో ఆయన సుమారు 100 సభల్లో పాల్గొన్నారని తెలిపారు. మహాజన పాదయాత్ర ముగింపు బహిరంగ సభలో, కేవీపీఎస్ నిర్వహించిన ఆత్మగౌరవ యాత్రలో, పూలే అంబేద్కర్ జాతరల్లో ఆయనతో కలిసి పని చేశామని గుర్తు చేశారు. గద్దర్ మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటన్నారు. కులవివక్ష, అంటరానితనం అంతం చేయడంతోపాటు, కులనిర్మూలన కోసం కృషి చేయడమే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి అన్నారు.



వాగు దాటడం ప్రమాదకరం

నవతెలంగాణ-టేకుమట్ల

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు టేకుమట్ల, రాఘవరెడ్డిపేట బ్రిడ్జి కూలిపోయిన విషయం తెలిసిందే. కాగా స్థానిక ఎస్సై గట్ల సుధాకర్ సోమవారం వాగు వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బ్రిడ్జి కూలిపోవడం ద్వారా వాగు అవతలి గ్రామాలకు వెళ్ళు వారు సాహసించి వాగు దాటకూడదని. వరదల కారణంగా వాగులో చాలా పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయని, మొసళ్ళు వచ్చాయని, చేపలు పట్టడానికి వెళ్లే వారు, ప్రజలు ఎవరు బ్రిడ్జి వద్దకు రాకూడదని మండల ప్రజలకు తెలియజేశారు.



హోంగార్డు ఆఫీసర్ నయీంకు ఘన సన్మానం

నవతెలంగాణ-మహదేవ్‌పూర్

మహదేవ్‌పూర్ పోలిస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న హోంగార్డ్ నయీమ్ రిటైర్ అయిన సందర్భంగా సోమవారం పోలిస్‌స్టేషన్‌లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ కిరణ్ మాట్లాడుతూ 36 సంవత్సరాలుగా కరీంనగర్, మంథని, కాటారం, మహాదేవపూర్‌లలో తన సేవలు అందించి రిటైర్ అయిన సందర్భంగా మహాదేవపూర్ సీఐ టి.కిరణ్, మహాదేవపూర్ సర్కిల్ ఎస్సైలు రాజ్‌కుమార్, లక్ష్మణరావు, తమాషారెడ్డి, చల్ల రాజుభవానిసెన్, కానిస్టేబుళ్ల, హోంగార్డులు పాల్గొని ఆయనను సత్కరించి బహుమతులు అందజేశారు.



ఐదేండ్ల లోపు పిల్లలకు టీకాలు

నవతెలంగాణ-మహదేవ్‌పూర్

మహదేవ్‌పూర్ మండలంలోని అంబటిపెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి సూరారం గ్రామంలో సోమవారం మిషన్ ఇంద్రధనుష్ 5.0 కార్యక్రమంలో భాగంగా ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు టీకా వేయించే కార్యక్రమం చేపట్టారు. ఈకార్యక్రమంలో డాక్టర్ రాజేష్‌ఖన్నా, మనోహర్‌రెడ్డి, సూపర్‌వైజర్ మసుక్ అలీ, శైలజ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



జీపీఉద్యోగుల సమ్మెకు బీజేపీ మద్దతు

నవతెలంగాణ-మహదేవ్‌పూర్

మహాదేవ్‌పూర్ మండల కేంద్రంలో గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని గత కొద్ది రోజుల నుండి చేస్తున్న దీక్షా శిబిరాన్ని సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చందుపట్ల సునీల్ రెడ్డి సందర్శించి వారికి సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణలో కాంట్రాక్ట్ వ్యవస్థ ఉండదని బూటకపు హామీలిచ్చి చిన్నచిన్న ఉద్యోగులపై అధిక పని భారం మోపడమే కాకుండా కనీసం వారికి జీతాలు చెల్లించలేని పరిస్థితి నెలకొందని అన్నారు. గ్రామ పంచాయతీ కారోబార్లకు ఐదు నెలల పెండింగ్ జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జీవో 51ని సవరించాలని, ప్రమాదంలో మరణించిన వర్కర్‌కి రూ.10 లక్షలు చెల్లించాలని, మల్టీపర్పస్ వర్కర్స్ లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. పీఆర్సీ విధానాన్ని అమలుచేసి పర్మినెంట్ చేయాలని కోరారు. అర్హతలు ఉన్న కారోబార్లను సహాయ పంచాయతీ కార్యదర్శులుగా ప్రమోషన్లు ఇవ్వాలని, గ్రామపంచాయతీ ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్ లాంటివి కల్పించాలని కోరారు. లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అసెంబ్లీ కన్వీనర్ మల్కా మోహన్‌రావు, మండల అధ్యక్షులు సిరిపురం శ్రీమన్నారాయణ, మండల ఇన్‌ఛార్జ్ ఉడుముల విజయారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు సూరం మహేష్, బొల్లెన కిషన్, మంథని రాజేందర్, బీజేవైఎం మండల అధ్యక్షులు రాంశెట్టి మనోజ్, మహిళ మోర్చా మండల అధ్యక్షురాలు తొర్రెమ్ జ్యోతి, సీనియర్ నాయకులు గుజ్జుల శంకర్, ఎంఆర్ యాదవ్, సల్ల జనార్దన్, యువ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ప్రభుత్వ పథకాలు సత్వరమే అందించాలి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

నవతెలంగాణ-భూపాలపల్లి



అర్హులకు ప్రభుత్వ పథకాలు సత్వరమే అందేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులతో కలిసి తెలంగాణకు హరితహారం, గృహలక్ష్మి , ఇంటి పట్టాల పంపిణీ, జీఓ 59, నోటరి భూముల క్రమబద్దీకరణ, బీసీ, మైనారిటీ లకు లక్ష ఆర్థిక సహాయం, గొర్రెల పంపిణీ, దళిత బంధు వంటి పలు అంశాల పై జిల్లా కలెక్టర్ లతో వీడియో సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ తెలంగాణకు హరితహారం క్రింద ఉన్న లక్ష్యాలను సెప్టెంబర్ 15 నాటికి పూర్తి చేయాలని, దానికి అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌లకు సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఒక రోజు కోటి మొక్కలు నాటేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని, ప్రతి జిల్లాకు కేటాయించిన లక్ష్యం ప్రకారం మొక్కలు నాటేందుకు స్థలాలు గుర్తింపు, గుంతల తవ్వకం చేపట్టాలని అన్నారు. నీటి పారుదల శాఖ పరిధిలోని భూములలో ఏర్పాటు చేస్తున్న సంపద వనాలలో లక్ష్యం మేరకు మొక్కలు నాటే ప్రక్రియ 2 వారాల్లో పూర్తి చేయాలని సీఎస్ సూచించారు. జిల్లాలో హరితహారం క్రింద మొక్కలు నాటడంతో పాటు మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని, నాటిన ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేయాలని సీఎస్ తెలిపారు. గొర్రెల పంపిణీ పథకం క్రింద జిల్లాలకు ఇప్పటి వరకు నిర్దేశించిన లక్ష్యం త్వరితగతిన చేరుకోవాలని సీఎస్ సూచించారు. ఈ వారం నుంచి ప్రతి జిల్లాకు గొర్రెల యూనిట్ల పంపిణీ లక్ష్యం రెట్టింపు చేశామని, గొర్రెల యూనిట్ల కొనుగోలు వేగవంతం చేసి లబ్ధిదారులకు పంపిణీ చేయాలని సీఎస్ పేర్కొన్నారు. గొర్రెల యూనిట్ల కొనుగోలు బందంలో జిల్లా స్థాయి అధికారి తప్పనిసరిగా ఉండాలని అన్నారు. జిల్లాలో స్థానిక ప్రజా ప్రతినిధులచే గొర్రెల యూనిట్లను పంపిణీ చేయాలని, సదరు సమాచారం సామాజికమాధ్యమాల్లో ప్రచారం చేయాలని సిఎస్ తెలిపారు. బీసి కులవత్తుల లక్ష రూపాయల ఆర్థిక సహాయం క్రింద మొదటి దశలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 300 మంది లబ్దిదారులకు అందించడం జరుగుతుందని, దీనికి సంబంధించిన నిధులు జిల్లాలకు విడుదల చేశామని, ప్రతి అసెంబ్లీ పరిధిలో ఎంపిక చేసిన లబ్దిదారులకు స్థానిక ఎమ్మెల్యేలతో ఆగస్టు 10 లోపు చెక్కుల పంపిణీ పూర్తి చేయాలని సీఎస్ సూచించారు. మైనారిటీల సంక్షేమం క్రింద లక్ష రూపాయల ఆర్థిక సహాయం పథకంలో జనాభా ప్రాతిపదికన జిల్లాలకు లక్ష్యాలు నిర్దేశించామని అన్నారు. జిల్లాలకు నిర్దేశించిన లక్ష్యాల మేరకు లబ్దిదారులను ఎంపిక చేసి ప్రొసిడింగ్స్ జారీ చేయాలని, ప్రొసిడింగ్స్ జారీ చేసిన వెంటనే నిధులు మంజూరు అవుతాయని చెక్కుల పంపిణీ చేపట్టవచ్చని అన్నారు. గహలక్ష్మి పథకం క్రింద జిల్లాలో తహసిల్దార్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం, కలెక్టరేట్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి ఆగస్టు 10 వరకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని అన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి గహలక్ష్మి క్రింద 3 వేల ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని, ఇప్పటి వరకు జిల్లాలో ఇండ్ల కోసం వచ్చిన దరఖాస్తులను, ఆగస్టు 10 వరకు వచ్చే దరఖాస్తుల జాబితా రూపొందించి ఆగస్టు 20 నాటికి క్షేత్రస్థాయి విచారణ పూర్తి చేయాలని సీఎస్ తెలిపారు. జిల్లా ఇంఛార్జి మంత్రిచే లబ్దిదారుల జాబితా ఆమోదింపజేసుకొని ఆగస్టు 25 నాటికి గహలక్ష్మి ఇండ్ల మంజూరు పూర్తి చేయాలన్నారు. రెండవ దశలో ప్రతి అసెంబ్లీ నియోజక వర్గానికి 1100 మంది లబ్దిదారులకు దళిత బంధు పథకం అమలు చేయాలనిప్రభుత్వం నిర్ణయించిందని సీఎస్ తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం స్థానిక ఎమ్మెల్యే లో సమన్వయంతో దళిత బంధు లబ్దిదారులను ఎంపిక చేయాలని సీఎస్ అన్నారు. దళిత బంధు లబ్దిదారులను ఎంపిక చేసిన తరువాత లబ్దిదారులకు మార్కెట్ లో అందుబాటులో ఉండే వివిధ రకాల వ్యాపార అవకాశాలపై అవగాహన కల్పించేందుకు ప్రణాళికలు తయారు చేయాలని, లబ్దిదారుల ఎంపిక పూర్తయితే నిధులను జిల్లా కలెక్టర్లకు విడుదల చేయడం ప్రారంభిస్తామని సీఎస్ అన్నారు. సోషల్ వెల్ఫేర్ శాఖ పరిధిలో ఇంటి పట్టాల పంపిణీ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జూలై మాసంలో వచ్చిన వరదల కారణంగా పట్టాల పంపిణీ ఆలస్యమైందని, స్థానిక ఎమ్మెల్యే సమయం తీసుకుని త్వరితగతిన పంపిణీ పూర్తి కావాలన్నారు. ప్రభుత్వ కారుణ్య నియామకాల కోసం 1266 కార్యాలయ సబార్డినేట్ పోస్టులు జూనియర్ అసిస్టెంట్ గా అప్ గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వు సంఖ్య 79 విడుదల చేసిందని, దాని ప్రకారం జిల్లాలో 10 రోజులలో నియామక ప్రక్రియ పూర్తి చేయాలని సీఎస్ అన్నారు. కారుణ్య నియామకాల కింద డిగ్రి అర్హత ఉన్న వారికి జూనియర్ అసిస్టెంట్, మిగిలిన వారికి కార్యాలయ సబార్డినేట్ పోస్టులు కింద భర్తీ చేయాలని అన్నారు. పోడు భూముల పట్టాల పంపిణీ జిల్లాలో చాలా శాతం పూర్తయిందని, పెండింగ్ లో ఉన్న పట్టాలను త్వరితగతిన పంపిణీ చేయాలన్నారు. జిల్లాలో అటవీ భూమి తదుపరి ఆక్రమణకు గురీ కాకుండా చర్యలు తీసుకోవాలని సీఎస్ తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వు 59 కింద క్రమబద్ధీకరణ కోసం ఎంపికైన లబ్దిదారుల నుంచి రుసుము వసూలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ ఉత్తర్వు 59 కింద పలుమార్లు నోటీసు జారీ చేసినప్పటికీ స్పందన లేని లబ్దిదారుల ఇండ్ల కూల్చివేతలు ప్రారంభించాలని సీఎస్ తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వు 58 కింద ఉచితంగా పేదలకు క్రమబద్ధీకరణ పూర్తి చేశామని, ప్రభుత్వ ఉత్తర్వు 59 కింద పెండింగ్ రుసుము 3 వారాలో వసూలు చేయాలని సీఎస్ పేర్కొన్నారు. ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తుల మేరకు వ్యవసాయేతర నోటరీ భూముల క్రమబద్ధీకరణ కు ప్రభుత్వం అనుమతించిందని అన్నారు. 125 గజాల కంటే తక్కువ ఉన్న నోటరి భూములను స్టాంప్ డ్యూటీ లేకుండా క్రమబద్ధికరిస్తామని, 125 గజాల కంటే ఎక్కువ ఉన్న నోటరి భూములను స్టాంప్ డ్యూటీ వసూలు చేసి క్రమబద్ధీకరణ చేయడం జరుగుతుందని తెలిపారు. ఆన్ లైన్ మీ సేవా ద్వారా నోటరి భూముల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నామని, దీని పై పట్టణ ప్రాంతాల్లో విస్తతంగా ప్రచారం కల్పించాలని అన్నారు. నోటరి భూముల కింద ఇప్పటి వరకు ఆన్ లైన్ లో వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి విచారణ చేపట్టాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ,లి భూపాలపల్లి జిల్లాలో ప్రతివారం 45 గొర్రెల యూనిట్లు గ్రౌండ్ చేస్తున్నామని, ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇకపై ప్రతివారం 9 యూనిట్లు గ్రౌండ్ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో పెండింగ్ గొర్రెలు యూనిట్ల గ్రౌండింగ్ కొరకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేసి త్వరితగతిన లబ్దిదా రులకు యూనిట్లు అందేలా చూస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈవీడియో సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు , జిల్లా అటవీ శాఖ అధికారి బి. లావణ్య,జిల్లా గ్రామీణ అభివద్ధి శాఖ అధికారి పురుషోత్తం జిల్లా పంచాయతీ అధికారి అషలత జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ భాస్కర్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సంజీవరావు, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి బి.సునీత, జిల్లా బీసి అభివద్ధి అధికారి టి.శైలజ, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశించిన ప్రభుత్వ పథకాల లక్ష్యాలను పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

నవతెలంగాణ-ములుగు



నిర్దేశించిన మేరకు ప్రభుత్వ పథకాల లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి రాష్ట్రస్థాయి ఉన్నత అధికారులతో కలిసి తెలంగాణకు హరితహారం, గృహలక్ష్మి , ఇంటి పట్టాల పంపిణీ, జీఓ 59, నోటరి భూముల క్రమబద్ధీకరణ, బీసి, మైనారిటీ లకు లక్ష ఆర్థిక సహాయం, గొర్రెల పంపిణీ, దళిత బంధు వంటి పలు అంశాలపై జిల్లా కలెక్టర్ లతో వీడియో సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఈవీడియో సమావేశంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ రెవిన్యూ డి.వేణుగోపాల్, డిఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్‌లతో కలిసి కలెక్టరేట్ వీడియో సమావేశ మందిరం నుండి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులతో సమీక్షిస్తూ, స్వాతంత్ర్య దినోత్సవ వజ్రోత్సవ వేడుకల సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఒక రోజు కోటి మొక్కలు నాటేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని, మన జిల్లాకు కేటాయించిన లక్ష్యం ప్రకారం మొక్కలు నాటేందుకు స్థలాలు గుర్తింపు, గుంతల తవ్వకం చేపట్టాలని అన్నారు.బీసీ కుల వత్తులకు లక్ష రూపాయలు ఆర్థిక సహాయానికి సంబంధించి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 300 చొప్పున ఎంపిక చేసిన లబ్దిదారులకు ఆగస్టు 10 లోపు చెక్కుల పంపిణీ పూర్తి చేయాలని, ఎమ్మెల్యేతో చర్చించి వారి సమయం తీసుకోవాలని, ప్రభుత్వం నిర్దేశించిన గడువు వివరాలు తెలియజేయాలని, ఎట్టి పరిస్థితుల్లో మొదటి దశ బీసీలకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం ఆగస్టు 10 లోపు పూర్తి కావాలని కలెక్టర్ తెలిపారు. మైనార్టీ సంక్షేమ శాఖ కింద జిల్లాలో నిర్దేశించిన లక్ష్యం ప్రకారం లబ్దిదారుల ఎంపిక త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.గహలక్ష్మి పథకం క్రింద జిల్లాలో ప్రతి తహసిల్దార్ కార్యాలయం, కలెక్టరేట్ కార్యాలయంలో ఆగస్టు 10 వరకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని అన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి గృహలక్ష్మి క్రింద 3 వేల ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని కలెక్టర్ తెలిపారు.రెండవ దశలో ప్రతి అసెంబ్లీ నియోజక వర్గానికి 1100 మంది లబ్దిదారులకు దళిత బంధు పథకం అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, జిల్లాలో ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం స్థానిక ప్రజా ప్రతినిధుల సమన్వయంతో దళిత బంధు లబ్దిదారులను ఎంపిక చేయాలని అన్నారు.సోషల్ వెల్ఫేర్ పరిధిలో ఇంటి పట్టాల పంపిణీ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. ప్రభుత్వ కారుణ్య నియామకాల ప్రక్రియను 10 రోజులలో నియామక ప్రక్రియ పూర్తి చేయాలని, కారుణ్య నియామకాల క్రింద డిగ్రి అర్హత ఉన్న వారికి జూనియర్ అసిస్టెంట్, మిగిలిన వారికి కార్యాలయ సబార్డినేట్ పోస్టులు కింద భర్తీ చేయుటకు చర్యలు తీసుకోవాలని అన్నారు.ప్రభుత్వ ఉత్తర్వు 59 కింద క్రమబద్ధీకరణ కోసం ఎంపికైన లబ్దిదారుల నుంచి రుసుము వసూలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తుల మేరకు వ్యవసాయేతర నోటరీ భూముల క్రమబద్ధీకరణ కు ప్రభుత్వం అనుమతించిందని అన్నారు. ఆన్ లైన్ మీసేవా ద్వారా నోటరి భూముల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తుల స్వీకరిస్తున్నామని, దీనిపై పట్టణ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం కల్పించాలన్నారు. నోటరి భూముల కింద ఇప్పటి వరకు ఆన్ లైన్ లో వచ్చిన దరఖా స్తులను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి విచారణ చేపట్టాలని అన్నారు. ఈవీడియో సమావేశంలో డిఆర్డిఓ నాగపద్మజా, డిపిఓ వెంకయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గౌస్ హైదర్, డిఎస్ఓ అరవింద్ రెడ్డి, డిఎండిఎస్ఓ రాములు , ట్రైబల్ వెల్ఫేర్ ఈ ఈ హేమలత, ఎస్సీ కార్పొరేషన్ ఈడి తుల రవి, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ జెర్సన్ కుమార్, డి ఈ ఎలక్రిసిటి నాగేశ్వర రావు, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ లక్ష్మణ్, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి అప్పల నాయుడు, కలెక్టరేట్ కార్యాలయ ఇంఛార్జి ఏఓ ప్రసాద్, సూపర్ ఇండెంట్ రాజ్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



తల్లిపాలలో పోషక పదార్థాలు

నవతెలంగాణ-కాటారం

తల్లిపాలతో పిల్లలకు కావాల్సిన పోషక పదార్థాలు సమృద్ధిగా లభిస్తాయని పలువురు వక్తలు సూచించారు. బిడ్డపుట్టిన మొదటి గంటలోనే తల్లి పాలు బిడ్డకు పట్టించాలని సూచించారు. దాంతో బిడ్డకు కావాల్సిన పోషకాలు లభిస్తాయని తెలిపారు. కాటారం మండలంలోని దన్వాడ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. మొదటి ఆరు నెలలు బిడ్డకు తల్లిపాలు మాత్రమే తాగించాలని, ఎలాంటి ద్రవ పదార్థాలు తాగించవద్దని తల్లులు, గర్భిణీలకు అవగాహన కల్పించారు. బిడ్డకు అవసరమైన విటమిన్స్, మినరల్స్ తల్లిపాలలో మాత్రమే పుష్కలంగా లభిస్తాయని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కారెంగుల శ్రీలత, రజిత, ఎఎన్ఎం సరోజన, నక్షత, ఆశా సంధ్యలు పాల్గొన్నారు.



పుట్టిన బిడ్డకు తల్లి ముర్రుపాలు జీవిత రక్షణ

నవతెలంగాణ-ములుగు

పుట్టిన బిడ్డకు తల్లి ముర్రుపాలు జీవిత రక్షణ ఇస్తుందని అంగన్‌వాడీ టీచర్లు తల్లులకు, గర్భిణీలకు సూచించారు. సోమవారం ములుగు గొల్లవాడ, అంగన్‌వాడీ సెంటర్‌లో ప్రపంచ తల్లి పాల వారోత్సవాల సందర్భంగా కార్యక్రమాలు చేశారు. ఈకార్యక్రమంలో గర్భిణి స్త్రీలు 7వ నెల నుండి తల్లి స్థానాలను శుభ్రం చేసుకుంటూ ఉండాలని, అలాగే డెలివరీ తర్వాత మొదటి పాలు బిడ్డ జీవితానికి సరిపడా వ్యాధి నిరోధక శక్తిని ఇస్తుందని, 6 నెలల వరకు తల్లిపాలు మాత్రమే పట్టాలన్నారు. రెండు సంవత్సరాల వరకు తల్లిపాలు కొనసాగించాలని, ఈకార్యక్రమంలో భాగంగా బిడ్డకు అన్నప్రాసన, గర్భిణి స్త్రీలు గర్భిణీ అని తెలిసిన వెంటనే అంగన్‌వాడీ సెంటర్ పేరు నమోదు చేసి వారికి ప్రతి రోజు అంగన్‌వాడీ సెంటర్‌లో ఆరోగ్యలక్ష్మి ద్వారా అందించే సంపూర్ణ భోజనం అందిస్తూ ఆరోగ్య సమస్యలు ఏవైనా ఉంటే సలహాలు, సూచనలు చేస్తూ, ప్రతి నెలలో రెండు ఈవెంట్స్ షెడ్యూల్ ప్రకారం చేశారు. 6 నెలలు నిండిన తరువాత బిడ్డకు అన్నప్రాసన, 3 సంవత్సరాలు నిండిన తరువాత అక్షరాభ్యాసం చేయించి రెండున్నర సంవత్సరాల పిల్లలకు ఆట పాటల ద్వారా ప్రీస్కూల్ యాక్టివిటీస్ చేయించడం జరుగుతుందని, కాబట్టి రెడున్నర సంవత్సరాల పిల్లలను ప్రతి రోజూ అంగన్‌వాడీ సెంటర్‌కి పంపాలని తెలిపారు. ఇలా చేయడం వల్ల పిల్లలు స్కూల్‌కి వెళ్ళిన తరువాత బిడియం, భయం లేకుండా యాక్టీవ్‌గా ఉంటారన్నారు.



గద్దర్ కు ఘన నివాళి

నవతెలంగాణ -తాడ్వాయి

ప్రజా యుద్ధ నౌక గద్దర్ ఆదివారం హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించడం విధితమే. సోమవారం మండలంలోని కాలపల్లి గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో గద్దర్ మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల విప్లవ స్ఫూర్తి గద్దర్ అని, ఆయన పాట ఎప్పుడూ సామాజిక సంస్కరణల పాటే అని వారు గుర్తు చేసుకున్నారు. నిరంతరం సామాజిక న్యాయం కోసమే బ్రతికిన గద్దర్ మరణం ఊహించలేదన్నారు. గద్దర్ మృతి పట్ల మండలంలోని వివిధ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, గ్రామస్తులు, మహిళా సంఘాల నాయకులు సంతాపం తెలిపారు. తన పాటలతో ప్రజా చైతన్యానికి ఎనలేని కృషి చేసిన ప్రజా యుద్ధ నౌక గద్దర్ అన్నారు. తన గలంతో ప్రజలను కదిలించిన గద్దర్ మృతితో ప్రజాఉద్యమాలు, పౌరహక్కుల పోరాటంలో ఒక శకం ముగిసిందన్నారు. ఈకార్యక్రమంలో అంబేద్కర్ సంఘం జిల్లా నాయకులు తిప్పనపల్లి ఎల్లస్వామి, పురి సమ్మయ్య, పురుషోత్తం నారాయణ, రాజబాబు, నర్సింహులు, ధర్మయ్య, శ్రీను, సురేష్, భూషబోయిన శంకరయ్య నల్లమొక్క రవి, సిద్ధబోయిన నరసింహారావు, వివిధపార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, గ్రామపెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

గృహలక్ష్మికి దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-కాటారం

రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద కుటుంబాల కోసం నూతనంగా ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకానికి దరఖాస్తులు చేసుకోవాలని కాటారం తహసిల్దార్ నాగరాజు తెలిపారు. సోమవారం తహసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గృహలక్ష్మి పథక విధివిధానాలను వివరించారు. ఇల్లు లేని పేద కుటుంబాల వ్యక్తులు సోమవారం నుండి గురువారం లోపు కులం, నివాసం, ఆదాయ సర్టిఫికెట్లతో దరఖాస్తులను పూర్తి చేసి తహసిల్దార్ కార్యాలయంలో అందజేయాలన్నారు. గృహలక్ష్మి దరఖాస్తులను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక పోర్టల్‌లో అప్‌లోడ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన బృందాలు తనిఖీలు నిర్వహించి అర్హులైన వారికి గృహలు నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ.3 లక్షలను ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇల్లు కట్టుకునేందుకు ఇంటి స్థలం ఉన్నవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు



ప్రకృతి వైపరీత్యాన్ని సమిష్టిగా ఎదుర్కొందాం

సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్

నవతెలంగాణ-ములుగు

ప్రకృతి వైపరీత్యాన్ని సమిష్టిగా ఎదుర్కొందామని సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ పిలుపునిచ్చారు. ఇటీవలే కురిసిన భారీ వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తమైంది. వెంకటాపూర్ మండలం మల్లయ్యపల్లి గ్రామంలో సోమవారం సర్వర్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 15 వరద బాధిత కుటుంబాలకు బియ్యం, నిత్యవసర సరుకుల అందించిన తస్లీమా ధాతృత్వం చాటుకున్నారు. ప్రకృతి వైపరీత్యంతో మొత్తం కకావికలం అయ్యిందని, ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో బాధితులకు మేమున్నామనే భరోసా కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తస్లీమా అన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ జగ్‌రామ్, సర్వర్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఆదివాసీల హక్కుల కోసం పోరాడాలి

వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన సర్పంచ్

నవతెలంగాణ-వాజేడు

తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం మండలస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను సోమవారం సర్పంచ్ నాగచంద్ర ప్రారంభించారు. కృష్ణాపురం గ్రామంలో సోమవారం నుండి మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ యువతలో క్రీడా నైపుణ్యాన్ని పెంచేందుకు తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో జరిగే ఈటోర్నమెంట్ ఎంతగానో ఉపయోగపడుతుందని, ఈనెల 9న జరిగే ప్రపంచం ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈక్రీడలు నిర్వహించడం ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుందని, ఆదివాసీ హక్కుల కోసం ఎంతగానో పోరాడాల్సిన అవసరం ఉందని, యువత రానున్న కాలంలో ఆదివాసీ హక్కుల కోసం పోరాడాలని పిలుపు నిచ్చారు. ఈసందర్భంగా సీపీఎం పార్టీ మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావు మాట్లాడుతూ ఆదివాసీ చట్టాలను కేంద్ర బిజెపి ప్రభుత్వం సవరణలు చేస్తుందని, వారి హక్కులపై మోడీ ప్రభుత్వం దాడి చేస్తూ ఆదివాసుల మనుగడపై కూడా దాడి చేస్తుందని, రానున్న కాలంలో ఆదివాసిలు అందరూ ఐక్యమై పోరాడాలని పిలుపు నిచ్చారు. ఈకార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పూనెం విజయ్‌బాబు, పూనెం నవీన్, మడే వేణు, సొనప కిరణ్, బీఆర్ఎస్ నాయకులు పూనెం అశ్వపతి, వాసం ఆనందరావు, ఆదివాసీ నాయకులు పాయం వేణు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి: టీపీయూఎస్

నవతెలంగాణ-చిట్యాల



ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ టీపీయూఎస్ ఆధ్వర్యంలో కరపత్రాన్ని ఉపాధ్యాయులకు అందజేస్తూ మధ్యాహ్నం సమయంలో నిరసన తెలిపారు. సోమవారం మండలంలోని టీపీయూఎస్ జిల్లా మండల అధ్యక్షులు బుర్ర సదయ్య, కానుగుల రఘుపతిలు పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు వెంటనే సీపీఎస్ రద్దు, పీఆర్సీ అమలు 317 సమస్యలు పరిష్కరించి స్కావెంజర్స్‌ని పునరుద్ధరించాలన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ప్రతి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షులు శ్రీరామ రఘుపతి, ఉపాధ్యాయులు సతీష్, అశోక్, సాంబయ్య, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

నిత్యవసర సరుకుల ధరలు తగ్గించాలి

నవతెలంగాణ-భీమదేవరపల్లి

నిత్యవసరల ధరలు తగ్గించాలని కూలి రేట్లు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేస్తూ తహశీల్దార్‌కు కార్మికులు వినతిపత్రం అందించారు. వ్యవసాయ కార్మికులకు కనీస వేతనం చట్టాన్ని తక్షణమే అమలుపరచాలి రోజువారి కూలీ 600 చెల్లించాలి 57 సంవత్సరాలు నిండిన ప్రతి వ్యవసాయ కార్మికుడికి పెన్షన్ ఇవ్వాలి వ్యవసాయంలో స్త్రీ పురుషులకు సమాన వేతనాలు ఇవ్వాలి వ్యవసాయ కార్మికులకు ట్రెండ్ యూనియన్ హక్కులు కల్పించారు సొంత స్థలం ఉన్న వారికి తక్షణమే ఐదు లక్షలు మంజూరు చేయాలి ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకొని ఉన్నవారికి పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలి ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మడి రాజుల రాములు భీమదేవరపల్లి మండలం వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి అజ్మీర బిక్షపతి కమిటీ సభ్యులు సారయ్య కొమరయ్య గూళ్ళ లక్ష్మి సన్నిల లక్ష్మి దొండ ఎల్లమ్మ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ రాష్ట్ర క్రైస్తవులకు న్యాయం చేయాలి



నవతెలంగాణ-ఐనవోలు

మణిపూర్ క్రైస్తవులకు న్యాయం చేయాలని ఐఎంపిఎఫ్ ఆధ్వర్యం లో క్రైస్తవ సంఘాల విశ్వాసులతో సోమవారం తహసిల్దార్‌కు వినతిప త్రాన్ని సమర్పించారు. మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న హింసా కాండను ఏకగ్రీవంగా ఖండిస్తూ, ప్రధానమంత్రి, మణిపూర్ ముఖ్యమం త్రి ఈ ఘటనలపై స్పందించి మ ణిపూర్ క్రైస్తవ ప్రజలకు న్యాయం చేయాలని కోరుతూ మండలంలోని అన్ని క్రైస్తవ సంఘాల పాస్టర్స్, వారి విశ్వాసులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో ఐనవోలు మండల పాస్టర్స్ ఫెలోషిప్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ ప్రేమ్‌జి త్, ప్రెసిడెంట్ టీ.మార్క్, వైస్‌ప్రెసిడెంట్ బి.షడ్రక్, సెక్రెటరీ ఎం.ఏలీయా, జా యింట్ సెక్రటరీ ఆరోగ్యం, ట్రెజరర్ కే.జర్మియా తదితరులు పాల్గొన్నారు.

చింత నెక్కొండలో వీధి దీపాల ఏర్పాటు

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని చింతనెక్కొండలో సోమవారం స్థానిక సర్పంచ్ గటిక సుష్మ ఆధ్వర్యంలో వీధి దీపాలు ఏర్పాటు చేశారు. బోనాల పండుగ సందర్భంగా ముందస్తుగాఏర్పాట్లు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దేవేందర్,పంచాయతీ కార్యదర్శి సరిత, వార్డు సభ్యులు జీడి గట్టయ్య, మడూరి రాజు, పసునూటి రజిత, వేల్పుల కేతమ్మ,మామిండ్ల రజిత, తూర్పాటి రామక్క, ఎర్రబెల్లి సరస్వతి, భట్టు కౌసల్య మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ సంఘర్షణ యాత్ర జయప్రదం చేయండి

నవతెలంగాణ-నర్సంపేట

నేటి నుంచి 11 వరకు వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ సంఘర్షణ యాత్రను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శివరాత్రి అనిల్ కోరారు. సోమవారం పట్టణంలో ఎస్ఎఫ్ సంఘర్షణ యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ విద్యా రంగ సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. గురుకులాలు, హాస్టళ్లలో సమస్యలు తిష్టవేసి ఉన్నాయని తెలిపారు. మౌళిక సదుపాయాలు కొరవడి విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు గురైతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. స్కాలర్‌షిప్, ఫీజురీయాంబర్స్‌మెంట్ విడుదల చేయాలన్నారు. ఈ సమస్యలను అధ్యయనం చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని చేపట్టిన యాత్రను విద్యార్థులు జయప్రదం చేయాలని కోరారు. ఈ యాత్రకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి హాజరు కానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలోఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రాకేష్, నాయకులు గణేష్, శ్రీనివాస్, కుమార్, కృష్ణ, సమీర్, కృపా తదితరులు పాల్గొన్నారు.

ఆంక్షలు ఎత్తివేయాలి : ఏఐఎస్ఎఫ్

నవతెలంగాణ-సుబేదారి

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో,సంక్షేమ హాస్టళ్లలోకి విద్యార్థి సంఘాలు,మీడియానీ రానివ్వద్దు అంటూ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి డిమాండ్ చేశారు. సోమవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా సహయ కార్యదర్శి, కసరబోయిన రవితేజ, ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి సభ్యులు రాజు గౌడ భాను తదితరులు పాల్గొన్నారు.

12న విద్యారంగ సమస్యలపై ర్యాలీ

నవతెలంగాణ-హన్మకొండ

రాష్ట్రంలోని విద్యారంగ ఉపాధ్యాయ సమస్యలపై ఆగస్టు 12న జిల్లా కేంద్రాల్లో ర్యాలీ, ధర్నాకు సంబంధించిన గోడపత్రికలను ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ హనుమకొండ వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో ఆవిష్కరణ చేపట్టారు. వేతన సవరణ కమిటీ పిఆర్సి వేయాలని, జులై 1 నుంచి తాత్కాలిక భృతి మంజూరు చేయాలని ,ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతులు చేపట్టాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, 317 జీవో బాధితులకు న్యాయం చేయాలని ,జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, పండితులు పి ఇ టి లకు పదోన్నతులు కల్పించాలని తదితర విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పట్ల ప్రభుత్వము దీర్ఘకాలికంగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందుకు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో దశలవారి ఆందోళన కార్యక్రమానికి కార్యాచరణ రూపొందించామని ఇందులో భాగంగా ఈనెల ఆగస్టు 12 న జిల్లా కేంద్రాలలో ర్యాలీ మరియు ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ హనుమకొండ, వరంగల్ జిల్లాల బాధ్యులు తెలియజేశారు. ఈ సందర్భంగా సోమవారం జిల్లా విద్యాశాఖ అధి కారి హనుమకొండ కార్యాలయం ఆవరణలో సంబంధించిన గోడపత్రికలను రాష్ట్ర స్టీరింగ్ కమిటీ బాధ్యులు టీ.లింగారెడ్డి, కే.భోగేశ్వర్ నన్నబోయిన తిరుపతిల ఆధ్వర్యంలో ఉభయ జిల్లా బాధ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బాధ్యులు మాట్లాడుతూ ప్రభుత్వము గత తొమ్మిదిన్నర సంవత్సరాలుగా ఉపాధ్యాయుల నియామకాలులేవు పదోన్నతులు లేవని అదేవిధంగా 5ఏండ్లుగా బదిలీలు లేవని, పర్యవేక్షణ అధికారుల పోస్టులు ఖాళీగా ఉండటం వల్ల విద్యవ్యవస్థకు తీరని నష్టం జరుగుతున్నదని అన్నారు.

వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని లేనిచో పెద్ద ఎత్తున పోరాటాన్ని ఉధతం చేస్తామని సెప్టెంబర్ 1న హైదరాబాదులో మహా ధర్నా నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఈ గోడ పత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ వరంగల్ హనుమకొండ జిల్లాల బాధ్యులు ఎం సదాశివరెడ్డి తాటికాయల కుమార్, పెండెం రాజు, బద్ధం వెంకటరెడ్డి, సి హెచ్ రవీందర్ రాజు, టిపిటిఎఫ్ జిల్లా బాధ్యులు సత్యనారాయణ, టి సుదర్శనం, పూజారి మనోజ్, డిటిఎఫ్ జిల్లా బాధ్యులు ఎ.శ్రీనివాసరెడ్డి, ఏ.గోవిందరావు, కె.యాకయ్య, కె.శ్రీనివాస్, డి.మహేందర్‌రెడ్డి, ఆర్.రాంరెడ్డి, ఎం.ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

ఏఐఎస్ ఎఫ్ జిల్లా కార్యదర్శి బాషబోయిన సంతోష్

నవతెలంగాణ-ఎల్కతుర్తి

మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని ఏఐఎస్ ఎఫ్ జిల్లా కార్యదర్శి బాషబోయిన సంతోష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని గోపాలపురంలో ఏఐఎస్ఎఫ్ 11వ మండల మహాసభ జిల్లా ఉపాధ్యక్షులు వుట్కూరి ప్రణీత్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించగా ముఖ్య అతిథులుగా జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్ యాదవ్ హాజరై మాట్లాడారు. విద్యారంగ సమస్యలు, ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల,సమస్యల సాధన కోసం పలు తీర్మానాలు చేయడం జరిగింది. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ముంజ పూర్ణగౌడ్, మండల ప్రధాన కార్యదర్శిగా మాచర్ల రాజా గౌడ్, ఉపాధ్యక్షులుగా చీర్ర సాయి చందు, బొనగిరి కుమార్, మండల సహాయ కార్యదర్శులుగా వుటుకురి సాయి కుమార్, మండ సాయి కుమార్, ఎన్నికయ్యారు. కౌన్సిల్ సభ్యులుగా కంచర్ల రాకేష్,కే శ్రీకాంత్, వి సాయి కుమార్ బి. లక్ష్మణ్ ,రాజ్ శ్రీ సాయి కాంత్ ఎస్ అజయ్ పి రాకేష్, కిరణ్ సిహెచ్ వెంకటేష్, ఈ కిరణ్ కుమార్ ఆనంద్‌లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కసరబోయిన రవితేజ, జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం అఖిల్ పాల్గొన్నారు.

పశు సంరక్షణలో జాగ్రత్తగా ఉండాలి

నవతెలంగాణ-పర్వతగిరి

పశువుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని మండల పశువైద్య అధికారి డాక్టర్ వి.నరేష్ తెలిపారు. మండలంలోని ఇస్లావత్ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని ఆయా తండాల్లో పశువులకు గాలికుంటు టీకాలు కార్యక్రమం నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు మహమ్మద్ సర్వర్ ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పశుపోషణకై పశు వ్యాధుల నివారణకై లక్షలాది రూపాయలు వెచ్చించి, రైతుల సంక్షేమం కోసం పనిచేస్తుందని అన్నారు.అనంతరం సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గాలికుంటు వ్యాధి, చర్మ వ్యాధికి,నట్టల నివారణకు వ్యాక్సినేషన్, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ అమరావతి, గోపాలమిత్రలు ఉపేం దర్, వెంకన్న రైతులు హరిసింగ్, మూడు వెంకన్న, మూడు హతిరాం, ఇస్లావత్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నవతెలంగాణ-శాయంపేట

శాయంపేట గ్రామానికి చెందిన మార్త వెంకటయ్య, వంగరి శంకర్, ప్రగతి సింగారం కు చెందిన మునుకుంట్ల రణధీర్, కొప్పులకు చెందిన బగ్గి సాంబయ్య అనారోగ్యాలతో బాధపడుతూ ఇటీవల మరణించారు. బాధిత కుటుంబాలను సోమవారం టీపీసీసీ సభ్యులు, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ గండ్ర సత్యనారాయణరావు సందర్శించి మృతుల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి, నాయకులు చిందం రవి, బాసాని మార్కండేయ, మారపల్లి క్రాంతి, కుక్కల బిక్షపతి పాల్గొన్నారు.

మిర్చి బండి నిర్వాహకుడిపై మూకుమ్మడి కక్ష

భిక్షగాడి జోల లాక్కున్న చందంగా అధికారుల పనితీరు

నిబంధనలకు విరుద్ధంగా కంచె నిర్మాణం

నవతెలంగాణ-హసన్‌పర్తి

ఆవు చేలో మేస్తే లేగ గట్టున మేస్తదా అన్న చందంగా మిర్చి నిర్వాహకుడిపై మూకుమ్మడి కక్ష జరిగింది. విద్యుత్ అధికారులు, కాలనీవాసులు కలిసి బిచ్చగాడి జోల లాక్కున్న చందంగా మిర్చి బండి నిర్వాహకుడి బతుకు జీవితం దెబ్బ కొట్టారు. రోజులో మూడు గంటలు కష్టపడి మిర్చి అమ్మిన డబ్బులతో కుటుంబాన్ని పోషించుకుంటున్న ముగ్గురు ఆడ కూతుళ్ల తల్లిదండ్రులకు పుట్టెడు దు:ఖాన్ని మిగిల్చింది. అందరు కక్ష కట్టారు. బిచ్చగాడి జోల కోసం కలబడ్డారు. అక్రమంగా కంచె నిర్మాణం చేపట్టి మిర్చి బండి నిర్వాహకుడి బతుకు బండి మీద దెబ్బకొట్టారని స్థానికులు చెవులు కొరుక్కుంటున్న యదార్థ గాథ. బాధితుడు, స్థానికుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే మండల కేంద్రానికి చెందిన తలకొక్కుల ఐలయ్య దంపతులది సామాన్య కుటుంబం. వారికి ముగ్గురు కూతుళ్లు. తలదాచుకోను సొంత ఇల్లు కూడా లేదు. అద్దె కొంపలో జీవనం సాగిస్తున్నాడు. ఆదంపతులిద్దరు ఎర్రగట్టుగుట్ట క్రాస్ రోడ్డు మంత్రపురి కాలనీ క్రాస్ రోడ్డు వద్ద మిర్చి బండి నడుపుకుంటూ తన ముగ్గురు కూతుళ్లను పోషిస్తూ వివాహాలు చేశారు. కూతుళ్ల వివాహలకు, కాన్పుల కోసం చేసిన అప్పులు పెరిగిపోయాయి. చేసిన అప్పులు తీర్చడం కోసం ఐలయ్య దంపతులు కష్టపడి మిర్చి బండి నడుపుకుంటున్నారు. ఇంతలోనే పిడుగుపడ్డట్టు మంత్రపురి కాలనీవాసులు ఏకమయ్యారు. మిర్చి బండిని ఎత్తివేయాలని హుకూం జారీ చేశారు. దీంతో మిర్చి బండి నిర్వాహకుడు నెలరోజులుగా నరకయాతనను అనుభవిస్తున్నాడు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టు కాలనీవాసులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకుంటానని హామీ ఇచ్చారు. అయిన వారు ఆర్థనాదాలను ఎవరు పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రక్కనే ఖాళీగా ఉన్న స్థలంలో తిరిగి మిర్చి బండి ఏర్పాటు చేసుకున్నారు. అయినప్పటికి కాలనీవాసులలో ఎటువంటి మానవీయత కనిపించలేదు. ఎర్రగట్టుగుట్ట క్రాస్‌రోడ్డు వద్ద మిర్చి బండి ఎత్తివేయాలని నిర్వాహకుడిపై ఒత్తిడి పెంచారు. ఎంత బతిమిలాడినా వినకుండా 100కు డయల్ చేసి పోలీసుల ముందే రచ్చ చేశారు. మిర్చి బండి కోసం హన్మకొండ ప్రధాన రహదారిపై కాలనీవాసులు న్యూసెన్స్ చేశారు. కేయూ ఎస్సై సురేష్ అక్కడికి చేరుకొని న్యూసెన్స్ చేసిన వారిపై కేసులు నమోదు



చేశారు. ఇన్‌స్పెక్టర్ అబ్బయ్య వారి ఇరువురిని పిలిపించి మిర్చి బండి నిర్వాహకుడి పొట్ట మీద దెబ్బకొట్టి కుటుంబాన్ని రోడ్డున పడేయకండి కాలనీ వాసులకు ఇబ్బంది కలుగకుండా మిర్చి బండి నిర్వహించుకోవాలని హితవు పలికారు. ఈవిషయాన్ని జీర్ణించుకోలేని కాలనీవాసులు విద్యుత్ అధికారులను ఆశ్రయించి ఏఈ ప్రదీప్‌కుమార్ సమక్షంలో కాలనీవాసులు మిర్చి బండిని సైతం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే ఉంచి నిబంధనలకు విరుద్ధంగా కంచె నిర్మాణం చేపట్టారు. దీంతో విద్యుత్ ఏఈ ప్రదీప్‌కుమార్, కాలనీవాసులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఏర్పాటు చేసిన కంచె కుట్ర పూరితంగా మిర్చిబండి నిర్వాహకుడి బతుకు మీద దెబ్బకొట్టి కుటుంబాన్ని రోడ్డు పాలు చేసే విధంగా ఉందని పలువురు చర్చించుకుంటున్నారు. అంతేకాకుండా అవసరం ఉన్న చోట విద్యుత్ అధికారులు ప్రజల మాట వినరు కాని పేదవాడి బతుకు మీద దెబ్బకొట్టేందుకు కలిసికట్టుగా ముందుకు వచ్చిన తీరు దొంగలు.. దొంగలు ఊర్లు పంచుకున్న చందంగా ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈవిషయంపై విద్యుత్ ఏఈ ప్రదీప్‌కుమార్‌ను ఫోన్‌లో వివరణ కోరగా మాఇష్టం వచ్చినట్లు మేము విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల ముందు రక్షణ కవచం ఏర్పాటు చేస్తామని నిబంధనలతో మాకు సంబంధం లేదని చెప్పారు. అంతేకాకుండా అక్కడ కంచే వేసేందుకు కాలనీవాసులు ఒత్తిడి తీసుకువచ్చి వారి ఇష్ట ప్రకారమే నిర్మాణం చేపట్టారని తెలిపారు. ఈవిషయంపై విద్యుత్ ఉన్నతాధికారులు ఏవిధంగా స్పందించి విద్యుత్ ఏఈపై చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

జీపీ కార్మికుల వంటా వార్పు

33వ రోజుకు చేరుకున్న సమ్మె



నవతెలంగాణ-హసన్‌పర్తి

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ, ఉద్యోగ కార్మిక సంఘం నాయకులు వంటా వార్పు ద్వారా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర జేఏసీ కోశాధికారి చాతల్ల సదానందం, రాష్ట్ర నాయకుడు నేదునురి రాజమౌళిలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 33 రోజులుగా సమ్మె చేస్తున్నా గ్రామపంచాయతీ ఉద్యోగ,కార్మికుల న్యాయమైన డిమాండ్‌లను సీఎం అసెంబ్లీలో ప్రవేశపెట్టి రెగ్యులరైజ్ చేసి కనిస వేతనం అమలుచేసి ప్రభుత్వ గ్రాంట్ ద్వారా ప్రతి నెలా వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ ఆదివారం అసెంబ్లీ సాక్షిగానిండు శాసనసభలో మాట్లాడుతూ గొంతెమ్మ కోర్కెలు కోరడం సమంజసం కాదని అనడం పూర్తిగా ఖండిస్తున్నామని, ఆయన మాటలను వ్యతిరేకిస్తున్నామని, మావి గొంతెమ్మ కోరికలు అసలే కాదని ఆకలి మంటలు, కడుపు కోతలన్నారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్మిక సంఘం జిల్లా ఇన్‌చార్జి తగరం శివ, మండల అధ్యక్షులు బండి రమేష్, మండల ప్రధాన కార్యదర్శి కుక్కముడి నరేశ్, మార్, రేణుక, సునీత, రమేష్, రవీందర్, ప్రవీణ్, శ్రీధర్, కొమురయ్య, హసన్‌పర్తి మండల గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాలను పరిశీలించిన సీపీ బృందం





నాలాలు, చెరువులు, కుంటల పరిస్థితి అంచనా

కబ్జా ప్రాంతాల ఫోటోలో సేకరణ, నివేదిక రూపకల్పన

చర్యలకు రంగం సిద్ధం

నవతెలంగాణ-హసన్‌పర్తి

జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, వరంగల్ నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఐబీ డీఈ రాజు, ఏఈ నాగవల్లి శ్రీనివాస్, కేయూ ఇన్‌స్పెక్టర్ అబ్బయ్యలు సోమవారం భీమారం ముంపు ప్రాంతాలను పరిశీలించారు. భీమారం శ్యామల చెరువు, నాలాల కబ్జాలతో పాటు చెరువు శిఖం, బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ పరిధి, నాలాలపై అక్రమ నిర్మాణాలను పరిశీలించి ఫోటో చిత్రాలను సేకరించి నివేధిక రూపకల్పనకు ప్రత్యేక బృందం పర్యవేక్షించింది. ప్రస్తుతం వరద ముంపుకు గల కారణాలను నివేధిక రూపంలో కలెక్టర్, వరంగల్ పోలీస్ కమిషనర్‌కు అందజేసి తదుపరి కార్యాచరణకు రంగం సిద్ధం చేశారు. ఈసందర్భంగా భీమారం శ్యామల చెరువు, నాలాల అక్రమ నిర్మాణ పరిశీలన, నివేదిక రూపకల్పనలో ఐబీ డీఈ, ఏఈ, కేయూ ఇన్‌స్పెక్టర్‌లతో పాటు క్రైం ఎస్సై విజయ్‌కుమార్, స్థానికులు వల్లాల శ్రీధర్, నాతి రమేష్, మానుపాటి సురేందర్, ప్రదీప్, శ్రీనివాస్, పప్పుల రమేష్ తదితరులున్నారు.

పంచాయతీ కార్మికుల రాస్తారోకో



నవతెలంగాణ-నల్లబెల్లి

గ్రామపంచాయతీ కార్మికులు రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మె గత 33 రోజుల నుండి చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సోమవారం గ్రామపంచాయతీ కార్మికులు మండలంలోని నేషనల్ హైవేపై రాస్తారోకో నిర్వహించి గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే తీర్చాలని డిమాండ్ చేశారు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్మికుల న్యాయమైన కోరికలను తీర్చకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల గ్రామ పంచాయతీ కార్మికుల అధ్యక్షుడు యాకూబ్ పాషా, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, పడాల రాజు, పులి చక్రపాణి, ఇతర గ్రామాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు న్యాయం చేయండి

వ్యకాస జిల్లా అధ్యక్షుడు సారంపల్లి వాసుదేవరెడ్డి

నవతెలంగాణ-హసన్‌పర్తి

పంచాయతీ కార్మికులకు ప్రభుత్వం న్యాయం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సారంపల్లి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో జరుగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మెకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సారంపల్లి వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సిబ్బంది సేవలు చాలా విలువైనవని వారు చేస్తున్న సేవకు ఇచ్చే వేతనం చాలా తక్కువని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వారి న్యాయమైన కోరికలను నెరవేర్చి కనీస వేతనం రూ.20వేలు ఇవ్వాలన్నారు. అలాగే వారికీ పిఎఫ్, సౌకర్యం కల్పించాలన్నారు. వారిని ప్రభుత్వ ఉద్యోగులకు ఉండే అన్ని రకాల సదుపాయాలను కల్పించాలన్నారు. అలాగే వారికీ వారానికి ఒక రోజు సెలవు దినంను ప్రకటించాలన్నారు. ఇప్పటికి వారు గత 33 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నిమ్మకు నీరేత్తినట్లు వ్యవహారిస్తుందన్నారు. ఇలాగే ప్రభుత్వం మొండి వైఖరిగా ఉంటే రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీ సిబ్బంది న్యాయమైన కోరికలు సాధించుట కోసం రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున పోరాటాలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కళ్ళు తెరువకుంటే రాబోయే ఎన్నికలలో ప్రభుత్వానికి గట్టిగా బుద్ది చెపుతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి గబ్బెట సతీష్, మండల



అధ్యక్షులు ఊర్ల సురేందర్, మండల నాయకులు పద్మ, జోరిక, మొగిలి, పోతరాజు అంజనేయులు, బలయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రహదారి

నవతెలంగాణ-పర్వతగిరి

ఇటీవల కురిసినభారీవర్షాల కారణంగా మండలంలోని తురుకల సోమారం, చౌటపల్లి గ్రామాల మధ్య కల్వర్ట్ ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డు నుండి నిత్యం వందలాది వాహనాలు నడుస్తుంటాయి. ఈ రోడ్డు పై గతంలో ఎన్నో ప్రమాదాలు కూడా జరిగాయి.కాగా మొన్నటి వర్షాలకు పూర్తిగా కల్వర్టు పూర్తిగా దెబ్బతిన్నందున సంబంధిత అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



తల్లి పాలు అమృతంతో సమానం





నవతెలంగాణ-రాయపర్తి

పుట్టిన బిడ్డకు తల్లిపాలే అమృతమని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సత్యవతి తెలిపారు. సోమవారం మండలంలోని కొండూరు గ్రామంలో సర్పంచ్ కర్ర సరిత రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు బిడ్డ పుట్టిన గంటలోపే తల్లి ముర్రు పాలు పట్టించాలన్నారు. దీంతో పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. ఆరు నెలలు నిండిన చిన్నారులకు తల్లి పాలతో పాటు అంగన్వాడీ కేంద్రాలలో అందించే అనుబంధ పోషకాహారాన్ని అం దించాలన్నారు. తల్లిపాలు తేలికగా జీర్ణమవుతాయి, అంతే కాకుండా శుభ్రంగా ఎటువంటి క్రీములు లేకుండా ఉంటాయి అని వివరించారు. తల్లిపాలు శ్వాసకోశ, అలర్జీ, అస్తమా, చర్మవ్యాధుల నుంచి పిల్లలను రక్షిస్తాయి అని తెలిపారు. బిడ్డ మానసిక శారీరక వికాసానికి అవసరమైన పోషకాలు అందుతాయి అని చెప్పారు. రోజులో బిడ్డకు 8 నుండి 10సార్లు పాలు ఇవ్వాలని దీంతో ఎలాంటి వ్యాధులు దరిచేరకుండా బిడ్డ ఎదుగుదల సక్రమంగా ఉంటుంది అని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొమ్ము రాజు, ఏఎన్ఎం శ్రావణి, అంగన్వాడీ టీచర్లు సుజాత, ప్రేమలీల, స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

కాశిబుగ్గ : వరంగల్ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధి పైడిపల్లి సెక్టర్ లోని ఆరెపల్లి రెండవ సెంటర్లో సోమవారం తల్లిపాల వారోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన 3వ డివిజన్ కార్పొరేటర్ జన్ను షీబారాణి మాట్లాడుతూ పోషకాహార ప్రాధాన్యతను గురించి వివరించారు. గర్భిణీలు బాలింతలు తప్పనిసరిగా పౌష్టిక ఆహారం తీసుకోవాలన్నారు. సిడిపిఓ విశ్వజా మాట్లాడుతూ న్యూట్రిషన్ గురించి వివరించారు. గర్భిణీలు, బాలింతలకు ముర్రుపాలు, తల్లిపాల గురించి వివరించారు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత అవగాహన కల్పించారు. పిల్లలకు ఆరు నెలల వయసు వరకు తప్పనిసరిగా తల్లిపాలు పట్టించాలన్నారు. ఈ కార్యక్రమంలో సైంటిస్ట్ అరుం జ్యోతి, సూపర్వైజర్ జక్కుల లావణ్య, ఏఎన్ఎంలు లక్ష్మి, రజిత, ఎస్ఎంసి చైర్మన్ స్వరూప అంగన్వాడీ టీచర్లు శోభారాణి, రమాదేవి, సుజాత, ధనమ్మ పాల్గొన్నారు.

శాయంపేట : తల్లిపాలతోనే బిడ్డ ఆరోగ్యవంతంగా జీవిస్తుందని స్థానిక సర్పంచ్ పొడమేకల మమతా సంపత్ అన్నారు. మండలంలోని సోమవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వ హించారు. ముఖ్యఅతిథిగా సర్పంచ్ మమతా పాల్గొని మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపు తల్లి నుండి వచ్చే ముర్రు పాలను తాగించడం వల్ల బిడ్డకు వ్యాధి నిరో ధక శక్తి పెరిగి ఆరోగ్యవంతంగా జీవిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విద్యశ్రీ, ఏఎన్ఎం శోభ, అంగన్వాడీ టీచర్ పారిపెల్లి రాణి, ఆశా కార్యకర్త సువర్ణ పాల్గొన్నారు.

నల్లబెల్లి : తల్లిపాల ఆవశ్యకతను గురించి తెలపడానికి తల్లిపాల వారోత్సవాలను ఆగస్టు మొదటివారం నిర్వహించడం జరుగుతుందని తల్లిపాలే అమతం కంటే ఎక్కువ అని సూపర్వైజర్ ఝాన్సీ రాణి అన్నారు. కేంద్రంలోని అంగన్వాడి సెంటర్ 3లో తల్లిపాల వారోత్సవాలు సోమవారం నిర్వహించి పిల్లలకు అక్షర అభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సూపర్వైజర్ ఝాన్సీరాణి, శ్యామల పాల్గొని మాట్లాడారు. పుట్టిన బిడ్డలకు వెంటనే తల్లిపాలను (ముర్రుపాలు) అందించడం ద్వారా అనేక రోగాలు రాకుండా కాపాడుతాయని భవిష్యత్తులో వ్యాధి నిరోధక శక్తి పెరిగి వ్యాధులు సంక్రమించవని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు ధనలక్ష్మి, సునీత, సువర్ణ, భాగ్యలక్ష్మి, ఆశ వర్కర్లు, పిల్లలు, గర్భిణీ స్త్రీలు, తల్లులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. మండలంలోని కొండాపురం గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో సోమవారం పంచాయతీ కార్యదర్శి రజిత అంగన్వాడి టీచర్ అని తల్లిపాల వారోత్సవాలను నిర్వహించి తల్లిపాల ఆవశ్యకతను గురించి వివరించారు.

హసన్‌పర్తి : తల్లిపాలు బిడ్డకు శ్రేష్టమైనవని సెయింట్ జాన్ నర్సింగ్ కళాశాల చైర్మెన్ శంకరయ్య అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని మండలంలోని ఎల్లాపూర్ సెయింట్ జాన్ నర్సింగ్ కళాశాల విద్యార్థినీలు ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో గర్భిణీలు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఫ్లకార్డులు ప్రదర్శించి తల్లిపాల విశిష్టత గురించి వివరించారు. ఈ సందర్భంగా చైర్మెన్ శంకరయ్య మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆగస్టు మొదటి వారంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవం కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నట్లు తెలిపారు. ప్రతి తల్లి తనకు పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టించడం వల్ల బిడ్డలో రోగ నిరోదక శక్తి పెరుగు తుందన్నారు. పనిచేసే తల్లులు కూడా తల్లిపాలు పట్టడం ద్వారా చాలా మార్పులు పొందవచ్చున్నారు. ఈకార్య క్రమంలో కళాశాల ప్రధానోపాధ్యాయులు మహ్మద్ శమీన, వైస్ ప్రిన్సిపాల్ పి.కవిత, లెక్చరర్ సుజాత, నర్సింగ్ విద్యా ర్థినీలు పాల్గొన్నారు.